
Deccan Land




April | April 2026

Deccan

ఏప్రిల్ - 2026


PRGI Regn. No. TELTEL/2012/46784
₹ 30
సంపుటి : 14
సంచిక : 8

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

DECCAN LAND, HYDERABAD
164
APRIL - 2026

UNESCO, India Tentative List (TL) Site - 2021: VARANASI (Uttara Pradesh)



VOL 14వ వసంతంలో
164 ISSUES నూట అరవై నాల్గవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్




- మహానగరాలు కృంగుతున్నాయా!
- తెలుగువారి కోసం ప్రపంచ విశ్వవిద్యాలయం
- నిడిగొండ చరిత్ర తొవ్వల్లో...
- చేతిరాత నిశ్శబ్ద ఆత్మహత్య...





**Puppetry Workshop:** Students explore creativity and storytelling through vibrant puppetry, blending art, expression, and imagination.




## APRIL 2026

**Educational Trip to Kerala:** An enriching journey through the landscapes of Kerala, where students experienced learning beyond the classroom.

Oxford Grammar High School
#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com
ogs JUNIORS
45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | | |
| | | | | | | |

**Important Dates**


03 Apr - Good Friday

14 Apr - Dr. B. R. Ambedkar Jayanti

NOTES : ______________________

Printed at : Deccan Press, Azamabad,
Hyderabad. Ph. +91 90599 50055

Every lesson you learn today is a step closer to the life you imagine.




**UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2021**

Serial Nomination for
Iconic Riverfront of the Historic City of Varanasi
in Uttar Pradesh State,
Province or Region India. Category: Cultural

## కాలానికి అతీతంగా వారణాసి

వారణాసి.. ఈ పేరు వింటే చాలు.. భక్తుల మనస్సుల్లోనే కాదు.. ప్రాచీన వారసత్వ పరిరక్షకుల మనస్సుల్లోనూ ఒక విధమైన పులకింత కలుగుతుంది. అందుకు కారణం ప్రపంచపు అత్యంత ప్రాచీన సజీవ నగరాల్లో ఇది కూడా ఒకటి. చారిత్రక పత్రాలు, శాస్త్రీయ విశ్లేషణలు వారణాసి నగరం ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన, నిరంతరం జనజీవనం సాగుతున్న నగరాలలో ఒకటి అనే వాస్తవాన్ని ధృవీకరిస్తున్నాయి. విశిష్టమైన ఘాట్లు, దేవాలయాలు, చారిత్రక నివాసాలు, సజీవ మత పరమైన, సాంస్కృతిక సంప్రదాయాలతో నిండిన వారణాసి, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ఒక అత్యున్నత రూపం. ఇక్కడి ఘాట్లు ఆయా సంప్రదాయాలకు ప్రతి రూపాలుగా నిలుస్తాయి. గంగానదికి ఉన్న అపారమైన పవిత్రత కారణంగా, ఈ నదీ తీర ప్రాంతం (రివర్ ఫ్రంట్) నగరంలోనే అత్యంత కీలకమైన భాగం.

*ప్రత్యేక వ్యాసం : 29వ పేజీలో*

TELANGANA RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## ప్రొఫెషనల్ పత్రిక దక్కన్‌ల్యాండ్

ఆసక్తికర ఫోటో కథనాలతో, ప్రొఫెషనల్‌గా, అందంగా, చూడగానే అకట్టుకునేలా డిజైనింగ్, చదవాలనిపించే కథనాలతో వెలువడుతున్న దక్కన్‌ల్యాండ్ పత్రికకు అభినందనలు. ఐఎస్‌బీఎన్‌తో ప్రచురితమయ్యే అతి కొద్ది పత్రికల్లో దక్కన్‌ల్యాండ్ ఒకటి. సంపాదకులు మణికొండ వేదకుమార్‌కు మరియు దక్కన్‌ల్యాండ్ టీం సభ్యులకు నా శుభాకాంక్షలు.

– పున్నా కృష్ణమూర్తి, హైదరాబాద్

❖ ❖ ❖

## సాంస్కృతిక వైభవానికి ప్రతీక దక్షిణభారతం

దక్షిణ భారతదేశం అంటే తమిళం అన్నట్లు చూస్తారు అందరూ. తమిళ భాషకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. అలా నార్త్ ఇండియాకు ధీటుగా ఉంది తమిళనాడు. శివగంగ, పుదుక్కొట్టై జిల్లాల్లో విస్తరించి ఉన్న తమిళ వ్యాపారుల గ్రామ సమూహాలు చెట్టినాడ్‌కు చారిత్రక, సాంస్కృతిక, శక్తివంతమైన వ్యాపార సామాజిక వర్గానికి నిలయం. చెట్టినాడ్ ఒక గ్రామం కాదు, దాదాపు 75 గ్రామాల కలయికతో ఉంది. కారైకుడి ఈ ప్రాంతానికి ప్రధాన కేంద్రం. 13వ శతాబ్దంలో కావేరి నదికి వచ్చిన భారీ వరదల కారణంగా చెట్టియార్లు ఈ ప్రాంతానికి వలస వచ్చి స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. బర్మా, శ్రీలంక, వియత్నాం, మలేషియా వంటి ఆగ్నేసియా దేశాలతో వ్యాపారం చేసి ఆర్థిక వైభవంతో నిలదొక్కుకున్నారు. వీరు సంపాదించిన సంపదతో నిర్మించిన భవంతులు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. వీటి వాస్తు శిల్పంకు యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకుంది. బర్మా, ఇటాలియన్, బెల్జియం వంటి విదేశీ వస్తువులతో కోటల్లాంటి ఇళ్లను నిర్మించారు. విశాలమైన ప్రాంగణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి ఈ ఇళ్లు. యునెస్కో గుర్తింపుతో చెట్టినాడు ప్రాంత విశిష్టత అంతర్జాతీయ స్థాయికి వెళ్లింది.

– ఎ. సృజన్ నాయర్, హైదరాబాద్

❖ ❖ ❖

## భూగోళానికి ముప్పు

జీవరాశులు, వాటి ఉనికి, భూగోళం, వాతావరణ సమతుల్యత గురించి లచ్చయ్య సర్ రాసే వ్యాసాలు ప్రతి విద్యార్థికి ఎంతో ఉపయోగపడుతూ, అవగాహన కల్గిస్తున్నాయి. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా ఈ వ్యాసాలు చక్కగా ఉపయోగపడతాయి. గత నెల రాసిన 'భూగోళం – అంతర్గత, బాహ్యకారకాలు!' వ్యాసంలో భూమి గురించి అనేక విషయాలు తెలియజేశారు. భూమి ఏర్పడి 4.54 బిలియన్ సంవత్సరాలు అయ్యిందని అంచనా వేస్తే నాటి నుండి నేటికి భూమి ద్రవ్యరాశి కేవలం 10 శాతం మాత్రమే పెరిగిందని తెలిపారు. గ్రహాల వల్ల భూమికి బాహ్యంగా పెద్ద ముప్పు అంటూ ఏమిలేదంటారు. సైన్స్ మన నమ్మకాలకు ఎప్పుడూ అతీతంగా, ఉన్నతంగా పయనిస్తుందంటారు. ఎన్నో విశ్వరహస్యాల్ని చేధిస్తూ మానవాళి మనుగడకై బాటలు వేస్తున్నది. ప్రకృతి తనపనిని తాను చేసుకుంటూ పోతున్నది. జీవరాశి పుట్టుక, ఎదుగుదలకు, రూపాంతరాలకు కారణమైన ఈ భూగోళం కూడా అంతర్గత, బాహ్య కారణాలకు నిరంతరం గుర్రై పెను ప్రమాదానికి గురికాక తప్పదంటారు. నేటి మానవాళి చేస్తున్న తప్పిదాలతో రచయిత చెప్పింది అక్షరాల నిజమవుతుంది. రచయిత లచ్చయ్యకు నా కృతజ్ఞతలు.

– ఎన్. ప్రవీణ్, వరంగల్

❖ ❖ ❖

## వ్యవసాయ జన్మస్థలం పూసా

బీహార్ రాష్ట్రం, సమస్తిపూర్ జిల్లాలోని పూసా కేంద్రం భారత వ్యవసాయానికి జన్మస్థలం. 1784లో స్థాపించబడిన బ్రిటీష్-ప్రేరేపిత గుర్రపు స్టడ్ ఫామ్‌కు ప్రసిద్ధి చెందింది. జంతు జీవవైవిధ్యం, సహజ తెగులు నిర్వహణ, వ్యవసాయ జీవవైవిధ్యం యొక్క జ్ఞానం చాలా ముఖ్యమైనది. పూసా పరిసర ప్రాంతాల్లోని 1,325 పక్షులు తినే పదార్థాల అన్వేషణతో జీవవైవిధ్యం గురించి అద్భుతంగా తెలియజేశారు. డ్రోంగోలు, స్విఫ్ట్‌లు, రోలర్లు లాంటి జాతులు స్వచ్ఛమైన కీటక భక్షకుల గురించి వ్యవసాయానికి సంబంధించిన అనేక విషయాలు 'పక్షి వైవిధ్యం – వ్యవసాయ మార్గనిర్దేశం' వ్యాసం ద్వారా తెలిసాయి.

– నూతన ప్రవళిక, సంగారెడ్డి

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక ISSN (International Standard Serial Number) ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా ISSN 2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.

రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :
"చంద్రం" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

– ఎడిటర్

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 14 సంచిక : 8 పేజీలు : 60

ఏప్రిల్ - 2026



సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

వాణిజ్య ప్రకటనలు

**కె. సచిన్**

86866 64949

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

కవర్‌పేజీ

**వారణాసి**

layout - Composing & Printed @

DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020

Mobile: 90599 50055

deccanpress.hyd@gmail.com

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,

Himayatnagar, Hyderabad - 500 029

TELANGANA

Mobile: 9030626288

Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com



**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.


# లోపలి పేజీల్లో...



కవర్ స్టోరీ
29వ పేజీలో

మాక్షికం స్వర్ణసంకాశం
-పైరైట్



ఒలందులైన
హాలండీయులు-డచ్‌వారు




హైదరాబాద్ సంస్కృతి అంటే ప్రాణం: జిలానీ బానో ..................... ఎసికె. శ్రీహరి ......................... 6

ప్రజలు యుద్ధంలేని ప్రపంచాన్ని కోరుకుంటున్నారు.. (ఎడిటోరియల్)వేదకుమార్. యం ..................... 7

మాక్షికం స్వర్ణసంకాశం - పైరైట్ ................................ చకిలం వేణుగోపాలరావు ................. 9

చేతిరాత నిశ్శబ్ద ఆత్మహత్య ................................................ పరవస్తు లోకేశ్వర్ .................... 12

2000 ఏండ్ల క్రితమే తెలంగాణలో గజలక్ష్మి ఆరాధన! .......... ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ............. 15

జిమ్ కార్బెట్ సాబ్... ఓ ప్రకృతి రచయిత ............................ డా॥ ఆర్. సీతారామారావు ............. 16

కృష్ణా తీరంలో మరుగున పడిన మహానగరం ...................... ద్యావనపల్లి సత్యనారాయణ ............ 18

పుడమిని రక్షించుకుందాం! ............................................... జుగాష్‌విలి ........................ 20

ఇంటాక్ న్యూఢిల్లీ గవర్నింగ్ కౌన్సిల్‌గా వేదకుమార్ మణికొండ ....... కట్టా ప్రభాకర్ ......................... 21

ఒలందులైన హాలండీయులు-డచ్‌వారు ................................ మహ్మద్ సిలార్ ....................... 22

ఆధ్యాత్మిక నిలయం.. బ్రహ్మంగారిమఠం ................................ కె. చిన్నపరెడ్డి ......................... 25

జిర్‌కోనియం మూలకం యొక్క ఖనిజాలు ............................ కమతం మహేందర్‌రెడ్డి ................. 27

కాలానికి అతీతంగా వారణాసి ............................................. ఎన్. వంశీమోహన్ .................... 29

సంగారెడ్డి జిల్లా కల్పగూరు కాకతీయ దేవాలయ పునరుద్ధరణ .... బావండ్ల నారాయణ .................... 35

దేశదేశాల తెలుగువారి కోసం ప్రపంచ విశ్వవిద్యాలయం ...... డా॥ నాగసూరి వేణుగోపాల్ ............ 37

కర్నూలు నందు అరుదైన శ్రీచక్రలింగం ................................ డా॥ జి.యస్. రామయ్య ............... 39

యుద్ధ వాతావరణంలో కవిత్వం ....................................... మంగారి రాజేందర్ (జింబో) ............ 41

నిడిగొండ చరిత్ర తొవ్వల్లో.. ............................................ శ్రీరామోజు హరగోపాల్ ................ 43

మహానగరాలు కృంగుతున్నాయా..!! ..................................... డా॥ లచ్చయ్య గాండ్ల .................. 47

భావితరాలకు వారసత్వ స్ఫూర్తి! ....................................... కొత్వాల్ సచిన్ ........................ 50

సార్వభౌమత్వ విత్తనాలు ................................................ డౌన్ టు ఎర్త్ ......................... 51

మంచి పుస్తకం ............................................................. డా॥ నాగసూరి వేణుగోపాల్ ............ 54

ఉపాధ్యాయునికి ఒక లేఖ .................................................. డా॥ రవికుమార్ చేగోని ................ 55

పూటకూళ్ళవ్వ (కథ) ........................................................ మాదారపు వాణిశ్రీ ..................... 57


**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# హైదరాబాద్ సంస్కృతి అంటే ప్రాణం

20వ శతాబ్దపు ఉత్తరార్ధంలో భారత ఉర్దూ కథా సాహిత్యానికి కొత్త దిశను చూపిన రచయిత్రులలో జిలానీ బానో ప్రముఖులు. ఆమె అసలు పేరు జైనత్ సాజిదా. జిలానీ బానో 1936 జూలై 14న ఉత్తరప్రదేశ్‌లోని బదాయూన్‌లో జన్మించారు. బానో తండ్రి హైరత్ బదాయూని ప్రసిద్ధ ఉర్దూ కవి. దక్కన్ సంస్కృతి, నిజాం కాలపు హైదరాబాద్ వాతావరణం ఆమె మనసులో లోతైన ముద్ర వేసింది. ఈ వాతావరణమే రచనలలో పదే పదే ప్రతిధ్వనించింది. చిన్నప్పటి నుంచే సాహిత్యం పట్ల ఎంతో మక్కువ కలిగిన జిలానీ బానోకు ఉర్దూ కవిత్వం, కథలంటే ఎంతో ఇష్టం. తండ్రి ద్వారా ఉర్దూ సాహిత్యంతో ఆమెకు పరిచయమేర్పడింది. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన బానో ఉర్దూ భాషలో ఉన్నత విద్య అభ్యసించారు. 1950 దశకంలో సాహిత్య రచన ప్రారంభించారు. మొదట కవితలు, తర్వాత కథలు రాశారు. అప్పటి ఉర్దూ సాహిత్య సంస్కరణ ఉద్యమాల ప్రభావం బానో రచనలపై కనిపిస్తుంది. ప్రగతిశీల రచయితల సంఘంతో సాన్నిహిత్యం ఆమె రచనా విధానాన్ని ప్రభావితం చేసింది. ప్రముఖ రచయితలైన సాదత్ హసన్ మంటో, ఇస్మత్ చుగ్తాయి తదితరుల రచనలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి.



## స్వేచ్ఛనిచ్చాడు...

వారి నాన్న గొప్ప షాయర్ (కవి), అంతే గొప్ప స్కాలర్ కూడా! వారి ఇల్లు పుస్తకాల నిలయంగా ఉండేది. అందులో విదేశీ రచయితల పుస్తకాలతోపాటు పాకిస్థాన్ రచయితల పుస్తకాలూ ఉండేవి. సంగీత కచేరీకి వారి ఇల్లు పెట్టింది పేరు! సాయంత్రం అయిందంటే చాలు రోజూ ఇంట్లో సంగీత కచేరీ జరిగేది. ఆ వాతావరణంలో పెరిగిన వారికి అటు సాహిత్య పఠనం, ఇటు సంగీత శ్రవణం రోజువారీ కార్యక్రమాల్లో భాగం అయ్యాయి. అవే వారి రచనాశక్తికి ప్రేరణ, స్ఫూర్తిని కలిగించాయని చెప్పొచ్చు! ఆమెకు పాడడం రాకపోయినా హిందుస్థానీ సంగీతంలోని ప్రతి రాగాన్ని గుర్తుపట్టగలదు. ఏదైనా రాగం వినిపించి అదే రాగమో అడిగితే తడుముకోకుండా ఠక్కున రాగం పేరు చెప్పగలదు! ఇస్లాం సంప్రదాయ హద్దుల్లోనే పెరిగినా వారి నాన్న వారికి అన్ని విషయాలు నేర్చుకునే స్వేచ్ఛనిచ్చాడు. ఒకేదానికి పరిమితమై పోవడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. అయితే వారి మేనమామ మాత్రం కొంచెం స్ట్రిక్ట్‌గా ఉండేవాడు. వారి చిన్నప్పుడు వారి అమ్మ ఇస్మత్ ఛుగ్తాయ్ పుస్తకాలను లైబ్రరీ నుంచి తెప్పించుకొని బాగా చదివేది. ఆమెతోపాటు జిలానీ బానో కూడా చదివేది. కానీ వారి మమయ్యకు ఇష్టం ఉండకపోయేది. 'ఇవి ఆడవాళ్లు చదివే పుస్తకాలు కావు, చదవొద్దు' అని వాళ్ల అమ్మతో చెప్పేవాడు. అలాంటి కట్టుబాట్లు కొంచెం ఉండేవి. కానీ మరీ ఆడవాళ్లు గడప దాటకూడదు అనే ఆంక్షలైతే లేకుండేవి!

## పల్లె జ్ఞానం...

వారి చిన్నప్పుడు వారి ఇంట్లో లక్ష్మి అనే హిందూ మహిళ పనిచేసేది. జిలానీ బానోను పెంచింది కూడా ఆవిడే! సెలవుల్లో లక్ష్మితో వాళ్ల ఊరికి వెళ్లేవాళ్లు. ఎడ్ల బండ్లమీద ప్రయాణం! లక్ష్మీ వాళ్ల ఊరు వెళ్లిన ప్రతీసారి అక్కడి ప్రజలు, వాళ్ల జీవన విధానం, సమస్యలు, అవసరాలు వగైరా అన్నిటినీ పరిశీలించేవారు. భూస్వాములు, నాయకులు పిల్లలతో వెట్టి చేయించుకునేవారు. చదువంటే తెలిసేది కాదు వాళ్లకు. ఇట్లా ఆ పల్లెటూరు బానోకు చాలా విషయాలను నేర్పింది. ఎంతో జ్ఞానాన్నిచ్చింది. తర్వాత తర్వాత అవే బానో రచనలకు మూల వస్తువులయ్యాయి.

## పద్నాలుగేళ్లకే కథ..

బానో ఓ కథ రాశారట 'దూర్ కి ఆవాజ్' పేరుతో! అది చూసిన మగ్దూం వారి నాన్నతో 'అంత చిన్న పిల్లకు సమాజం గురించి ఏం తెల్సని పెద్ద పెద్ద విషయాల మీద కథ రాస్తుంది? అలాంటివి రాయొద్దని చెప్పు జిలానీతో' అని అన్నారట! బానో నాన్న ఇంటి కొచ్చి 'మగ్దూం ఇలా అంటున్నాడు.. అలాంటి విషయాల మీద తప్ప ఇంక దేనిమీదైనా రాసుకోమ్మా' అని ఆమెతో చెప్పాడట. తర్వాత కొన్ని రోజులకు ఏదో పనిమీద మగ్దూం వారి ఇంటికి వచ్చాడు. 'జిలానీ.. కథలు బాగా రాస్తున్నావ్.. శభాష్! అలాగే మంచిగా రాయి' అని మెచ్చుకున్నాడట. ఆమె నాన్నతో 'ఈ అమ్మాయి మీద ఆంక్షలేమీ పెట్టకు. తనకు నచ్చింది రాయనియ్' అని చెప్పాడట. బానో రచనలను చదివి పాకిస్థాన్‌లో ఉన్న రచయితలు కూడా 'బాగా రాస్తున్నావ్' అని ప్రశంసిస్తూ ఉత్తరాలు రాసేవారు. ఇంటర్ పూర్తవగానే పెళ్లయింది. ఆమె భర్త కూడా మంచి షాయర్, ఆలీగఢ్ యూనివర్సిటీ ప్రొఫెసర్. రైటర్, టీవీ సీరియల్ డైరెక్టర్. ఆమె భర్త కూడా ఆమె చదువుకునే స్వేచ్ఛనిచ్చాడట. ఎక్కడా టామె ఆసక్తులకు ఆటంకం కలిగించలేదు. అందుకే పెళ్లయ్యాకే జామియా యూనివర్సిటీ నుంచి బీఏ, ఢిల్లీ

(మిగతా 8వ పేజీలో)

# ప్రజలు యుద్ధంలేని ప్రపంచాన్ని కోరుకుంటున్నారు..




ప్రపంచానికి యుద్ధాలు కొత్తకాదు. యుద్ధం రెండు లేదా కొన్ని దేశాలమధ్య పెద్ద ఎత్తున జరిగే ఘర్షణ. మానవసమాజపు ఆకృతిని రూపొందించిన కీలక సంఘటనలు యుద్ధాలు. యుద్ధాలు భౌగోళిక, రాజకీయ, సాంస్కృతిక మార్పులకు కారణమవుతాయి.

క్రీస్తుపూర్వం నుంచీ అధికారం కోసం, రాజ్యవిస్తరణ కోసం యుద్ధాలు జరుగుతూనే వున్నాయి. రోమన్, జర్మనిక్, పర్షియన్, రోమన్ సరిహద్దు సంఘర్షణలు వందల సంవత్సరాల పాటు జరిగాయి. భారతదేశ చరిత్రలో కళింగయుద్ధం (క్రీ.పూ. 261), ప్లాసీ యుద్ధం ప్రసిద్ధి పొందాయి. కళింగయుద్ధం అశోకున్ని బౌద్ధుడిగా మార్చింది. ఎక్కడ యుద్ధం జరిగినా ప్రధానంగా జననష్టం, ఆస్థినష్టం జరుగుతాయి.

మొదటి ప్రపంచ యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా అనేక రాజకీయ మార్పులు జరిగాయి. ఇందులో పాల్గొన్న దేశాలు తమ జీడీపీలో 60% శాతం ఖర్చు పెట్టాయి. 85 లక్షల మరణాలు సంభవించాయి. 2.18 కోట్ల మంది గాయాల పాలయ్యారు. యుద్ధానంతరం వివిధ దేశాల మధ్య కొత్త ఒప్పందాలు జరిగాయి. ఈ యుద్ధంలో 13 లక్షల మంది భారతీయ సైనికులు పాల్గొన్నారు.

ఆధునిక కాలంలో యుద్ధాలు పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్నాయి. వైమానిక, సముద్ర యుద్ధాలతోపాటు సైబర్ యుద్ధాలు, డ్రోన్లు, క్షిపణులు, ఉపగ్రహ యుద్ధ వ్యవస్థలు కూడా భాగంగా మారాయి. ప్రస్తుతం అమెరికా, ఇజ్రాయిల్ – ఇరాన్ల మధ్య జరుగుతున్న యుద్ధం క్షిపణి, డ్రోన్లు, అంతర్జాతీయ సముద్ర మార్గాల మధ్య ఆధారపడి వున్న వ్యూహాత్మక పోరుగా నడుస్తోంది.

ఆధునిక యుద్ధాలు యుద్ధంలో పాల్గొంటున్న దేశాలకే పరిమితం కావు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలను, వస్తు సరఫరా అనుసంధాలను, ఇంధనం, ఆహార ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ఒక దేశం మరో దేశంపై సైనిక ఆధిపత్యం సాధించడం కంటే ఆర్థిక, సాంకేతికస్థాయిలో వాటిని బలహీనపర్చడంపై వ్యూహాలు ఆధునికయుద్ధంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

యుద్ధాలు ప్రజలకు, దేశానికి, ప్రకృతికి, పర్యావరణానికి పెద్ద నష్టాలు కలిగిస్తాయి. ఇళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, ఫ్యాక్టరీలు మౌలిక ఆస్తులన్నీ ధ్వంసమవుతాయి. ఉపాధి తగ్గుతుంది. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమవుతాయి. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. రసాయనాల వాడకం వల్ల నేల, నీరు, గాలి కలుషితం అవుతాయి. యుద్ధనష్టాలు రెండు మూడు తరాలను వెంటాడుతాయి.

ప్రత్యక్ష సంబంధం లేకపోయినా ఈ యుద్ధ ప్రభావం మన దేశ ప్రజలమీద బలంగా పడుతుంది. పెట్రోలు, గ్యాస్ దొరకనిస్థితి. వీటిమీద ఆధారపడిన పరిశ్రమలూ, వ్యాపారాలూ మూతపడుతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యుద్ధం ఆగినా ఈ సంక్షోభం వెంటాడుతుంది.

ఈ స్థితిని ప్రజలు ఎప్పుడూ కోరుకోరు. సామాన్య ప్రజలు యుద్ధాలు లేని ప్రపంచాన్ని కోరుకుంటున్నారు.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

*(6వ పేజీ తరువాయి)*

యూనివర్సిటీనుంచి ఎమ్మే చేశారు. పీహెచ్‌డీ చేయాలనే తపన ఉన్నా పిల్లలు, ఇతర బాధ్యతలతో కాలేదు.

**వెల్‌డన్ అబ్బా..**

హైదరాబాద్ పరిసరాలు, పరిస్థితుల నేపథ్యంతో 'నర్సయ్యకీ బౌడీ' అనే టెలీప్లే రాశారు. దాన్నే శ్యాం బెనెగళ్ 'వెల్‌డన్ అబ్బా' పేరుతో సినిమా తీశారు. అసలు హైదరాబాద్‌కున్న కల్చరే వేరు. వందల ఏండ్ల కిందటి నుంచే ఇది కాస్మోపాలిటన్ కల్చర్‌కు కేరాఫ్‌గా ఉంది. హిందూ, ముస్లింలు సహజీవనం చేస్తారిక్కడ. అదే హైదరాబాద్ పెహచాన్! దేశంలో ఇంకెక్కడికి వెళ్లినా ఈ అద్భుతం కనిపించదు మనకు అంటారు. అంతెందుకు మా చిన్నప్పుడు మేం మల్లేపల్లిలో ఉన్నప్పుడు మా పనమ్మాయి లక్ష్మితో కలిసి హిందూ దేవాలయాలకు వెళ్లేవాళ్లం. దసరా ముందు బతుకమ్మ ఆడేవాళ్లం. అందుకే నాకు హైదరాబాద్ సంస్కృతి అంటే ప్రాణం అంటారు. ఆ కల్చర్ మీద బోలెడు రచనలు చేశారు. దీనికి ఇప్పటి యువత దూరమవుతోంది. సాహిత్యం అంటే ఇప్పటి పిల్లలకు పరిచయంలేని విషయం. పుస్తకాలు చదివితేనే సమకాలీన సమాజం తెలుస్తుంది. చరిత్రా అవగతమవుతుంది. మానసిక పరిణతి పెంచేవి ఇవేకదా! సాహిత్యం తర్వాత తరాలకు ఓ గైడ్ లాంటిది. మా మనవలు, మనవరాళ్లకు మాత్రం వీటన్నిటితో స్నేహం చేయిస్తున్నాను అని అనేవారు.



నాటి హైదరాబాద్ నగరంలోని అణచబడిన స్త్రీల హృదయపు నిశ్శబ్ద గుండె చప్పుడును తన రచనల్లో జిలానీ బానో చిత్రించారు. ఆమె రచనల్లో సంస్కృతుల మధ్య వెలిసిన గోడలు, స్త్రీ పురుషుల నడుమ అన్యాయం చూస్తాం. కానీ అదే వెలుగులో మనం 'మార్పు అనివార్యం' అని కూడా చూస్తాం. జిలానీ బానో దృష్టిలో అస్తిత్వం అంటే ఒక స్త్రీ తన కథను చెప్పగలిగే హక్కు, ఒక నగరం తన గాయాలను దాచుకోకుండా చూపించగలిగే ధైర్యం. ఒక సంస్కృతి తన పాత ముసుగులను విప్పి కొత్త వెలుగులో నిలబడగలిగే నిబద్ధత. హైదరాబాద్ పాత హవేలీలో ఒక దీపం ఇన్నేళ్ళూ వెలిగింది. ఆ వెలుగు అందరి కంటికి అంతగా కనిపించకపోయినా మనసుకు మాత్రం దారి చూపుతుంది. ఆ వెలుగే జిలానీ బానో.

**వాళ్ల కొరత ఎక్కువే..**

ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాషలోనే జరగాలనే వారు. అప్పుడే మాతృభాష వికాసం చెందుతుంది. విస్తృతమవుతుంది. భాషతోనే సంస్కృతి బతుకుతుంది. అలాగని ఇంగ్లీష్ అవసరంలేదు అనను. కానీ మాతృభాష మీద పట్టు అత్యంతావశ్యకం అంటారు! తెలుగు మాట్లాడగలరు, కానీ చదవలేరు కాబట్టి తెలుగు సాహిత్యం లోతుపాతుల గురించి అంతగా తెలియదంటారు. హిందీ, ఉర్దూ భాషల్లో రొమాన్స్ గురించే కాదు సమాజంలోని పరిస్థితులు, సమస్యల గురించీ మంచి రచనలు చేసేవాళ్లు ఉన్నారు. నేటి పరిస్థితులను చూస్తుంటే ఒక రచయితగా నేను చేయాల్సింది ఇంకా చాలా ఉంది అనేవారు. మగ్దూం కవితలతో నేను స్ఫూర్తి పొందుతుంటాను అనేవారు. ఆయనలాంటి కవులు ఇప్పుడు లేరు. కొరత అనిపిస్తుంటుంది. అసలు ఇప్పటి తరంలో రచయితలు, కవులు, కళాకారులు, చిత్రకారులు చాలా చాలా తక్కువ! వాళ్ల కొరత ఎక్కువే అనేవారు!

జిలానీ బాను సాహితీవేత్తగానే కాదు సామాజికవేత్త కూడా! వెట్టిచాకిరి, స్త్రీ సమస్యలు, నగర జీవితంలోని ఒత్తిళ్లు మొదలైన అంశాల మీద పనిచేసింది. అస్మిత స్వచ్ఛంద సంస్థకు చైర్ పర్సన్ బాధ్యతలను నిర్వహించింది. అంతేకాదు చైల్డ్ అండ్ విమెన్, హ్యూమన్‌రైట్స్, ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్(ఇండియా)కు ప్రిన్సిపల్ అడ్వైజర్‌గా కూడా పని చేశారు. ఉర్దూభాషకు సంబంధించి విశేష కృషిచేసిన 89 ఏళ్ల జిలానీబానును గాలిబ్, ఆల్‌ఇండియా ఔమీ హాలీ, ఆలమ్ ఎ ఉర్దూ ఫరోఘి అవార్డులతో పాటు ఎన్నో దేశవిదేశీ సత్కారాలు వరించాయి.

ఆమె కథ, మాటలు స్క్రీన్‌ప్లే అందించిన 'నర్సయ్యకీ బౌడీ' దూరదర్శన్‌లోధారావాహికగా ప్రసారమవడమే కాకుండా.. శ్యామ్ బెనగల్ దర్శకత్వంలో 'వెల్‌డన్ అబ్బా' సినిమాగా రూపుదిద్దుకుంది. ఆమె రచనలు కొన్నింటిని దాశరథి రంగాచార్య తెలుగులోకి అనువదించారు. జిలానీ బానో రచనలు కేవలం భారతీయ భాషలకే పరిమితం కాలేదు. రష్యన్, ఇంగ్లిష్, జర్మన్, నార్వేజియన్ వంటి యూరోపియన్ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆమె సాహిత్యంపై ఉజ్బెకిస్తాన్ వర్సిటీ, ఢిల్లీ జెఎన్‌యూ, అలీఘడ్ ముస్లిం వర్సిటీల్లో పరిశోధనలు జరిగాయి. సాహిత్యరంగానికి ఆమె చేసిన సేవలకు 2001లో పద్మశ్రీ అవార్డు వరించింది.

జిలానీ బానో (89) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ 2026 మార్చి 1న తన స్వగృహంలో మరణించింది.

– ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

# మాక్షికం స్వర్ణసంకాశం - పైరైట్ (Pyrite)

**బం**గారు రంగులో మెరుస్తూ ఎవరో తయారు చేసినట్లు ఉండే చక్కటి, చతుర్భుజాలతో కూడిన పెట్టెల వంటి ఆకారాల కణాలను కలిగివుండే పైరైట్, ఆదిమకాలం నుండి మానవులను ఆకర్షించింది. పేరుకు తగ్గట్టే అగ్నితో దీని అనుబంధం అనాదిగా వస్తోంది. రాతిపై కొట్టి నిప్పు రగిలించడానికి మొదట పైరైట్ వాడేవారు.

రోమన్లు దీన్ని అద్దాలు తయారు చేయడానికి వాడారు. పురాతన గ్రీసులో దీనితో ఆభరణాలు తయారు చేశారు. ఇంకా పూర్వం, దాదాపు 5000 సంవత్సరాల క్రితం నుండి పైరైట్ వాడకంలో ఉంది. అజ్టెక్ నాగరికతలో పైరైట్‌తో అద్దాలు చేసేవారు. పెరూలో పైరైట్ అద్దాల శకలాలు దొరికాయి.




బంగారు వేటకాలం (Gold Rush)లో కాలిఫోర్నియాలో బంగారం వెతికే వారు, పైరైట్‌ను చూసి బంగారం అనుకొని మోసపోయేవారు. "Fools Gold" పేరు ఇక్కడే బాగా ప్రాచుర్యం చెందింది. నిజమైన బంగారానికి, పైరైట్‌కు తేడా కనిపెట్టడం అప్పటిలో కష్టంగా ఉండేది.

**16వ-17వ శతాబ్దం:** తుపాకులలో Flintlock మెకానిజంలో పైరైట్ వాడేవారు. తుపాకి గుండు పేల్చడానికి పైరైట్ నిప్పు రవ్వలు వాడేవారు. యూరప్ యుద్ధాలలో ఇది చాలా కీలకంగా ఉండేది. మొదటి ప్రపంచయుద్ధం (1914-1918): సల్ఫ్యూరిక్ యాసిడ్ తయారీకి పైరైట్ వాడారు. గన్‌పౌడర్, పేలుడుపదార్థాలు తయారుచేయడానికి కూడా ఇది ఉపయోగపడింది. స్పెయిన్, పోర్చుగల్ పైరైట్ గనులు యుద్ధంలో వ్యూహాత్మకంగా మారాయి.

**భారతదేశంలో చరిత్ర:** దాదాపు 2000 సంవత్సరాల క్రితం నుండి ఆయుర్వేద వైద్యంలో దీనిని వాడారు. చరక సంహిత, సుశ్రుత సంహితలో పైరైట్(మాక్షికం) ప్రస్తావన ఉంది. మాక్షికభస్మం తయారీ పురాతనకాలం నుండి వస్తోంది. వరాహమిహిరుడు ప్రస్తావించిన 22రకాల రత్నాలలో ఇది "విమలకం"గా పేర్కొనబడింది.

**మొఘల్ కాలంలో:** రాజస్థాన్, బీహార్ గనులలో పైరైట్ తవ్వారు. దీనిని ఆభరణాలలో, వైద్యంలో విరివిగా వాడారు.

**బ్రిటిష్ కాలంలో:** సల్ఫ్యూరిక్ యాసిడ్ పరిశ్రమ కోసం గనులు తవ్వారు. బీహార్‌లోని అమ్జోర్ పైరైట్ గనులు బ్రిటిష్ వారి కాలంలో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

**ఆ పేరు ఎలా వచ్చింది:** పైరైట్‌ను ఉక్కు లేదా ఇతర లోహంతో రాపిడి చేస్తే, దీని నుండి నిప్పురవ్వలు (Sparks) వస్తాయి. "పైరైట్" అనే పేరు గ్రీకుపదం "పైర్" (Pyr -నిప్పు) నుండి వచ్చింది.

పైరైట్ ఖనిజ సమూహం తేనెతుట్టెను పోలిన ముద్దలుగా కనిపిస్తుంది. కాబట్టి దీన్ని మనదేశంలో మాక్షిక ధాతువు (మాక్షికం) అని, మంచి సౌష్టవం ఆకారాలు కలిగిన పెద్ద కణాలుగా ఉండటం వల్ల విమలకం అని కూడా అన్నారు.

**రసశాస్త్రం ప్రకారం:** తెలుపు రంగులో ఉన్న మాక్షికంను 'రజత మాక్షికం' అని, బంగారురంగులో ఉండేదాన్ని సువర్ణమాక్షికం అని అంటారు.

**మన సంస్కృతిలో మాక్షికం:** మహాభారత యుద్ధం మరియు తన భూలోకపాత్ర ముగిసిన తర్వాత, శ్రీకృష్ణుడు యోగనిద్రలోకి వెళ్ళాడు. ఒక బోయవాడు(జర) కృష్ణుని పాదాన్ని జింక అనుకుని బాణంతో కొట్టాడు. ఆ గాయం నుండి పడిన రక్తపు బిందువులు నింబఫలం (వేప పండ్ల)లాగా కనిపించాయి. ఆ రక్తబిందువుల నుంచే 'మాక్షిక ధాతువు' (Pyrite/Copper Pyrites) ఉద్భవించింది అని రసార్ణవం వంటి చాలా రసశాస్త్ర గ్రంథాలలో వివరించబడింది.

రసరత్న సముచ్చయ వంటి గ్రంథాలలో మాక్షికం ఉత్పత్తి గురించి మరో విధంగా ప్రస్తావించాయి.

కంచనం రసం విష్ణునా సువర్ణశైలాత్
ఆనీయ తాపీ-కిరాత-చీన-యవనదేశేషు
స్థాపితమ్

విష్ణువు (శ్రీకృష్ణుడు) ఆ సువర్ణమయమైన మాక్షిక రసాన్ని (బంగారు కాంతి గల ధాతువును) సువర్ణ (సుమేరు) పర్వతం నుండి తీసుకువచ్చి, తాపీనది పరివాహక ప్రాంతంలో, కిరాత, (హిమాలయ)చీన, యవన దేశాలలో స్థాపించాడు.

ఈ విధంగా మన సంస్కృతి లో మాక్షిక ధాతువు శ్రీకృష్ణుడితో సంధానించబడింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే మన పురాణాల ప్రకారం రత్నాలన్నీ బలిరాక్షసుడి శరీరభాగాలే! కాని ఈ మాక్షిక ధాతువు మాత్రం కృష్ణుణి పాదరక్తం నుంచి వచ్చిన రత్నం!

వసంతకాలంలో (మాధవ మాసం) తీవ్రమైన సూర్యరశ్మి పడినప్పుడు, ఈ మాక్షిక ధాతువు బంగారు కాంతితో ప్రకాశిస్తూ, తన ఉనికిని తెలియజేస్తుంది. ఇది కృష్ణుని పాదరక్తం నుండి జనించినందున దీనికి ఆ శక్తి ఉందని రసశాస్త్ర పరమైన నమ్మకం.

రసశాస్త్రం, ఆయుర్వేద గ్రంథాలలో మాక్షికంకు సంబంధించిన ప్రస్తావనలు ముఖ్యంగా రసరత్న సముచ్చయం, రస తరంగిణి, అష్టాంగ హృదయం, చరక సంహిత, శార్ఙ్గధర సంహిత వంటి గ్రంథాలలో కనిపిస్తాయి.

**రసరత్న సముచ్చయంలో:**

*మాక్షీకం స్వర్ణసంకాశం స్నిగ్ధం గురు మనోహరం।*

*తత్ర స్వర్ణమయం శ్రేష్ఠం రజతాభం తదేవ చ॥*

**అర్థం:** మాక్షికం బంగారు రంగులో మెరిసే, స్నిగ్ధమైన, బరువైన, మనోహరమైన ఖనిజం. అందులో బంగారు రంగు మాక్షికం శ్రేష్ఠమైనది.

**రస తరంగిణిలో:**

*మాక్షీకం కటు తిక్తంచ లఘు వహ్నివివర్ధనం।*

*నేత్ర్యం కుష్ఠహరం మేధ్యం పాండురోగ విభంజనం॥*

**అర్థం:** మాక్షికం కారు చేదు రుచి కలిగి, లఘువుగా ఉంటుంది. అగ్నిని వర్ధిల్లజేస్తుంది. నేత్రవ్యాధులు, కుష్ఠు, పాండు రోగాలను నాశనం చేస్తుంది, బుద్ధిని పెంచుతుంది.

**అష్టాంగ హృదయంలో:**

*స్వర్ణమాక్షీక భస్మం చ రసాయన గుణాన్వితం।*

*మేధాగ్నిబలదం చైవ వర్ణ్యం చక్షుష్యముత్తమం॥*



**అర్థం:** స్వర్ణమాక్షిక భస్మం రసాయన గుణాలు కలిగి, బుద్ధి, జఠరాగ్ని, బలం పెంచుతుంది. వర్ణాన్ని మెరుగు పరచి, కళ్ళకు మేలు చేస్తుంది.

**మాక్షికశోధన విధానం గురించి:**

*మాక్షీకం త్రిఫలా క్వాథే భావితం సప్తవారకం।*

*తతో మృదు భవేత్ సమ్యక్ శోధనం పరికీర్తితం॥*

**అర్థం:** మాక్షికాన్ని త్రిఫల కషాయంలో ఏడుసార్లు నానబెట్టాలి – అప్పుడు శోధనం పూర్తవుతుంది.

**పైరైట్ ఖనిజ భౌతిక లక్షణాలు:**

**రంగు:** ఇది సాధారణంగా లేత ఇత్తడి-పసుపు (Pale brass-yellow) రంగులో ఉంటుంది.

**మెరుపు (Luster):** దీనికి లోహపు మెరుపు (Metallic luster) ఉంటుంది, ఇది కాంతిలో ప్రకాశవంతంగా మెరుస్తుంది.

**స్ఫటిక రూపం (Crystal Habit):** పైరైట్ తరచుగా ఘనపు (Cube) ఆకారంలో లేదా అష్టముఖి (Octahedron) ఆకారంలో స్ఫటికాలను ఏర్పరుస్తుంది.

**కఠినత్వం (Hardness):** మోహ్స్ స్కేలుపై దీని కఠినత్వం 6 నుండి 6.5 వరకు ఉంటుంది. ఇది చాలా గట్టిగా ఉండి, సులభంగా గీతలు పడదు.

**విశిష్ట గురుత్వం:** ఇది అధిక సాంద్రతను (దాదాపు 5.0) కలిగి ఉంటుంది. కాబట్టి సాధారణ రాళ్ల కంటే బరువుగా అనిపిస్తుంది.

దీనిని కఠినతలం మీద గీసినప్పుడు వచ్చే పొడి (Streak) ఆకుపచ్చ-నలుపు లేదా నలుపు రంగులో ఉంటుంది.

**రసాయన లక్షణాలు:**

**రసాయన కూర్పు:** ఇది ఇనుము (Iron) మరియు గంధకం (Sulfur) ల సమ్మేళనం ($FeS_2$).

**క్షీణత (Tarnish):** గాలి మరియు తేమకు గురైనప్పుడు, ఇది తన మెరుపును కోల్పోయి ముదురు రంగులోకి మారవచ్చు. పైరైట్ గాలి మరియు నీటి తాకిడికి గురైనప్పుడు యాసిడ్ మైన్ డ్రైనేజ్ (AMD) ఏర్పడుతుంది. నదులు, భూగర్భ జలాలు ఆమ్లీకరణకు గురిఅవుతాయి. దీనివల్ల పర్యావరణ సమస్యలు తలెత్తుతాయి.

**పైరైట్ ఏర్పడే భూగర్భ నేపథ్యం:**

**హైడ్రోథర్మల్ నిక్షేపాలు (Hydrothermal Deposits):**

వేడి ఖనిజ జలాలు (200-400°C) భూపొరల్లో ప్రవహించినప్పుడు Fe మరియు S అయాన్లు కలిసి $FeS_2$ గా అవక్షేపం అవుతాయి. క్వార్ట్జ్ సిరలు (Quartz Veins) లో సాధారణంగా కనిపిస్తుంది. బంగారం, రాగి, జింక్‌తో కలిసి పైరైట్ లభిస్తుంది. ఉదా: కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్ (కర్ణాటక).

**వోల్కానోజెనిక్ మాసివ్ సల్ఫైడ్ (VMS Deposits):**

సముద్రగర్భంలో అగ్నిపర్వత చర్య వల్ల ఏర్పడతాయి. బ్లాక్ స్మోకర్స్ (Black Smokers) ద్వారా సల్ఫైడ్ ముద్రలు నిక్షేపమవుతాయి. Cu, Zn, Pb తో కలిసి పైరైట్ ఉంటుంది ఉదా: సింగ్‌భమ్ (జార్ఖండ్).

**సెడిమెంటరీ ఎక్స్‌హేలేటివ్ (SEDEX Deposits):**

సముద్రతల అవక్షేపణ క్రమంలో సల్ఫైడ్ మినరల్స్ ఏర్పడతాయి. సేంద్రియ పదార్థం కుళ్ళిపోవడం వల్ల అవాయు (Anaerobic) వాతావరణంలో ఏర్పడతాయి. షేల్, సున్నపురాయి శిలలతో కలిసి ఉంటుంది ఉదా: రాజస్తాన్ (ఆరావళి శ్రేణి)

**పైరైట్ లభించే ప్రదేశాలు:**

భారత దేశంలో పైరైట్ రాజస్థాన్‌లో ఎక్కువగా లభిస్తుంది. సలంబర్ (ఉదయపూర్ జిల్లా) – భారతదేశంలోనే అతిపెద్ద పైరైట్ నిక్షేపం. ఖో-దర్బా ప్రాంతం అరావళి పర్వత శ్రేణుల వెంట విస్తారంగా లభిస్తుంది.

బిహార్ / జార్ఖండ్– అమ్జోర్ (సింగ్‌భూమ్ జిల్లా) లో చాలా ముఖ్యమైన పైరైట్ గనులు ఉన్నాయి. రోహ్తాస్ జిల్లాలో పైరైట్ తవ్వకాలు భారీగా జరుగుతాయి.

హిమాచల్ ప్రదేశ్ ప్రాంతం– శిమ్లా ఇతర జిల్లాలో కొన్ని చిన్న నిక్షేపాలుఉన్నాయి. ఉత్తరాఖండ్అల్మోరా జిల్లా గర్వాల్ హిమాలయ ప్రాంతాల్లో కూడా పైరైట్ దొరుకుతుంది. కర్ణాటకలో చిత్రదుర్గ జిల్లా, కోలార్ బంగారు గని ప్రాంతాలు (గోల్డ్‌తో కలిసి లభిస్తుంది).

మహారాష్ట్ర రత్నగిరి జిల్లానాగపూర్ ప్రాంతంలో పైరైట్ లభిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణాలో కడప, కర్నూలు, ఖమ్మం జిల్లాల్లో చిన్న నిక్షేపాలు ఉన్నాయి.

**భారతదేశంలో పైరైట్ నిల్వలు:**

సుమారు 370 మిలియన్ టన్నులు ఉన్నట్లు అంచనా. ఇందులో 90%కి పైగా రాజస్థాన్ లోనే ఉన్నాయి.

**ఆంధ్రప్రదేశ్‌లో పైరైట్ నిక్షేపాలు:** కర్నూలు నల్లమల అటవీ ప్రాంతం. కడప (వైఎస్ఆర్) బిల్లలగొండ, నల్లచెరువు ప్రాంతాలు, నెల్లూరు, శ్రీకాకుళం ప్రాంతంలో ఉన్నాయి.



తెలంగాణలో ఖమ్మం, పాల్వంచ, భద్రాచలం ప్రాంతాలు నల్గొండ, సూర్యాపేట దగ్గర కొన్ని చిన్న నిక్షేపాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ రాయలసీమ సరిహద్దు ప్రాంతాల్లో కూడా పైరైట్ దొరుకుతుంది.

**పైరైట్ (Pyrite) ఖనిజం ఉపయోగాలు:** పారిశ్రామికంగానే కాకుండా, జ్యోతిష్య మరియు ఆధ్యాత్మిక రంగాలలో కూడా విస్తృతంగా ఉన్నాయి.

**పారిశ్రామిక ఉపయోగాలు:**

**సల్ఫ్యూరిక్ యాసిడ్ తయారీ:** పైరైట్‌ను వేడి చేయడం ద్వారా వచ్చే సల్ఫర్ డయాక్సైడ్ వాయువును సల్ఫ్యూరిక్ ఆమ్లం (Sulfuric Acid) తయారు చేయడానికి ప్రధానంగా ఉపయోగిస్తారు.

**ఎరువుల పరిశ్రమ:** దీని నుండి వచ్చే రసాయనాలను వ్యవసాయ రంగంలో ఎరువుల తయారీకి ఉపయోగిస్తారు.



**ఇనుము మరియు సల్ఫర్ మూలం:** చారిత్రక కాలంలో దీని నుండి ఇనుము మరియు సల్ఫర్‌ను వేరు చేసేవారు, అయితే ప్రస్తుతం మెరుగైన ప్రత్యామ్నాయాలు ఉండటంతో ఈ ఉపయోగం తగ్గింది.

**బంగారం వెలికితీత:** కొన్ని సందర్భాల్లో పైరైట్ ఖనిజం లోపల తక్కువ పరిమాణంలో బంగారం కలిసి ఉంటుంది, దీనిని మైనింగ్ ద్వారా సేకరిస్తారు. పైరైట్‌కు ఫూల్స్ గోల్డ్ అనే పేరు కూడా ఉంది. అయినా బంగారం కనుగొనటానికి పనికిరావటం గమనార్హం.

**కాగితం పరిశ్రమ:** పేపర్ తయారీలో బ్లీచింగ్ ఏజెంట్‌గా ఉపయోగించే సల్ఫర్ డయాక్సైడ్ కోసం పైరైట్‌ను వాడుతారు.

**నిప్పు రాజేయడం:** పురాతన కాలంలో రాతిని కొట్టి నిప్పు పుట్టించడానికి దీనిని ఉపయోగించేవారు.

**ఆధ్యాత్మిక మరియు జ్యోతిష్య ఉపయోగాలు:** వాస్తు మరియు జ్యోతిషశాస్త్రం ప్రకారం పైరైట్ రాయిని ఇంట్లో ఉంచడం వల్ల సంపద, అదృష్టం కలుగుతాయని నమ్ముతారు. ప్రతికూల శక్తి నివారణ: ఇది మన చుట్టూ ఒక రక్షణ కవచంలా ఉండి, ప్రతికూల శక్తుల నుండి కాపాడుతుందని భావిస్తారు.

**ఆత్మవిశ్వాసం:** దీనిని ధరించడం వల్ల ఏకాగ్రత, నిర్ణయాధికారం మరియు ఆత్మవిశ్వాసం పెరుగుతాయని చెప్తారు.

జ్యోతిషశాస్త్రం: వేద జ్యోతిషశాస్త్రం ప్రకారం, పైరైట్‌ను శని దేవుని శక్తితో అనుసంధానిస్తారు. పైరైట్‌ను ధరిస్తే ధన ప్రాప్తి కూడా కలుగుతుందని నమ్మకం.

**అలంకరణ మరియు నగలు:**

**నగల తయారీ:** ఒక రత్నంగా పైరైట్ కు అంతగా గుర్తింపు లేదు. దీని లోహ మెరుపు కారణంగా ఉంగరాలు, బ్రాస్‌లెట్లు, గొలుసులు వంటి నగలలో అలంకార శిలగా ఉపయోగిస్తారు.

**సేకరణ(Collector Items):** దీని అందమైన క్యూబిక్ ఆకారాల వల్ల ఖనిజ సేకర్తలు (Collectors) దీనిని ఇష్టపడుతున్నారు.

**ఆయుర్వేద ఉపయోగాలు:**

ఆయుర్వేదంలో పైరైట్(విమలక/మాక్షిక) ను మహారసాలలో ఒకటిగా భావిస్తారు. దీనిని అనేక దేహవాద ధాతువాద ప్రక్రియలలోఉపయోగిస్తారు. ప్రధానంగా భస్మరూపంలో దీర్ఘకాలిక జ్వరాలు (Jirna Jwara), వాపులు (Edema), జీర్ణక్రియ సమస్యలు, మధుమేహం మరియు కాలేయవ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. ఇది ఐరన్ సల్ఫేట్ కలిగిన ఖనిజ ఔషధం, ఇది శ్వాసకోశ సమస్యలను తగ్గించడంలో మరియు జీవక్రియను (Metabolism) మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**జీర్ణక్రియ మరియు శ్వాసకోశం:** పైరైట్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇది శ్వాస సంబంధిత సమస్యల నివారణకు కూడా సహాయ పడుతుంది.

**క్యాన్సర్ నిరోధక లక్షణాలు:** రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులలో, కణాల పెరుగుదలను నిరోధించే (Fenton reactions inhibiting) శక్తులు దీనికి ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**శక్తి మరియు పోషణ:** ఇది శరీరంలో ఐరన్ లోపాన్ని భర్తీ చేయడంలో సహాయపడుతుంది. మానసిక ప్రశాంతత: ఆధ్యాత్మికంగా, ఇది ఒత్తిడి మరియు ఆందోళనను తగ్గించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని నమ్ముతారు.

**–చకిలం వేణుగోపాలరావు**
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e: venugopal.chakilam1@gmail.com
**– శ్రీరామోజు హరగోపాల్,**
m : 99494 98698
e: akshara25@gmail.com

# చేతిరాత నిశ్శబ్ద ఆత్మహత్య

చిన్నప్పుడు మా పంతులుగారు మమ్మల్ని హెచ్చరించేవారు. "అరే వారీ" నీ చేతిరాత అందంగా లేకపోతే నీ తలరాత కూడా బాగుండదు రా" అని. దాని మతలబు ఏందంటే చేతి రాత బాగుంటే చదువుకూడా బాగా వస్తుందని తద్వారా భవిష్యత్తు కూడా ఉన్నతంగా ఉంటుందని అర్థం.

మా చిన్నప్పుడు పరీక్షల ప్రశ్నాపత్రం పైన కొన్ని సూచనలు ఉండేవి. ఒక ముఖ్యమైన సూచన ఏమనగా "అందమైన ముత్యాల్లాంటి చేతి రాతకు అదనంగా ఐదు మార్కులు కలపబడును". అటువంటి అమూల్యమైన విశేష సూచన ఇప్పుడు ఏ సబ్జెక్టుకు సంబంధించిన క్వశ్చెన్ పేపర్లలోనూ కనబడటం లేదు. అందుకే మన భావిభారత పౌరులైన విద్యార్థినీ విద్యార్థులు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ బాషలలో జవాబులు రాసినా అవి అర్థంకాని పైశాచి, ప్రాకృతం, పాళీ భాషల అక్షరాల మాదిరిగా ఉండి వ్యాకరణ దోషాలు ప్రతిపదంలో తాండవిస్తూ ఉంటాయి. మా కాలంలో టీచర్లు ఇంపోజిషన్స్ రాయించే వాళ్లు. నాలుగు సార్లు, ఐదుసార్లు రాయమని! దానితో "తినగ తినగ వేము తియ్యగా ఉండును" అన్నట్లు రాత శుద్ధి జరిగేది. ముచ్చటైన ముత్యాల రాత మేలిమి బంగారంలా శుద్ధి చేయబడేది. తెల్ల కాగితం మీద తళతళా మెరిసేది.






ఒకప్పుడు వంద సంవత్సరాల క్రిందట, నైజాం నవాబుల పరిపాలనా కాలంలో తెలుగు భాషలో సర్కారీ బడులు లేకపోయేవి. సామాన్య ప్రజలలో అక్షరం పట్ల అనురాగం కాగడాబెట్టి వెతికినా కానరాక పోయేది. "కాలా అక్షర్ భైంస్ బరాబర్" అన్నమాట. అటువంటి చీకటిరోజులలో సాతాని అయ్యవార్లు కాన్గీ, బడులు, వీధి బడులు లేదా ఇంటి ముంగట అరుగుమీది బడులు నడిపి ప్రజలలో విద్యావికాసానికి దారులు వేసినారు. అప్పటికీ పలకలు, బలపాలు అపురూపం కావున పరిచిన దట్టమైన ఇసుక మీద పిల్లల లేత చూపుడు వ్రేలితో ఓనమాలు దిద్దించేవారు. ప్రతిరోజూ ఇసుకలో దిద్దీ, దిద్దీ పసిపిల్లల వ్రేళ్లు ఎర్రగా కందిపోయేవి. ఆ శిక్షణ పిల్లల పాలిట శిక్షగా మారేది. అక్షరాలన్నీ పూర్తిగా వచ్చిన తర్వాత పంతులుగారు తన భోషాణంలో జాగ్రత్తగా పాత పట్టు వస్త్రంలో భద్రపరిచిన "పెద్ద బాల శిక్షను" బయటికి తీసేవారు. అది ఆ కాలంలో విజ్ఞాన సర్వస్వం. ఆ వైకుంఠపాళీ దాటినాక కొద్దిమంది మాత్రమే "అమరం" మొదలు పెట్టేవారు. ఇప్పటికీ తెలుగువారి ఇండ్లల్లో ఉండవలసిన ముఖ్యమైన గ్రంధాలలో "పెద్ద బాలశిక్ష" మొదటి వరుసలో ఉంటుంది.

ఇక మా తరం "ఇసుకలో అక్షరాలు దిద్దిన తరం కాక పలకా, బలపం చేతపట్టిన తరం. అప్పటికి నైజాం రాచరికం అంతరించి రాష్ట్రానికి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. పలకా, బలపం మా చేతులను అలంకరించింది.


మా రోజులలో బాల, బాలికలకు "చెవులు కుట్టించే కార్యక్రమం ఏడ్పులార్పులతో, పెడబొబ్బలతో హింసాత్మకంగా జరిగినా "అక్షరాభ్యాసం మాత్రం ఆడంబరంగా, ఆనందంగా జరిగేది. కొత్త అంగీ, కొత్త లాగు, కొత్త పలకా బలపం, పువ్వులు, పండ్లు, మిఠాయిలు కొండకచో అయ్యవారికి కూడా పంచెలచాపు, ఉత్తరీయం, ఒక రూపాయి బిళ్ల, తాంబూలం, వక్క వగైరాలు ఇత్తడి పళ్లెంలో అమర్చేవారు. అయ్యవారు పిల్లవాడిని తన ఒడిలో కూర్చుండబెట్టుకుని నల్లగా మిలమిలా మెరిసే కొత్త పలక మీద శ్రీ అని రాసి బలపంతో దానిని రెండు మూడుసార్లు దిద్దించటంతో ఆ అక్షరాభ్యాసం ఘనంగా ముగిసేది. అట్లా శ్రీ అన్న అక్షరంతో రాతకు శ్రీకారం జరిగి జీవితంలో "రాత" ఒక ముఖ్యమైన భాగంగా మారిపోయేది. ఆ శుభ సందర్భంలో అమ్మమ్మలు, నాయనమ్మలు, గుమికూడిన అమ్మలక్కలు ఈ క్రింది పద్యాన్ని రాగయుక్తంగా, శ్రావ్యంగా చదివే వారు.

"తేరా పలకా బలపము
ఇయ్యరా అయ్యవారి చేతికి
ఇంపుల రంగా
పోరా భోజనం వేళకు
రారా పద్యాలు చదువ
రాజకుమారా".

పలకలు పలుపలు విధములు. రాతి పలకలు మరియు రేకు పలకలు. రాతి పలకలు క్రింద పడగానే అవి అతి సులభంగా పుటుక్కుమని పగిలి ముక్కలయ్యేవి. అయినా రక్షణ కోసం చెక్క

ఫ్రేములలో వాటిని బిగించేవారు. అవి ప్రకాశం జిల్లా మార్కాపురంలో తయారయ్యేవి. అక్కడ రాతిపొరల గనులు ఎక్కువగా ఉండేవి. రేకు పలకలకు డిమాండ్ తక్కువ. వాటి మీద పూసిన నల్లటి రంగు పోగానే బలపంతో అక్షరాలు రాయటం కష్టంగా ఉండేది. బలపాలలో మళ్లీ రెండు రకాలు. తెల్లవి, రంగురంగులవి. రంగుల బలపాలతో బొమ్మలు వేయటం చాలా "ఖుషీ"గా ఉండేది.

పలకా, బలపం అనే ప్రాథమిక దశ దాటి పిల్లలు నోటు బుక్కుల దశల ప్రవేశించే వాళ్లు. డబుల్ రూల్ నోటు బుక్కులు తెలుగు అక్షరాలు గుండ్రంగా అందంగా అభ్యాసం చేయటానికి, ఫోర్ రూల్ బుక్కులు ఇంగ్లీష్ అక్షరాలు కర్సీవ్ హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీస్ చేయటానికి ఉపయోగపడేవి. లెక్కలకు, సైన్సులకు, మరొక రకమైన నోటు బుక్కులు ఉండేవి. భవిష్యత్తులో రూపుదిద్దుకోబోయే వారి వ్యక్తిత్వాలు వారి వారి చేతి రాతలలోనే దాక్కుని ఉండేవేమో!



పిల్లల జీవితాల్లోకి నోటుబుక్కులతో పాటు పెన్సిళ్లు, రబ్బర్లు, షార్పెనర్లు ప్రవేశించాయి. ఆ దశ తాత్కాలికమే. ఆ తర్వాత పెన్నులు, ఇంకులు రంగప్రవేశం చేసాయి. పెన్నులలో అశోకా పెన్ మామూలు రకం. మిసాక్ పెన్ను ధర చాలా పిర్యం. ప్రశ్న ఎర్ర ఇంకు పెన్నుతో రాసి జవాబు నీలి రంగు పెన్నుతో రాయటం అదొక సరదా. పరీక్షలకు ఒక రోజు ముందు పెన్నులను కడిగి శుభ్రం చేసుకోవటం, వాటిల్లో సిరా నింపుకోవటం, పెన్నుపత్తి (నిబ్) చెక్ చేసుకోవటం ఒక చిన్న సైజు యజ్ఞం. పెన్ను మూత సరిగ్గా పట్టక పోతే సిరా కారి వ్రేళ్లన్నీ రంగుమయం అయిపోయేవి. చేతులకు మైదాకు పెట్టుకున్నట్లు అదొక అందం. పెన్నులో పత్తి సరిగ్గా రాయకపోతే దానిని కాస్తా వంకర చేసి "చిలక ముక్కుగా" మార్చేస్తే అదేం మహాత్యమో ఏమోగాని కరకరా, పరపరా శబ్దం చేస్తూ మహాస్పీడుగా రాసేది. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు! 1970లలో 'రిఫిల్ బాల్ పెన్ను'లు రావటంతో పెన్నులన్నీ చిన్న ముఖం చేసుకుని కాలం తెర వెనక్కి కనుమరుగైనాయి.

రాత గురించి రాయాలంటే వైనవైనాలుగా వర్ణించవచ్చు. అచ్చుయంత్రాలు, ముద్రణాయంత్రాలు రాని కాలంలో రాతకు చాలా ప్రాముఖ్యత ఉండేది. అసలైన మేలి ప్రతికి అనేక "నఖళ్లను" (ట్రూ కాపీస్) తయారు చేయటానికి అనేక మంది "వ్రాయస గాండ్లను" రాజులు తమ ఆస్థానాలలో నియమించుకొనేవారు. ఇంగ్లీషులో వారిని "కాపీ రైటర్స్" అని ఉర్దూలో "నఖల్ నవీస్"లని అనేవారు. సి.పి.బ్రౌన్ దొరగారు కడపలో అనేక మంది వ్రాయసగాండ్లను నెలసరి జీతభత్యాలతో నియమించి వేమన పద్యాలను గ్రంథస్తం చేయటం మనందరికీ తెలిసిన సంగతే. విశ్వనాథ సత్యనారాయణ గారు తన నవల "వేయిపడగలను" అశువుగా చెపుతుంటే వారి తమ్ముడు రాసే వాడట. అట్లా 40 రోజులలో ఆ నవల పూర్తి అయ్యిందట. పూర్వకాలంలో కవిపుంగవులు తాము స్వయంగా చేత్తో రచన చేయకుండా శిష్యపరమాణువులకు అశువుగా చెప్పుతుంటే వారు రాసేవారట. స్వర్గీయ గోపీచంద్ కూడా పత్రికల వారి గడువు ఆఖరి తేదీ నాడు పేజీలకు పేజీలు ధారావాహికంగా చెపుతుంటే ఆ పత్రిక ఉద్యోగి యంత్రంలాగా రాసుకుంటూ పోయేవాడని స్వర్గీయ చావా శివకోటి గారు చెప్పేవారు.

నఖల్ నవీస్‌లకు చాలా గిరాకీ ఉండేది. తహసీల్ (రెవెన్యూ) దఫ్తర్‌లలో నఖల్‌నవీస్ ఉద్యోగాలు ఉండేవి. సర్కారీ ఫర్మానాలకు అనేక నఖళ్లను తయారు చేయటమే వీరి పని. కాలిగ్రఫీ అంటే చేతి రాత కళ". అరబ్బీ, ఫార్సీ, ఉర్దూ భాషలను ప్రత్యేకమైన చెక్కతో చేసిన "కలం"లతో అందంగా రాయటమే కాలిగ్రఫీ. కాలీగ్రఫీ కళను మనతో ముస్లిం పరిపాలకులు అరబ్, ఇరాన్, టర్కీ దేశాల నుండి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా చెట్ల ఆకులతో చేసిన సిరాను "దవాత్"లలో (ఇంకు బుడ్డీ) నింపుకుని ఆ చెక్క కలంను అందులో ముంచి అక్షరాలను అందంగా అలంకరించేవారు. వీరిలో కొంత మంది చార్మినార్ చభూత్రాలపై కూచుని "ఆషిక్"లు వస్తే వారి తరఫున వారి ప్రియురాండ్లకు రసభరితమైన, రాగరంజితమైన ప్రేమలేఖలను రాసి వారిచ్చే "బక్షీస్"లను ఇనాములను స్వీకరించి జీవనోపాధి పొందేవారు. అదే చభూత్రాపై పనిపాటా లేని సోమరిపోతులు, బేకార్‌గాళ్లూ జమయ్యి పోచుకోలు కబుర్లూ, పొంకనాలు చెప్పుకునేవారు. అందుకే "చార్మినార్ కే హవా మే షికార్ పుకార్ కర్తే హై" అన్న సామెత పుట్టుకొచ్చింది.

మా తరగతులలో రెండు రకాలు ఉండేవారు. క్లెవర్లు, అవరేజీలు. క్లెవర్లు సార్లు చెప్పిందంతా టకటకా నోట్సు రూపంలో తమ నోటు బుక్కులలో ఎక్కించుకునేవారు. దానిని మళ్లీ బట్టీ పట్టి పరీక్షలలో ఆన్సర్ పేపర్ల మీద ఉన్నది ఉన్నట్లుగా కక్కేసేవారు. స్వర్గీయ గోపీచంద్, కథకుడు చెప్పినట్లు కోళ్లు సజ్జలను మ్రింగి వాటిని అరిగించుకోకుండా ఉన్నది ఉన్నట్లుగానే విసర్జించే పద్ధతి అన్నమాట. దానితో సార్లు ఖుష్. క్లెవర్లు ఖుష్. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు మేం అవరేజీలం కూడా వాళ్ల కాళ్లు, చేతులు, గడ్డం పట్టుకుని నానా రకాలుగా బ్రతిమిలాడి వారి నోటు బుక్కులు సంపాదించి ఇంట్లో రాత్రి పొద్దు పోయేదాకా మినుకు, మినుకు మని వెలిగే గ్యాసు నూనె గుడ్డి దీపం ముందు కూచుని

దానిని మెదలు విరిగిపోయేలా మా కాపీలలో "కాపీ" చేసుకునే వాళ్లం. దాంతో మా జబ్బ బలం పెరిగి చేతిరాత జర సాఫ్ అయ్యేది. 1970లల్ల జిరాక్సు మెషిన్లు రాంగనే పోరలకు రాతపని తప్పి ఈజీ పద్ధతులు కట్ షార్ట్ పద్ధతులు అలవాటు అయ్యి చేతి రాత "మటాష్" అయ్యింది. కరోనా కాలం తర్వాత "ఆన్ లైన్ క్లాసులు" శురూ కాంగనే పెన్ను, పేపరుతో పనిలేని పాడుకాలం దాపురించే సరికి అప్పటి వరకూ వున్న, తప్పుడు తడకల వంకరటింకర రాత కూడా అటకెక్కి మరింత భ్రష్టు పట్టిపోయింది. పేపరు, పెన్ను, రెండు కూడా సామరస్యంగానే విడాకులు తీసుకుని ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు.

1970, 1980 చివరి వరకు "ఉత్తర కుమారులు" ప్రతి చోటా ఉండేవారు. వీరు పదిపైసల పోస్టు కార్డు తీసుకుని చీమ తలకాయంత అక్షరాలతో ఎక్కడా దోమ కూడా దూరలేనంత జాగా వదలకుండా తమతమ క్షేమ సమాచార వివరాలే గాక దేశకాల పరిస్థితుల గురించి కూడా తమ అభిప్రాయాలు రాసేవారు. అట్లా ప్రతి పోస్టు కార్డు ఆర్థిక, సాంఘీక, రాజకీయ, చరిత్రను రికార్డు చేసే చారిత్రిక పత్రం లాగుండేది. 1970వ దశకం "వికసించిన విద్యుత్తేజం" లాంటిది. ఇక ప్రేమికులైతే కార్డులలో తమ బండారం బయటపడతదన్న భయంతో ఇన్ లాండ్ కవర్లను, లిఫాఫాలను ఆశ్రయించేవారు.



జాగ్రత్తగా నాలుగు దిక్కులా జిగురుతో మూసివేసిన ఆ ప్రేమలేఖలలో చలం, క్రిష్ణశాస్త్రి, ఎంకి, నాయుడు బావలు అత్తరు గుభాళింపు సువాసనలలో దాక్కుని పవళించేవారు. ప్రేమ పక్షుల ఆ లేఖలను పోస్టుమాన్ నుండి అందుకోగానే "చిట్టీ ఆయీహై, ఆయీహై, ఆయీహై" అని గంతులేసేవారు. ఈ కాలం నాటి ప్రేమికులకు అట్లాంటివేమీ అక్కర్లేదు ఎస్ఎమ్ఎస్‌లు, వాట్సప్పుల మెసేజ్‌లే శ్రీరామ రక్ష.

1970లలో వామపక్ష ఉద్యమ చైతన్యం వ్యాప్తి చెందటం వలన యువతరం ఆదర్శ ప్రేమ వివాహాలకు మంచి సాహిత్యాన్ని, పుస్తకాలను 'పెళ్లి కానుకలు'గా అందచేసేవారు. అట్టి పుస్తకాలు మొదటి పేజీలో తమ పేరు, శుభాకాంక్షలు తెలియచేయటంతో సరిపుచ్చుకోక పొడుగు పొడుగు సామాజిక సందేశాలను, సామాజిక కర్తవ్యాలను వెలిబుచ్చేవారు. గ్రంథాలయం పుస్తకాలలో సీరియస్ పాఠకులు తమ కామెంట్లను, అభిప్రాయాలను 'పేరా'ల మధ్యలో రాసేవారు. ఇవన్నీ "రాతియుగం" సంగతుల లాగా ఒకనాటి "రాతయుగం" ముచ్చట్లు.

మొన్నా మధ్య సప్తసముద్రాల అవతల నుండి ఒక చిన్ననాటి "లగోటీయార్" చరవాణిలో మాట్లాడుతూ స్కూలులో చదువుతున్న తమ పిల్లలు పేపరు, పెన్ను, రాత మరచి పోయారని, గ్రామర్ మిస్టేక్స్‌తో వారికి పనిలేదని, అందమైన చేతిరాత నన్నయ్య, తిక్కన కాలం నాటి వని భావిస్తున్నారని సుదీర్ఘంగా "వాపోతూ" ఇక రాబోయే భవిష్యత్తులో జనాలు కేవలం బ్యాంకు చెక్కులపై సంతకాలు చేయటానికే పెన్నులు వాడతారని చావు కబురు చల్లగా తెలియచేసాడు.

"జమానా బదల్‌గయా" అని నేను భీ వాడిని సమ్‌జాయిస్తూ కంప్యూటర్లు, ఆన్‌లైన్ క్లాసుల పుణ్యమా అని ఒకనాటి అందమైన చేతిరాత ఈ కాలంలో ఆత్మహత్య చేసుకున్నదని నా సంతాపం ప్రకటిస్తూ చేతిరాతకు నా "నివాళి" సమర్పించాను.

**ఒక నిజం :**

ఆ మధ్య నేను ప్రముఖ హృద్రోగ శస్త్ర చికిత్సా నిపుణుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టరు దాసరి ప్రసాదరావు గారిని స్నేహపూర్వకంగా వెళ్లి కలిసాను. ఆయన నా రచనల అభిమాని. కాసేపు జరిగిన సాహిత్య సంభాషణానంతరం ఆయన ఒక శాలువా కప్పి నన్ను సత్కరించాలని అనుకున్నాడు. దానికి నేను సున్నితంగా నిరాకరించాను. అప్పుడు ఆయన ఒక ఖరీదైన విదేశీ పెన్నును బహుకరించి ప్రతిరోజూ ఈ పెన్నుతోనే రచనలు చేయాలని ఆదేశించారు. దానికి నేను వినయంగా ఒప్పుకున్నాను. దాంతో నాకు "టీచర్లు మాత్రమే కాదు, డాక్టర్లు కూడా హోమ్ వర్క్" ఇస్తుంటారని నాకు బోధపడింది.

"ప్రసూతి వైరాగ్యం" లాగా నాకు అపుడపుడూ "రచనా వైరాగ్యం" వస్తుంది. అటువంటి బద్ధకపు క్షణాలలో డాక్టరు గారు బహుకరించిన పెన్ను నన్ను "ఇంజక్షన్ సూది"లా పొడిచి నాతో రచనా వ్యాసాంగం కొనసాగిస్తుంది.

**ఒక జోకు :**

ఇప్పటి డాక్టర్లు రాసే ప్రిస్క్రిప్షన్లు పేషంట్లతో సహా సాటి డాక్టర్లకు కూడా సమజ్ కాదు. ఒక మందుల దుకాణం వాడికి తప్పు! ఎందుకంటే ఇప్పటి కొత్త డాక్టర్లందరు ఒకప్పటి కంప్యూటర్లు, ఆన్‌లైన్ల విద్యార్థులే. ఒక కొత్త కుర్ర డాక్టరు మొదటిసారి పుట్టింటికి వెళ్లిన భార్యకు తన విరహాన్ని తెలియచేస్తూ తొలిసారి ప్రేమలేఖ రాసాడట. పాపం ఆ భార్యకు ఆ రాత గజిబిజిగా ఉండి ఏం అర్థం గాక అందులో ఏం అర్జెంటు సమాచారం వుందో అని గాభరాపడి కాసేపు ఆలోచిస్తే ఒక బ్రహ్మాండమైన ఐడియా తట్టిందట.

ఆ వీధిలో వున్న మందుల దుకాణానికి వెళ్లి ఆ ప్రేమలేఖ చూపించి కాస్తా చదివి పెట్టమని బ్రతిమిలాడిందట. ఆ షాపువాడు ఆ లేఖ పెద్ద గొంతుతో జనాంతికంగా చదివే సరికి షాపులో పని చేసే సిబ్బందే గాక, మందుల కోసం వచ్చిన గిరాకీలందరూ నవ్వులపువ్వులుగా మారిపోయినారట.

పాపం ఆమె సిగ్గులమొగ్గయ్యి ఒక్క క్షణంలో అక్కడి నుండి అంతర్ధానం అయ్యిందట!

**-సమాప్తం-**

-పరవస్తు లోకేశ్వర్, m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com



# 2000 ఏండ్ల క్రితమే తెలంగాణాలో గజలక్ష్మి ఆరాధన!


సంపదలనిచ్చి, శ్రేయస్సును కలిగించే దేవతగా లక్ష్మీదేవిని పూజించటం మన దేశంలో రెండువేల సంవత్సరాల పూర్వం నుంచే వస్తున్న ఆచారం. సాధారణంగా, ఆమె తామర పువ్వుపై పద్మాసనంలో కూర్చొని, చేతులలో సమృద్ధికి చిహ్నాలైన వికసిత పద్మాలను ధరించి ఉంటుంది. లక్ష్మీదేవిని ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, వీరలక్ష్మి, విద్యాలక్ష్మి, మరియు విజయలక్ష్మి అని అష్టలక్ష్మిగా ఆరాధిస్తారు. ఈ రూపాల్లో గజలక్ష్మి ఆరాధన బౌద్ధ, బ్రాహ్మణీయ హిందూ మతంలో సా.శ.పూ. 2వ శతాబ్ది నుంచే ప్రారంభమైనట్లు, శుంగుల కాలపు బార్హుత్ స్థూపం రాతికంచెపై గల తొలి గజలక్ష్మి రూపం తెలియజేస్తుంది. తొలుత ఈ శిల్పం ఒక వృత్తంలో పూర్ణఘటం నుంచి వెలువడుతున్న మూడు తామర పువ్వులపైన, మధ్యలో రెండు చేతులు గల లక్ష్మీదేవి నిలబడి ఉండి, అటూ ఇటూ గల పద్మాలపై నిలబడి ఉన్న రెండు ఏనుగులు తొండాలతో కలశాల్లోని నీటితో అభిషేకం చేస్తున్నట్లుగా మలచబడింది. దాదాపు ఇదే కాలానికి చెందిన ఒక మట్టి ప్రతిమ ఇండియన్ మ్యూజియం కలకత్తాలో ఉంది. గమ్మత్తేమిటంటే, అజిలిసెస్ అనే సిథియన్ (గాంధారి) పాలకుడు (సా.శ.పూ. 57-35) విడుదల చేసిన నాణెంపై చుట్టూ ఖరోష్టి లిపిలో 'రాజరాజ మహతస అయిలిసస' అన్న చిన్న శాసనంతో, మధ్యలో నిలబడి ఉన్న గజలక్ష్మి బొమ్మ ఉంది. అంటే, సా.శ.పూర్వమే గజలక్ష్మిని విడిగా ఆరాధించేవారని తెలుస్తుంది. బార్హుత్ బౌద్ధ స్థూపరాతి కంచెపై గల గజలక్ష్మి 'సిరిమా' దేవతగా పేర్కొనబడింది.

దాదాపు అదే కాలంలో అంటే సా.శ. 1వ శతాబ్దిలోనే తెలంగాణాలో గజలక్ష్మి ఆరాధన మొదలైందని చెప్పే మట్టి ముద్రిక, పెద్దపల్లి జిల్లా, పెద్దబంకూరులో జరిపిన తవ్వకాల్లో శాతవాహన స్థావరం నుంచి బయల్పడింది. తెలంగాణాలో బయల్పడిన ఈ ముద్రిక, దక్షిణ భారతదేశంలో బయల్పిడిన తొలి గజలక్ష్మి ముద్రికగా గుర్తింపు పొంది, తెలంగాణా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది.

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి,
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# జిమ్ కార్బెట్ సాబ్... ఓ ప్రకృతి రచయిత

జిమ్ కార్బెట్‌ను భారతీయులు మర్చిపోయారో లేదో తెలియదు కానీ, తెలుగు వాళ్లు మర్చిపోయారనిపిస్తుంది. 1980ల ముందు వరకూ ఏ ఇంటర్మీడియేట్ ఆంగ్ల వాచకంలోనో, లేదా డిగ్రీ ఇంగ్లీషు పాఠ్యపుస్తకంలోనో జిమ్‌కార్బెట్ గురించి ఏదో ఒక పాఠ్యాంశం ఉండేది. అందులో కార్బెట్ సాహసాలు, మనుషుల్ని చంపి తినే పులిని వేటాడటం, పులిదాడులకు గురై మృతి చెందిన మనుషులు, జంతువుల గురించి ఉండేది. ఇప్పుడు మనుషులనే మనుషులు వేటాడి హతమారుస్తున్న ఉదంతాలు పెరిగాయి. కనుక అటువంటి కథలు అవసరం లేదనుకుంటా. జిమ్ కార్బెట్ గురించి పరీక్షలలో ఒక్క ప్రశ్న అయినా తప్పక వచ్చేది కనుక చదవటం అనివార్యంగా విద్యార్థులు చేసేవారు. అప్పుడు ఎనిమిది మార్కుల ప్రశ్నగానే మిగిలిన కార్బెట్ ఇప్పుడు పర్యావరణ ప్రకృతి రచయితగా తెలుస్తున్నాడు. భారతీయాంగ్ల రచయితలైన రుడ్యార్డ్ కిప్లింగ్, ఇఎం ఫోరస్టర్ తర్వాత వినిపించే పేరు జిమ్ కార్బెట్‌దే. ఆ తరువాత రస్కిన్‌బాండ్ లాంటి వారి పేర్లు కూడా వినిపిస్తాయి. కానీ, రస్కిన్ నేను భారతీయుడినే అని చెపుతారు.




జిమ్ కార్బెట్ మొదటి పుస్తకం మ్యాన్ ఈటర్స్ ఆఫ్ కుమావ్ 1944లో ప్రచురితమైంది. ఇది ఎంతో ఖ్యాతి పొందింది. షెర్లాక్ హోమ్స్ రచనలను ఎంత ప్రియంగా పాఠకులు చదివే వారో అంత ఉత్కంఠభరితంగా ఆయన వేటకు సంబంధించిన కథనాలను అంతకుమించి చదివే పాఠకులున్నారు. జిమ్ కార్బెట్‌ను తొలుత మృగయా వినోద క్రీడాకారుడనే చెప్పాలి. తరువాత కాలంలో పులుల బారిన పడుతున్న ప్రజలను, భయంతో జీవించాల్సి వచ్చిన గ్రామీణులను ఆయన కాపాడాడు. అట్లాగే కార్బెట్ జంతు సంరక్షకుడిగానూ కనిపిస్తాడు. పులులు మనం అనుకున్నంత క్రూర జంతువులు కావు. అవి ఊరికనే మానవులను చంపవు, వాటి ఆహారం మానవ మాంసం కాదు అని తేల్చి చెప్పిన వాడు కూడా. సాధారణంగా వేటగాళ్లు నెమళ్లను, జింకలను ఇతర జంతువులను వాటి మాంసం కోసం చంపుతారు. చిరుతలు, పులుల్ని చర్మం కోసం వధిస్తుంటారు. జిమ్ కార్బెట్ తరహా అది కాదు. భారతదేశాన్ని కార్బెట్ ప్రేమించాడు. గ్రామీణ పేదరికాన్ని ఆ ప్రజల అమాయకత్వాన్ని దర్శించాడు. ఇండియన్ రాబిన్‌హుడ్‌గా పేరుమోసిన బందిపోటు సుల్తానా జాడను కనుగొని పట్టుకోవడంలో సాయపడింది కార్బెటే. సామాజిక పరిస్థితుల చేత బాధితమైన గిరిజన తెగలో పుట్టి ఉండటం పట్ల సుల్తానా పట్ల సానుభూతిని కూడా ప్రకటించాడు కార్బెట్.

తన రచనల్లో పులిని వేటాడం కోసం ఎట్లా మాటువేసింది, తానెలా పులిని కొట్టింది మాత్రమే చెప్పడు. ఆ పరిసరాలు, నదులు, వాగులు, వంకలు, వృక్షాలు, పక్షులు, కొండలు, లోయలు మొదలైన వాటిని సునిశితంగా, హృద్యంగా వర్ణిస్తాడు. ఒక జంతువుకు సంబంధించిన జీవిత చరిత్రను 'పీపుల్‌పాని టైగర్' అనే కథనంలో చూస్తాం మనం. ది హాగ్‌హంటర్స్ మాన్యువల్ (1931)లో తొలుత ప్రచురితమైంది. తరువాత మ్యాన్ ఈటర్స్ పుస్తకంలో కూర్చబడింది. ఒక అడవిని, అరణ్య ప్రాంతాన్ని కార్బెట్ వర్ణించినంత విపులంగా మరెవ్వరూ వర్ణించలేదు. కొందరు ప్రయత్నించినప్పటికీ అతికొద్దిమంది మాత్రమే కార్బెట్ స్థాయిని అందుకోగలిగారు.

మనుషుల మీద దాడి చేయని పులిని దాని పుట్టకనుంచి అనుసరిస్తూ, ఆ పులి ప్రవర్తనను, దాని ఎదుగుదలను పదిహేను సంవత్సరాలపాటు పరిశీలించి దినచర్యలాగా రాశాడు. 'ది పీపుల్ పానీ టైగర్ కథ' అది. అయితే ఒక దురదృష్టకరమైన సంగతి ఏమంటే గుర్తించడంలో జరిగిన పొరపాటువల్ల దానిని తానే హతమార్చాడు. అందుకు ఎంతగానో విచారం వ్యక్తం చేస్తాడు. చెరగని ముద్ర వేశాడు. ప్రకృతిపట్ల, వన్యప్రాణులపట్ల కార్బెట్‌కు గల ప్రేమ అధికం.

1875లో నైనిటాల్‌లో పుట్టాడు. హిమాలయ పర్వత

సానువుల సౌందర్యానికి చిన్నతనంలోనే ముగ్ధుడయ్యాడు. ఒక వేటగాడిగా తన ప్రస్థానం మొదలుపెట్టి మనుషులను చంపుకుతింటున్న చిరుతలు, పులులను సంహరించి అసంఖ్యాక గ్రామాల ప్రజలను పులుల భయం నుంచి కాపాడాడు. క్రమంగా వన్యప్రాణి సంరక్షణ ప్రాధాన్యాన్ని గుర్తించాడు. 1936లోనే జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ ఏర్పాటయ్యిందంటే కార్బెట్ ప్రాముఖ్యం ఎంతటిదో గుర్తించవచ్చు. పులులను, పులుల ఆవాసాలను కాపాడాల్సిన అవసరం ఉందని, తద్వారా పర్యావరణ సమతుల్యతకు మార్గంగా ఉపకరిస్తుందని భావించాడు. అందుకోసం ప్రయత్నించాడు.




జింగిల్‌లోర్, ది టెంపుల్ టైగర్, మై ఇండియా, టేల్స్ ఫ్రం ది ఇండియన్ జంగిల్, ది మ్యాన్ ఈటింగ్ లెపార్డ్ ఆఫ్ రుద్రప్రయాగ్, మాన్ ఈటర్స్ ఆఫ్ మేమోన్ తదితరమైన రచనలు చేశాడు.

ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లో జులై 25న 1875లో ఇంగ్లీష్ దంపతులకు జన్మించాడు. యవ్వనకాలమంతా అడవులు పట్టుకుని తిరిగి వన్యప్రాణులకు సంబంధించిన విస్తృత జ్ఞానాన్ని సంపాదించాడు. కొంత కాలం బెంగాల్, ఉత్తర పశ్చిమ రైల్వేస్‌లో పనిచేశాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాడు. దాదాపుగా వెయ్యికి పైగా మరణాలకు కారణమైన పది చిరుతలను, పులులను చంపాడు. రుద్రప్రయాగ చిరుత, చంపావత్ పులిలాంటివి గగుర్పాటు కలిగించే ఆసక్తికర కథనాలు.

భారత స్వాతంత్ర్యనంతరం కెన్యాకు వెళ్లాడు. ఏప్రిల్ 19, 1955లో కెన్యాలోనే తుదిశ్వాస విడిచాడు.


భారతదేశ ప్రాకృతిక సౌందర్యం, వృక్షసంపద, వన్యప్రాణి సంపదపట్ల ఎనలేని గౌరవం కార్బెట్‌కు ఉంది. భారతీయ గ్రామీణ జీవనం, విలువల విషయంగా కార్బెట్‌కు లోతైన అవగాహన ఉంది. భారతీయ ఆంగ్ల వచనానికి కార్బెట్ సొగసులద్దాడు. బ్రిటీష్ సంప్రదాయ కథన శక్తి జానపద విజ్ఞాన మెరుపులో కార్బెట్ రచనల్లో తళుకులీనుతుంటాయి.

తెలుగులో కార్బెట్ లాంటి వేటగాళ్లు లేరు. వేట అనుభవాలను కథనం చేసే రచయితలూ లేరు. ఒక్క బలివాడ కాంతారావు, కె.ఎన్.వై.పతంజలిల రచనలు తప్ప. పతంజలి 'వేట కథలు'లో మనిషికీ, మృగానికీ మధ్య మనుగడ విషయంగా సాగే సంఘర్షణ ఎంత తీవ్రంగా ఉంటుందో చిత్రితమైంది.

ప్రకృతి, మానవ ప్రవృత్తిని అర్థం చేసుకోవాలంటే 'నేచర్ రైటింగ్' చేసిన రచయితలను ఆసక్తిగా, శ్రద్ధగానూ చదవాలి. మనుషులు గురించి మనుషులు రాసిన సాహిత్యం మనిషిని, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ప్రకృతి గురించి, ఇతర జీవరాశుల గురించి మనుషులు చేసిన రచనలో ప్రకృతికి, మానవుడికి మధ్య ఉండాల్సిన అవగాహనను, కాపాడుకోవలసిన సమతుల్యతను అవగత పరుస్తాయి. కార్బెట్ రచనలను చదవండి చదివించండి ప్రకృతి గురించి బోధపడుతుంది.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు




**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

చిరునామా :

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com





# కృష్ణా తీరంలో మరుగున పడిన మహానగరం

నల్గొండ జిల్లా దామరచెర్ల మండలం వీర్లపాలెం-వీరప్పగూడెంల దక్షిణ సరిహద్దుగా పారుతున్న కృష్ణా నది ఎడమ ఒడ్డున మూడు వేల సంవత్సరాల క్రితం నుంచి క్రీ.శ. 15వ శతాబ్దం మధ్య మనుగడ సాగించిన మహానగరం శిథిలాలు నాకు నిన్న అనుకోకుండా తారసపడ్డాయి. ఇక్కడ బృహత్ శిలాయుగపు సమాధులు (కెయిరనులు) వందలకొలది ఉన్నాయి. వీటిని స్థానికులు వీరుల సమాధులుగా భావించేవారు. కాబట్టి ఈ ప్రాంతానికి వీరులపాడు, వీరప్పగూడెం అనే పేరొచ్చింది. జీవనది అయిన కృష్ణా నది.. నీటిని, చేపలను, ఇతర జీవాధార వనరులను పుష్కలంగా సమకూర్చింది. కాబట్టి ఇక్కడ సుమారు మూడు వేల సంవత్సరాల కిందట ఒక మహానగరం మనుగడ సాగించడానికి అవకాశం ఏర్పడింది. బృహత్ శిలలను పగులగొట్టే ఇనుమును కూడా ఇక్కడే తయారు చేసుకున్నారు అనడానికి నిదర్శనంగా ఇక్కడ పలు చోట్ల ఇనుప చిట్టాలున్నాయి.



రెండేసి గజాల పొడవు, గజం ఎత్తైన నాలుగు రాళ్ళతో నాలుగు గోడలుగా నిర్మించి ఆ నిర్మాణం పైన మరో చదునైన కప్పు రాయిని పరిచి ఈ సమాధులను నిర్మించారు. కృష్ణా తీరంలో ఇదివరకే పలు చోట్ల ఇలాంటి సమాధులలో తవ్వకాలు చేపట్టి పురావస్తు శాఖ గత దశాబ్దాలలో మూడు వేల సంవత్సరాల కిందటి తెలంగాణ జీవన సాంస్కృతిక విశేషాలనెన్నింటినో బయటపెట్టింది. అయితే ఈ వీర్లపాడు స్థలం మాత్రం పురావస్తు శాఖ దృష్టిలో లేదు. ఈ సమాధి రాళ్ళకు వాడిన ముడిరాయి ఇక్కడే బంజరు రాళ్ళ పేరుతో పుష్కలంగా అందుబాటులో ఉంది. శాస్త్రీయంగా పల్నాడు రాళ్ళుగా పిలిచే వీటి లభ్యత ఆధారంగానే ఈ ప్రాంతంలో సుమారు యాభై ఏళ్ళ కిందట ఒక సిమెంట్ కంపెనీ ఏర్పడింది. ఆ కంపెనీతో పాటు స్థానికులు కూడా వందలాది సమాధులపై రాళ్ళను తమ అవసరాల కోసం తీసుకుపోతుండడంతో ఇప్పుడు అతికొద్ది సంఖ్యలో మాత్రవే బృహత్‌శిలా సమాధులు పూర్తి స్థాయిలో కనిపిస్తాయి. ఇక గుప్తనిధుల దొంగలు కూడా అనేక సమాధులను పెకలిస్తున్నారు. కాబట్టి అతికొద్ది రోజుల్లో అవి కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

బృహత్‌శిలా యుగం తరువాత సుమారు వేయి ఏండ్లు మానవ మనుగడ ఎలా కొనసాగిందో తెలిపే ఆధారాలు మృగ్యం. అయితే మళ్ళీ మధ్య యుగాలలో... సుమారు వెయ్యేళ్ళ క్రితం నుంచి కట్టిన కోట గోడలు, బురుజులు, ఇండ్లు, గోదాములు, ధాన్యాగారాలు, గుళ్ళు, విగ్రహాలు, రోళ్ళు, బావులు, తదితర నిర్మాణాలు కనిపిస్తున్నాయి. కృష్ణా నది పారుతున్న



దక్షిణం వైపు సాధారణ ద్వారం కలిగిన కోట గోడలు సుమారు 70 మీటర్ల చతురస్రాకారంలో (5000 చదరపు మీటర్లు.. అంటే ఎకరంన్నర వైశాల్యం) నిర్మితమై ఉన్నాయి. కోటగోడల మధ్యలో ఎత్తైన భవనపు పునాదులు ఉన్నాయి. కోటకు ఆగ్నేయంలో అల్లంత దూరంలో ఒక ఎత్తైన బురుజు ఉంది. దీనిని దూరం నుంచి వచ్చే శత్రువులను గుర్తించడానికి ఉపయోగించేవారు. కోటగోడలకు ఈశాన్యంలో వనదుర్గ, పోషమ్మ, పోతరాజు, వీరభద్రుడు, దంపతుల వీరగల్లు, పురుష యోధుడి వీరగల్లు ఉన్నాయి. వాటి గుడిని ఎవరో ధ్వంసం చేసారు.

వాస్తు శిల్ప లక్షణాలను బట్టి ఈ కోటగోడలు, విగ్రహ శిల్పాలను స్థానిక కందూరి చోళుల కాలం నుంచి రేచర్ల పద్మనాయకుల కాలం మధ్య.. అంటే, క్రీ.శ. 10–15 శతాబ్దాల మధ్య కట్టించారని చెప్పవచ్చు. కాకతీయ రాణి రుద్రమదేవి (క్రీ.శ. 13వ శతాబ్దంలో) ఇక్కడి కోటలో ధాన్యరాశులను నిల్వ ఉంచేది అని స్థానికుల కథనం. అందుకు నిదర్శనంగా ఆరు గజాల వ్యాసంతో పలు గుండ్రటి ధాన్యాగార నిర్మాణాలు కనిపిస్తున్నాయి. లోపలి వైపు డంగు సున్నం వేసి ధాన్యాలు బయటికి జారిపోకుండా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ పెంకులు పెద్దగా లభించకపోవడం వల్ల మధ్యయుగాలలో ఈ కోట ప్రాంతం సాధారణ నివాస స్థలంగా కాకుండా శత్రువుల నుంచి రక్షణ కోసం రహస్య ధాన్యాగారంగా మనుగడ సాగించిందనే చెప్పవచ్చు.

కోటకు దక్షిణాన ఫర్లాంగ్ దూరంలో.. కృష్ణా ఒడ్డున రేచర్ల పద్మనాయకుల కాలపు (క్రీ.శ. 14–15 శతాబ్దాలు) లక్ష్మీనరసింహ ఆలయం ఉంది. ఇప్పుడు ఆ ఆలయపు అంతరాళం పూర్తిగా, గర్భగుడి పాక్షికంగా మిగిలి ఉన్నాయి. ముఖ మండపం పూర్తిగా ధ్వంసం అయింది. ఆలయంలోని లక్ష్మినరసింహస్వామి విగ్రహం, వైష్ణవమూర్తి, ఆయన దేవేరులు (ఆది లక్ష్మి, చెంచు లక్ష్మి) విగ్రహాలను దుండగులు బయట పడేసి ముక్కలుగా విరుగగొట్టారు. నేను పరిసర ప్రాంతాల్లో వెతికి ఆ ముక్కలను అతుకపెడితే పైన పేర్కొన్న విగ్రహాల రూపు రేఖలు స్పష్టముగా గోచరించాయి. ప్రధాన విగ్రహం పీఠానికి గరుడుడు రేఖ చిత్రం చెక్కి ఉండడం వల్ల, ఆలయ సమీపంలో రెండున్నర గజాల పొడవైన హనుమంతుని శిల్పం ఉండడం వల్ల ఈ ఆలయ విగ్రహ నిర్మాణాలు చేపట్టింది రేచర్ల పద్మనాయకులు అని స్పష్టమయింది.

సిమెంట్ కంపెనీ, స్థానికులు ఇక్కడి బృహత్ శిలా యుగపు సమాధి రాళ్ళను తమ అవసరాల కోసం విరివిగా ఉపయోగించు కుంటున్నారు. కాబట్టి అవి త్వరలోనే పూర్తిగా కనుమరుగు కాకముందే వాటిని వెంటనే పురావస్తు శాఖ కనీసం డాక్యుమెంట్ అయినా చేసి మన చారిత్రిక సంపదను భావి తరాలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

– ద్యావనపల్లి సత్యనారాయణ,
m : 94909 57078
e: dyavanapalli@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# పుడమిని రక్షించుకుందాం!

వరల్డ్ ఎర్త్ డే తొలిసారి 1970లో అమెరికాలో నిర్వహించబడింది. 1962లో అమెరికా సెనేటర్ గేలార్డ్ నెల్సన్ భూమి ప్రమాదంలో ఉందని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఆయన ఈ దినోత్సవం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత 1969లో కాలిఫోర్నియాలో జరిగిన ఒక పెద్ద ఆయిల్ స్పిల్ (నూనె రాయి) ఘటన పర్యావరణానికి భారీ నష్టం కలిగించింది. ఈ ఘటన పట్ల స్పందించిన గేలార్డ్ నెల్సన్, చివరికి 1970, ఏప్రిల్ 22న మొదటి ఎర్త్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2 కోట్లమంది అమెరికన్‌లు పాల్గొన్నారు. దాని ఫలితంగా యుఎస్ ప్రభుత్వం పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పలు చట్టాలు, ఏజెన్సీలను ఏర్పరిచింది.

**భూవనరుల్లో భారీ మార్పులు:**

గడచిన అయిదు దశాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా భూసారం, ఉత్పాదకశక్తి తగ్గిపోతూ వస్తున్నాయి. భూ వనరుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అధిక దిగుబడే లక్ష్యంగా వ్యవసాయం చేస్తుండటంతో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం విచ్చలవిడిగా పెరిగింది. సింథటిక్ పైరేత్రోయిడ్స్ వంటి రసాయనాల వల్ల నేలలోని ప్రయో జనకర సూక్ష్మజీవులు, శిలీంద్రాలు నశించిపోతున్నాయి. పర్యవసానంగా నేల సహజత్వం కోల్పోయి పంట పొలాలు నిస్సారమవుతున్నాయి. దిగుబడులు దిగనాసిపోతున్నాయి. మరోవైపు– సముద్రాలు వేడెక్కడం, నీటి మట్టాలు పెరగడంతో తీరప్రాంతాల్లోకి సాగర జలాలు చొచ్చుకొస్తున్నాయి. దాంతో అక్కడి భూముల్లో లవణీయత పెరిగి సేద్యానికి పనికిరావడం లేదు. పారిశ్రామిక వ్యర్థ రసాయనాలూ, ప్లాస్టిక్ రేణువులూ జలవనరుల్లోకి, అక్కడి నుంచి పంట భూముల్లోకి వచ్చి చేరుతుండటం భారీ నష్టానికి కారణమవుతోంది. ఇలా క్షీణిస్తున్న భూముల్ని శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరించుకోవడం అత్యావశ్యకం.



వాహన కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల వల్ల వాయు, నీటి నాణ్యత దెబ్బతింటోంది. శిలాజ ఇంధనాలు, గ్రీన్‌హౌస్ వాయువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవడంతో పాటు సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాలను పెంచుకోవడమే ఇందుకు మేలిమి పరిష్కారం. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను పూర్తిగా శుద్ధిచేసిన తరవాతే పర్యావరణంలోకి విడుదల చేయాలి. ఇందుకు ఉద్దేశించిన నియమ నిబంధనలను పాటించని వ్యక్తులు, సంస్థలపై కఠిన చర్యలకు ఉపక్రమించాలి. ఆ దిశగా కాలుష్య నియంత్రణ మండళ్లను బలోపేతం చేయడమే కాకుండా... విధినిర్వహణలో అలసత్వం, చేతివాటం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

**జీవవైవిధ్యానికి గట్టి దెబ్బ:**

గనుల తవ్వకం, పారిశ్రామిక అవసరాలు, వ్యవసాయం, గృహ నిర్మాణం కోసమని అడవులను ధ్వంసం చేయడం, చెట్లను నరికేయడం కొంతకాలంగా పెరుగుతోంది. ఈ పరిణామంతో వన్యప్రాణుల ఆవాసాలు కోల్పోతున్నాయి. దాంతో జీవవైవిధ్యం దెబ్బతింటోంది. తాగునీరు, ఆహారం కోసం వన్యప్రాణులు సమీప జనావాసాల్లోకి వస్తున్నాయి. దాంతో మనుషులు వాటిని చంపడం, అవి మనుషులను చంపడం పరిపాటిగా మారింది. గడచిన 75 సంవత్సరాల్లో నాశనమైన అటవీ భూములను అదే స్థాయిలో పునరుద్ధరించడం కష్టమని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. కాబట్టి, ప్రభుత్వాలు ఇప్పటికైనా అడవుల నరికివేతను గట్టిగా అడ్డుకోవాలి. అటవీ భూములను సమర్థంగా నిర్వహించడంతో పాటు అన్నిచోట్లా మొక్కలను నాటి శ్రద్ధగా పెంచాలి. ఈ క్రతువులో పౌరులతో పాటు కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలనూ భాగస్వాములను చేయాలి. ఇంకోవైపు సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, సహజ సిద్ధమైన పురుగు మందుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. తద్వారా భూములు సారవంతం కావడంతో పాటు, ఆరోగ్యకరమైన వ్యవసాయ దిగుబడులతో ప్రజారోగ్యమూ ఇనుమడిస్తుంది. భూగర్భ జలాలు అంతకంతకు దిగజారి పోతుండటంతో సాగునీటికి, తాగునీటికి ఇబ్బంది అవుతోంది. కాబట్టి, ఆరుతడి పంటలు, శ్రీవరి లాంటి తక్కువగా నీరు అవసరమయ్యే వంగడాలను వేసుకోవాలి. నీటిని పొదుపుగా వాడుకునేందుకు తుంపర, బిందు సేద్యం వంటి పద్ధతులను పాటించేలా రైతులను ప్రోత్సహించాలి. అందుకు అవసరమైన ఉపకరణాలను రాయితీపై అందించి, వారికి శిక్షణ ఇప్పించాలి. వాన నీటి సంరక్షణకు, భూగర్భ జలమట్టాల పెంపునకు దీర్ఘకాలిక చర్యలు అవసరం. వాతావరణ మార్పుల కారణంగా తరచూ తుఫానులు, అకాల వర్షాలు సంభవిస్తున్నాయి. దాంతో వరదలు పోటెత్తి వ్యవసాయం దెబ్బతింటోంది. మరోవైపు, ఎండల తీవ్రత పెరుగుతోంది. వీటన్నింటివల్లా దేశంలో చాలాచోట్ల ఏడాదిలో ఎక్కువ రోజులు కరవు తరహా పరిస్థితులే నెలకొంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని, విపత్తులను సమర్థంగా ఎదుర్కోవడానికి తగిన సామర్థ్యాలను సర్కారీ యంత్రాంగాలు సమకూర్చుకోవాలి. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మరింత సమర్థంగా తీర్చిదిద్దాలి.

**అంతా మన చేతుల్లోనే:**

పంట భూములనూ, పర్యావరణాన్నీ పరిరక్షించుకోవడం పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన అవసరముంది. ఇందుకోసం తరచూ అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలి. విద్యాసంస్థలు, కూడళ్ల దగ్గర ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రసార మాధ్యమాల ద్వారా సామాన్యులను జాగరూకులను చేయడం మేలు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంపై అందరికీ అవగాహన పెంచాలి. ప్రతి ఒక్కరూ

## వారసత్వ సంరక్షణలో చారిత్రాత్మక మైలురాయిని నెలకొల్పిన

# Er. వేదకుమార్ మణికొండ

### ఇంటాక్ న్యూఢిల్లీ గవర్నింగ్ కౌన్సిల్ ఎన్నికలలో రికార్డు స్థాయి ఓట్లతో తిరిగి ఎన్నిక

వారసత్వ సంరక్షణలో ఇఆర్. వేదకుమార్ మణికొండ చారిత్రాత్మక మైలురాయిని నెలకొల్పారు. అర్బన్ అండ్ రీజినల్ ప్లానర్‌గా అంకిత భావంతో పనిచేస్తున్న వారసత్వ సంరక్షకుడు. వేదకుమార్ నాలుగోసారి వరుసగా ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ (కళ) అండ్ కల్చరల్ హెరిటేజ్ (సాంస్కృతిక వారసత్వం) (ఇంటాక్), న్యూ ఢిల్లీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యునిగా మూడు సంవత్సరాల కాలానికి మళ్లీ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఇంటాక్ చరిత్రలోనే అత్యధిక ఓట్లు సాధించడం ఆయన నిబద్ధత, విశ్వసనీయత, వారసత్వ సంరక్షణలో చేసిన విశిష్ట సేవలను ప్రతిబింబిస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవంతో, ఆయన ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోని స్మారకచిహ్నాలు, చారిత్రక భవనాలు, సాంస్కృతిక, సహజ వారసత్వ ప్రదేశాల గుర్తింపు, సంరక్షణ, పరిరక్షణకోసం నిరంతరం కృషి చేస్తున్నారు. వేదకుమార్ అనేక దేశాలను సందర్శించి, చారిత్రక నగరాలు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలు గురించి అధ్యయనం చేశారు. పలు అంతర్జాతీయ వారసత్వ సదస్సుల్లో, వేదికల్లో పాల్గొని, భారతదేశపు వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ఆయన హెరిటేజ్ పరిరక్షణ ధ్యేయంలో ఒక మచ్చుతునక. తెలంగాణ ప్రభుత్వపు హెరిటేజ్ విభాగంతో కలిసి

INTACH Indian National Trust for Art and Cultural Heritage



ఇంటాక్ ఛైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ నుంచి ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న వేదకుమార్ మణికొండ. చిత్రంలో ఇంటాక్ మెంబర్ సెక్రటరీ రవీంద్ర సింగ్ – రిటైర్డ్ ఐఏఎస్ (ఎడమవైపు), ఇంటాక్ ఎలక్షన్స్‌కు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టి.ఎస్.రంధవా – రిటైర్డ్ ఐఏఎస్ (కుడివైపు).

పనిచేసి, 'దక్కన్ అకాడమీ ట్రస్ట్' ఆధ్వర్యంలో ముడుమాల మెగాలిథిక్ మెన్హిర్‌ను యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చేర్చడంలో కీలకపాత్ర పోషించారు. ఈ చర్య ద్వారా ఆ ప్రాచీన వారసత్వ స్థలానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

– కట్టా ప్రభాకర్
m : 8106721111
e: akumarkatta@gmail.com

---

మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపునకు కృషి చేయడంతో పాటు పర్యావరణ అనుకూలమైన జీవనశైలిని అలవర్చుకోవాలి. నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుని ప్రకృతి వనరులను ఆదా చేయాలి. పర్యావరణ సమస్యల పరిష్కారం మన చేతుల్లో ఉంది. కాబట్టి ఎవరికి వారు మొక్కలు నాటడం, సహజ వనరులను ఆదా చేయడం వంటి చిన్నపాటి ప్రయత్నాలు చేస్తే పెద్ద మార్పులు వాటంతట అవే వస్తాయి. మనం నివసిస్తున్న భూమిని ప్రేమించి బాధ్యతగా సంరక్షించడమే– భవిష్యత్ తరాలకు మనమిచ్చే అద్భుతమైన బహుమతి!

**ప్లాస్టిక్‌కు బదులుగా పరిష్కారాలు:**

ఇప్పటికే అనేక దేశాలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాయి. దానికి బదులుగా జూట్ బ్యాగ్స్, పేపర్ బ్యాగ్స్, మట్టి పాత్రలు వాడటం వంటి పద్ధతులు ప్రోత్సహించ బడుతున్నాయి. 2040 నాటికి ప్లాస్టిక్ రహిత భూమిని అందించాలన్నదే సమిష్టి లక్ష్యం.

**ఎర్త్ డే ప్రాముఖ్యత:** ఎర్త్ డే వల్ల పిల్లల నుంచి పెద్దల వరకు పర్యావరణంపై బాధ్యత పెరుగుతుంది. ఈ దినోత్సవం ద్వారా ప్రజల్లో పరిసరాల పట్ల శ్రద్ధ, హరిత జీవన విధానం పట్ల ఆసక్తి పెరుగుతుంది. చాలామంది ఈ రోజు మొక్కలు నాటి, శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తూ, భూమిని కాపాడే తన వంతు కృషి చేస్తారు. ఇది మిగిలిన వారిలోనూ చైతన్యం కల్పిస్తుంది.

**2026 ధరిత్రి దినోత్సవం యొక్క థీమ్:**

**"మన శక్తి, మన గ్రహం".** earthday.org ప్రకటించిన ఈ థీమ్, ముఖ్యంగా పునరుత్పాదక శక్తి, ప్లాస్టిక్‌ను తగ్గించడం మరియు స్థానిక పర్యావరణ స్థితిస్థాపకతను బలోపేతం చేయడంలో నిజమైన పర్యావరణ పురోగతిని నడిపించడానికి వ్యక్తులు, సంఘాలు మరియు సంస్థల నుండి సమిష్టి చర్యను ఉపయోగించడంపై దృష్టి పెడుతుంది.

– జుగాష్‌విలి
m : 830 9452 998
e:desk.deccan@gmail.com

# ఒలందులైన హాలండీయులు-డచ్‌వారు (1602-1697)

*(గత సంచిక తరువాయి)*

**జూ**లియన్ జేమ్స్ కాటన్ విరచితగ్రంథం ఫ్రెంచ్‌పేటలోని పాత డిఎంహెచ్ఓ కార్యాలయ భవనం గురించి ఈ విధంగా వర్ణించింది. "జిల్లా మున్సిఫ్‌కోర్టు ఉన్న భవనం డచ్ ఫ్యాక్టర్ కౌన్సిల్ ఛాంబర్‌గా ఉపయోగపడేది. వలందపాలెంలో డచ్ శ్మశాన వాటిక (డచ్ సెమిట్రీ) నిర్మింపబడే వరకు డచ్ ఫ్యాక్టర్ కౌన్సిల్ ఆవరణ శ్మశానముగా ఉపయోగింప బడేదని సాంప్రదాయం ప్రకారం తెలుస్తున్నది. ఈ భవనం చాలాకాలం వరకు జిల్లా జడ్జి కోర్టుగా, (బందరు) నవాబు నుండి మరొక భవనము జిల్లాకోర్టు నిమిత్తం కొనుగోలు చేసేవరకు, ఉపయోగింప బడింది. ఈ భవనము రెండువైపులా చక్కటి మెట్లవరస కలిగి, భవనము సమతలపు ఫ్లాట్ రూఫ్ (కప్పు)తో ఉన్నది".



డచ్ దేశం బటేవియా నుండి మనదేశానికి వచ్చినవే 'బటేవియా పండ్లు -అవే బత్తాయి పండ్లు'.

**డచ్ దేశంకు బందరు నుండి వ్యాపార లావాదేవీలు:**

దచ్‌వారి దేశం నెదర్లాండ్స్‌లో ఉన్న 'రాయల్ నెదర్లాండ్స్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్'లో భద్రపరచి ఉన్న చేతివ్రాత ప్రతులు మచిలీపట్నం, నాగపట్నం, గోల్కొండలలో డచ్ హయాంలో జరిగిన చేనేత వస్త్రముల, వజ్రవైఢూర్యముల, మరియు ఇతర వ్యాపార లావాదేవీలు తెలుపు ఉత్తర ప్రత్యుత్తరములు, రాజ దర్బారులలో, స్థానిక అధికారులకు డచ్‌వారిచ్చిన మెమోరాండముల విషయములు, మసులీపటాంలో ఆనాడు టోకున జరిగిన గొప్ప వ్యాపార వాణిజ్యముల వివరములు, సమాచారము తెలియజేయ గలవు. మద్రాసు ఫోర్ట్‌సెంట్ జార్జ్ కోట ఇంగ్లీషు ఏజంటు క్రీ.శ. 1679లో బందరు మకాం చేసిన డచ్ అధికార్ల గురించిన వివరములు రికార్డు చేసినాడు. ఆ సంవత్సరం డచ్ బటేవియా నుండి మసులీపటాం ఓడరేవుకు పెద్ద పరిమాణములో దిగుమతి అయిన వెండి, రాగి లోహముల, సుగంధ ద్రవ్యముల వివరములు, విశేషములు ఆ రికార్డు తెలియజేస్తుంది. ఈ సరుకులు మసులీపటాంలో డచ్‌వారు కొనుగోలు చేయవలసిన వస్త్రములకు బదులు పంపబడినవి. 1679 సం॥లోనే బందరులో ఉన్న డచ్ ఛీఫ్ ఇన్ కౌన్సిల్ బటేవియాకు చేనేత, కలంకారీ, అద్దకం వస్త్రములు ఓడనిండా పంపటం గమనించవలసి ఉంది. మసులీపటాం కేంద్రంగా డచ్ కంపెనీ తమ ఇతర వర్తక కేంద్రాలయిన పాలకొల్లు, నర్సాపురం వ్యాపారం - వాణిజ్యంను అదుపుచేస్తుంది. 1686లో డచ్ సైన్యం గోల్కొండ క్రిందవున్న మసులీపటాంను దురాక్రమణ చేసింది. 1689లో మొగల్ దర్బార్ గోల్కొండను స్వాధీన పరచుకొని, యూరోపియన్ ట్రేడింగ్ కంపెనీలతో యుద్ధమాడుట వలన, డచ్, ఇంగ్లీషు మరియు ఫ్రెంచ్‌వారు మసులీపటాం వదలి పారిపోయారు. 1750 నాటికి బందరు ఓడరేవు అభివృద్ధి చెందటం మొదలెట్టి, 900 టన్నుల బరువుమోసే భారీ ఓడలు కూడా రేవులో లంగరేసే పరిస్థితికి చేరింది. 1753లో డచ్ కంపెనీ అధికారి 'ఆడ్రియానస్ కౌంటర్ విచ్చుర్' అమ్‌స్టర్‌డామ్‌కు పంపిన అనేక ఉత్తరాలు, వర్ణ చిత్రములు డచ్‌వారు బందరుకోట చుట్టూ ఏర్పాటు చేసిన కోట బురుజుల సంగతి, మరియు కోటను మరాఠాలు వశపరచుకొన్న వైనం తెలియజేస్తవి. బ్రిటిష్‌వారి హయాంలో బందరుకోటకు మార్పులు చేర్పులు చేయబడినవి. డచ్‌వారు బందరుకోటలో ఒక ఆయుధాగారము నిర్మించారు. ఈ ఆయుధాగారమునుండి నాగపూర్, కాంప్టీ, జాల్నా హైదరాబాద్‌లలోని 'సబ్‌సిడరీ ఫోర్సెస్' సైన్యం నిమిత్తం యావత్ నిజాం సైనిక ఉత్తర విభాగముల వినియోగము నిమిత్తం ఆయుధములు పంపబడేవి. ఈ ఆయుధాగారము నలు చదరముగా చుట్టూ, విశాలమైన గదులతోనూ, గోదాములతోనూ నిర్మించబడింది. ఆయుధాగారం రెండు భాగములుగా చేయబడి, మధ్యభాగంలో తూర్పుహద్దున విశాలమైన హాలు చుట్టూ గదులు నిర్మించబడియున్నవి. డచ్‌కోటగా పిలవబడే ఈ ఆయుధాగారం 1864 బందరు ఉప్పెన తరువాత పాడుపెట్టబడగా, అందులో కష్టమ్స్ హవుస్ కొంతభాగం, మరికొంతభాగం పోర్ట్ ఆఫీసుగా ఉండేది. పాడుపడి శిథిలావస్థలో ఉన్న కోటగా ఉన్న భవనమును ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారి డా॥ జి. జితేంద్రదాస్ హయాం (2012)లో కొంతభాగం పునర్నించబడింది. ప్రస్తుతం ఈ ఆయుధాగారం ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా - విజయవాడ వారి పర్యవేక్షణలో 2014, 2015 మధ్యకాలంలో కొంతభాగం పునర్నిర్మాణం ప్రారంభమయింది.

ఈ ఆయుధాగారాన్ని ఆనుకొని ఒక ఎత్తైన గంటస్థంభ మున్నది. గంట మాత్రము లేదు. ఆయుధాగారము కాపలా సైనికుల నిమిత్తం గంటస్థంభం నుండి గంటలు వాయించేవారని కొందరంటారు. కాని బ్రిటిష్ కాలమునాటి 1936 సర్వే -

సెటిల్‌మెంట్ లెక్కల్లోనూ, గ్రామ పటము (Village Plan) లోనూ, గంటస్థంభం స్థలం 'చర్చిసైట్ 'గా చూపబడి యున్నది. ప్రస్తుతము చర్చి మాత్రము భూమి మీద లేదు. బందరుకోటలో బ్రిటిష్ వారు ఈస్ట్ ఇండియా

చర్చి నిర్మించినటుల చరిత్ర చెపుతున్నది. బహుశా ఆ చర్చి ఇదే అయిఉండవచ్చును. గంటస్థంభం స్థలం చుట్టూ A.S.I. వారు ఇనుపమెష్ కంచె వేసి జాగ్రత్త పరిచినారు. గంటస్థంభం చుట్టూ ఉన్న పెద్ద ఆవరణను 'పీపుల్స్ పార్క్' అని పిలుస్తారు. పూర్వం పార్కుగా ఉండిన గుర్తుగా ఈ ఆవరణలో సిమెంటు బెంచీలు ఉండేవి. ఇప్పుడు లేవు. ఈ గంటస్థంభం – చర్చి ఆవరణ నానుకొని డచ్ – బ్రిటిష్ – ఫ్రెంచ్‌వారలు తమ ఆయుధముల నిమిత్తం 'ఫిరంగి మందు' భద్రపరచుటకు వాడిన, ఆర్చ్‌శ్లాబుతో పిరమిడ్ టైపు తుపాకి మందుకొట్టు నేటికీ ధృఢముగా నిలిచియున్నది. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియావారు ఈ తుపాకి మందుకొట్టు (Gun Powder Magzine)భవనమును స్వాధీన పరచుకొనుటకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గంటస్థంభం ఆవరణ భూమికిన్నీ, తుపాకిమందు కొట్టు భూమికిన్నూ మధ్యలో ఉన్న చిన్నపాటి స్థలం మార్కెట్ వ్యాల్యూమీద సేకరణకు అటు ఆర్కియలాజికల్ సర్వే ఇండియా – ఇటు రెవిన్యూశాఖలు దోబూచులాడు



తున్నవి. వీటి మధ్య నలిగి తుపాకిమందు కొట్టం కాస్తా పర్యవేక్షణ, మెయింటనెన్స్ లేక బహిర్భూమిగా వాడబడుతూ భవనం శిధిలమయి నేలకూలే పరిస్థితి నెలకొని ఉన్నది.

**డచ్ ఓడరేవు ఎగుమతులు – దిగుమతులు:**

'బటేవియా'లోని డచ్ అధికారులు మసులీపటాంలోని తమ డచ్ కంపెనీఅధికారులకు బందరు ఓడరేవు ద్వారా తమకు అత్యవసర సరుకులు పంపమని 'ఎఱ్ఱమిరపకాయ టపా' ద్వారా తరచూ ఆదేశిస్తుండేవారు. అదేవిధంగా వివిధ దేశ మార్కెట్లలో చవకగాదొరికే వస్తువులను / సరుకులను కొనుగోలు చేసి బందరు మార్కెట్లో అమ్మేనిమిత్తం ఓడలద్వారా ఎగుమతి చేసేవారు. **బర్మాదేశం (నేటి మయన్మార్) నుండి 40వేల పౌండ్లు జాజికాయ, 15బ్యాగుల జాపత్రి (MACE) మసులీపటాం ఓడరేవుకు దిగుమతి అయ్యిందని క్రీ.శ. 1623 నాటి డచ్ రికార్డులు తెలుపుతున్నాయి. గోల్కొండసుల్తానులు తమసైనికావసరాల కోసం అరేబియన్ – పర్షియన్ మేలుజాతి గుర్రాలను బందరు ఓడరేవు గుండా ప్రతిఏటా దిగుమతి చేసుకుంటున్నారని 'టవెర్నియర్' వ్రాశాడు. 1652లో మసులీపటాం ద్వారా గోల్కొండకు ప్రయాణం చేసిన ఫ్రెంచ్ యాత్రికుడు ట్రవెన్నియర్ తాను గోల్కొండ కులీ కుతుబ్ అబ్దుల్లాషాకు మంచిముత్యాలు, పగడాలు అమ్మినట్లు తన యాత్రావిశేషాల గ్రంథంలో వ్రాసుకున్నాడు.**

'కౌరీలు'గా పిలువబడిన నాణేలతయారీ ముడిసరుకును మాల్దీవులనుండి గోల్కొండ సర్కారు బందరు ఓడరేవుద్వారా దిగుమతి చేసుకొనేది. **(180 కౌరీలు ఒకపైసా, నాల్గుపైసలు ఒకకాని, నాల్గుకానీలు ఒకఅణా, 16అణాలు ఒకరూపాయి).** స్థానిక వ్యాపారులు చెక్కెరను, కాఫీగింజలను బెంగాల్‌నుండి మసులా ఓడరేవు ద్వారా దిగుమతి చేసుకొనేవారు. **మచిలీపట్నం ఓడరేవుకు విజయవాడ, గోల్కొండ, విజయనగరం (శ్రీకాకుళం), గండికోట, బీజాపూర్, కొల్లూరు (పులిచింతల బేసిన్) సూరత్, సీతానగర్, ఔరంగాబాద్, దౌలతాబాద్, పాట్నా, నయాపూర్, ఖమ్మం, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, దిస్‌గ్రావ్ మొదలగు పట్టణాలనుండి భూమార్గాలుండేవని డా॥మొహమ్మద్ యాకూబి వ్రాశారు. మసులీపటాం ఓడరేవు నుండి బెంగాల్, అరకాన్, పెగూ, హుర్ముజ్, తెన్నాసరిమ్, మలయన్‌దీవులు, సిలోన్, మాల్దీవులు, సూరత్, కేప్ ఆఫ్ కమోరిన్ (కన్యాకుమారి అగ్రము), ఇంగ్లాడ్, హాలాండ్, పోర్చుగల్, పర్షియా, ఫ్రాన్స్, అరేబియా దేశాలతో వ్యాపార జల (ఓడ) మార్గాలుండేవి.** బందరు ఓడరేవు వలన కుతుబ్‌షాహీ సుల్తానులు ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రతిష్టలు పొందారు. అదేవిధంగా కుతుబ్‌షాహీ సుల్తానుల వలన నవీనయుగంలో బందరు ఓడరేవు ప్రపంచం మొత్తానికి తెలిసి వచ్చింది. **కుతుబ్‌షాహీల పరిపాలనలో బందరు ఓడరేవుకు పెరిగిన ప్రాధాన్యత క్రమంలో కుతుబ్‌షాహీ సుల్తాన్ అబ్దుల్లా ఓడరేవుకు ప్రత్యేకంగా 'సిద్దప్ప' అనే అధికారిని, ఓడరేవు పరిపాలన చూడటానికి 'మహమ్మద్ బేగ్'ను నియమించాడు.**

పులికాట్‌రేవులో ఓడరేవు సుంకంక్రింద నూటికి రెండురూపాయలు వసూలు చేస్తుండగా, బందరు అధికారులు నూటికి నాల్గురూపాయిలు వసూలు చేసేవారు. 'పులికాట్ వ్యాపారులు 2%సుంకం చెల్లించటానికి ఇష్టపడేవారు కాదు లాభాలు తక్కువని, కాని బందరు వ్యాపారులు మాత్రం ఏమాత్రం ఇబ్బంది పడకుండా మార్కెట్ అధికలాభాలు దృష్టిలో వుంచుకొని అదనపు సుంకం / అధికసుంకం (4%) కట్టడానికి ఇష్టపడేవారు. బందరు ఓడరేవు ఎప్పుడూ ఎగుమతి దిగుమతి సరుకులమీద లాభాలపంట పండించేది. **డచ్ కంపెనీవారు గోల్కొండ సుల్తాను మొహమ్మద్ ఖుతుబ్‌షాతో 25/07/1619న ప్రతిసంవత్సరం సుల్తానుకు మూడువేల పగోడాలు చెల్లించటానికి ఒప్పందం చేసుకొని బందరు ఓడరేవు పరిధిలో డ్యూటీఫ్రీ వ్యాపారం చేసుకొనటానికి డచ్ వారు 'ఫర్మానా' పొందారు.** గుంటూరుజిల్లా మోటుపల్లి రేవులో ఓడ లంగరేస్తే , గోల్కొండ అధికారులు 15 హొన్నుల అదనపు సుంకం (యాంకరేజ్ టాక్సు) వసూలుచేస్తుండగా బందరు ఓడరేవులో 4 శాతం సుంకంతో పాటు రహదారి పన్ను (Toll

tax) విధించేవారు. (ఒకహొూన్ను = ఒకపగోడాతో సమానం = 5రూపాయలు).

**డచ్ కోటలో ఉరితీత గది:**



డచ్‌కోటగా పిలువబడే 'ఆర్సెనల్' (ఆయుధాగారము)కు గేటు కెదురు భవనములో ఎడమవైపు బ్లాకు పోర్ట్ ఆఫీసుగానూ, కుడివైపు భాగము కష్టమ్స్ ఆఫీసుగానూ వాడబడింది. పోర్టు ఆఫీసు భాగములో **'చీకటి కొట్టు'గా పిలవబడిన గది ఖైదీల 'ఉరితీత గది'గా వాడబడేది. ఉరితీయటానికి గదిపైన తూర్పు – పడమరలకు ఒక పెద్ద దూలము అమర్చబడి క్రింద ఫ్లోరింగ్ భాగము ఆరడగుల లోతు గొయ్యిగా నిర్మించబడి ఉండేది. ఆయుధాగారం శిథిలమయిన తర్వాత, ఉరితీత గదిలోని దూలం క్రింద ఉన్న గొయ్యి పూడ్చి వేసినారు.** ఉరితీయటానికి ఆర్డరు పడిన ఖైదీ (Condemned Prisoner) ను ఈ గదిలో కొంతకాలం ఉంచి, తర్వాత ఉరితీసేవారు. ఖైదీకు ఆహారం కిటికీలా ఉన్న ఖానా నుండి అందచేసేవారు. భద్రాచల రామదాసు బందీ ఖానాలా ఉండే ఉరి గది ఇంకనూ ఉన్నది.

**బందరు మొండి జగన్నాధస్వామి గుడిలో డచ్ సమాధిరాయి:**

బందరు పట్టణంలో జగన్నాధపురంలో మొండి జగన్నాధస్వామి దేవాలయం ఒకటి ఉంది. గుడి ఆవరణలో, నాల్గు ముఖాల చెక్కబడి భూమిలో పాతబడి ఉన్న నల్లరాతి (శిలా) శాసనం ఉన్నది. గుడి పూజారులు చెప్పటం – 'ఈ గుడి ప్రాచీనమని, క్రీ.శ. 15వ శతాబ్దిలో చాళుక్యులు కట్టించా'రని తెలిసీ తెలియని విషయాలు ముచ్చటిస్తారు.

ప్రస్తుత విషయానికొస్తే, ఆలయ ఆవరణలో పైన చెప్పిన నల్లరాతి శిలా శాసనం ప్రక్కనే మరొక కడప నాపరాయి మీద సుత్తీ శానంతో తెలుగు భాషలో చెక్కటానికి ప్రయత్నం చేసిన దీర్ఘచతురస్రాకారపు నాపరాయి పలక, పావువంతు భూమిలో పాతబడి యున్నది. **ఇది శాసన శిల మాత్రం కాదు. డచ్ దేశపు వ్యక్తి సమాధి మీద పరచిన నాపరాతి పలక మాత్రమే. (డచ్ భాషలో, డచ్ దేశపు లిపిలో – ఆ దేశపు జెండా మీద ఉండే రెండు తలల డేగ బొమ్మతో ఉన్న డచ్ సమాధిపైన పరిచే సమాధి ఫలకం)** 1990 ప్రాంతంలో ఈ దేవాలయం మరమ్మత్తులు చేసినప్పుడు గర్భగుడి గుమ్మం మీద పెట్టబడియున్న ఈ నాపరాయిని తీసివేసి, గుడి ఆవరణలో నిలువుగా పాతిపెట్టారు. డచ్ ప్రజలకు వైద్యం చేసినందుకు గాను, డచ్ అధికారులు సంతసించి గుడికి – వైద్యం చేసిన వైష్ణవ పూజారికి మడులు – మాన్యాలు ఇస్తూ చెక్కియిచ్చిన శిలాశాసనంగా (ఈ నాపరాయి సమాధి ఫలకాన్ని) కొందరు భావించారు. వాస్తవానికి డచ్ సమాధిమూత నాపరాయి మీద ఉన్న డచ్ లిపి మీద తెలుగు లిపిలో ఏదో విషయం సుత్తీ శానంతో ఎవరో అస్పష్టంగా చెక్కారు. గుడికి – గుడి పూజారి – వైద్యం చేసే ఆచార్యుల వారికి మడులు మాన్యాలు ఇవ్వటమనేది శుభకార్యం. భూమి పుత్రా దానం చేస్తే వేరే నల్లరాయి మీద చెక్కి ఇచ్చేవారు. కాని అశుభ కారక సమాధి రాయి మీద కాదు. సమాధిరాయి గర్భ గుడి గడప మీద పరచటం అశుభమని భావించిన గుడి యాజమాన్యం, ఈ రాతి పలకను తొలిగించి గుడి ఆవరణలో భూమి మీద పాతి ఉంచారు. నాపరాయి పలకమీద మృతుని వివరాలు ఉన్నవి. ఇలాంటి రాళ్ళు వలందపాలెం **ASI** పర్యవేక్షణ క్రింద ఉన్న డచ్ శ్మశానం సమాధుల మీద పరచబడి ఉన్నవి. ప్రపంచ వ్యాప్తంగా డచ్ సమాధి పై ఫలకాలు యిదే విధంగా ఉంటాయి.

**మచిలీపట్నంలో పనిచేసిన డచ్ కౌన్సిల్ ముఖ్యులు**
**(ఛీఫ్స్ ఇన్ డచ్ కౌన్సిల్)**

1 ఆంద్రయిస్ శౌరి ............................ 1620–1622
2 అబ్రహం వాన్ ఉఫెలెన్ .................. 1622–1624
3 జాకబ్ డీ డెల్ ........................................1624
4 జొహన్నెస్ లిబెనార్ ................................1625
5 జాకబ్ డి విట్ .......................................1631
6 జాన్ వాన్ మెల్‌డెర్డ్ ...............................1634
7 జాన్ డి మీర్రె .......................................1635
8 అర్‌నాల్డ్ హ్యూస్సెన్ ...............................1640
9 బార్‌తోలో మయెస్ డి గ్రుయేటర్ .........1639–1649
10 పీటర్ స్మామె ..............................1642–1649
11 జాకబ్ జూన్నియస్ (ప్రెసిడెంట్) .......................1649
12 లారెన్స్ పిట్ ............................వివరాలు అలభ్యం
13 కార్నెలిస్ వాన్ స్వాలెబెర్గ్ ................వివరాలు అలభ్యం
14 లుడాల్ఫ్ వాన్ కౌలెబెర్గ్ .................వివరాలు అలభ్యం
15 జాక్యూస్ కొలియర్ వాన్ జెంట్ ................1659–66

– కిష్ణాజిల్లా మాన్యువల్ నుండి.

–మహమ్మద్ సిలార్
కన్వీనర్, ఇంటాక్ మచిలీపట్నం చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 9985564946

# ఆధ్యాత్మిక నిలయం.. బ్రహ్మంగారిమఠం

- గత ఏడాది తుఫాను ప్రభావంతో కూలిపోయిన బ్రహ్మంగారి నివాస గృహం
- కలెక్టర్ సూచనతో స్పందించిన ఇంటాక్ కడప చాప్టర్
- కూలిపోయిన బ్రహ్మంగారి నివాసాన్ని పరిశీలించిన కేంద్ర ఇంటాక్ బృందం
- పునరుద్ధరణకు అంచనాల రూపకల్పన

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు వెలసిన కందిమల్లయ్య పల్లె (బ్రహ్మంగారిమఠం) ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లాలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆధ్యాత్మిక క్షేత్రం. ఈ మఠం యొక్క అతిపెద్ద విశిష్టత ఏమిటంటే స్వామి వారు ఇక్కడ సజీవ సమాధి పొందారు. 1693 వ సంవత్సరంలో వైశాఖ శుద్ధ దశమి నాడు వేలాదిమంది భక్తుల సమక్షంలో ఆయన భూగర్భ సమాధిలోకి వెళ్లారు. భక్తులు నేటికీ ఆ సమాధిని దర్శించుకుని తమ కోరికలు నెరవేరాలని ప్రార్థిస్తూ ఉంటారు.

**కాలజ్ఞాన నిలయం:**

బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞానం ఈ మఠం నుంచే ప్రపంచానికి పరిచయమైంది. భవిష్యత్తులో జరగబోయే వింతలు, విశేషాలను తాళపత్ర గ్రంథాల రూపంలో ఆయన ఇక్కడే భద్రపరిచారని భక్తుల నమ్మకం. మఠం గోడలపై చెక్కబడిన కాలజ్ఞాన పద్యాలు నిత్యం భక్తులను ఆశ్చర్యానికి గురి చేస్తుంటాయి.

**కుల మతాలకు అతీతం:**

బ్రహ్మంగారిమఠం కులమతాలకు అతీతమైనది. స్వామి వారి ప్రధాన శిష్యుడైన సిద్దయ్య ఒక ముస్లిం యువకుడు. సిద్దయ్యకు జ్ఞానోపదేశం చేసి తన వారసుడిగా ప్రకటించడం ద్వారా ఆ కాలంలోనే కుల వివక్షకు వ్యతిరేకంగా ఒక పెద్ద విప్లవాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. అందుకే ఇక్కడికి హిందువులతో పాటు ముస్లింలు కూడా పెద్ద సంఖ్యలో వస్తుంటారు.



వర్షం ధాటికి కూలిపోయిన బ్రహ్మంగారి నివాసం

**ప్రధాన కట్టడాలు.. విశేషాలు:**

**ఈశ్వరమ్మ గారి మఠం:**

బ్రహ్మంగారి మనవరాలైన ఈశ్వరమ్మ గారు కూడా గొప్ప యోగిని. ఆమె తపస్సు చేసిన ప్రదేశం, ఆమె సమాధి కూడా ఇక్కడ విశిష్టమైనది.

**నవరత్న మండపం:**

అత్యంత సుందరమైన శిల్పకళతో నిర్మించిన ఈ మండపం భక్తులను ఆకట్టుకుంటుంది.

**కళా గోడలు:**

స్వామివారి జీవిత చరిత్రను, ఆయన మహిమలను తెలిపే అద్భుతమైన చిత్రపటాలు మనం ప్రాంగణంలో చూడవచ్చు.

**ఆధ్యాత్మిక వాతావరణం:**

మఠం చుట్టూ ఉన్న ప్రశాంతమైన వాతావరణం, నిత్యం జరిగే భజనలు, అన్నదాన కార్యక్రమాలు భక్తులకు మనశ్శాంతిని ప్రసాదిస్తాయి. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమినాడు జరిగే బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి.




మఠాధిపతితో మాట్లాడుతున్న కె. చిన్నపరెడ్డి - ఇంటాక్ కడప్ చాప్టర్, ఇంటాక్ న్యూఢిల్లీ కేంద్ర బృందం సభ్యులు

**పర్యాటక ప్రాముఖ్యత:**

కడప జిల్లాలో ఉన్న ఈ మఠం సమీపంలోనే శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రిజర్వాయర్ (బ్రహ్మం సాగర్) ఉంది. ఇది ఒక గొప్ప పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతోంది .

**బ్రహ్మం గారు నివాసమున్న ఇల్లు:**

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారు నివసించిన ఇల్లు, ఆయన ఆధ్యాత్మిక ప్రయాణం సాగించిన ప్రాంతం కడప జిల్లాలోని కందిమల్లాయపల్లినే. బ్రహ్మంగారు తన జీవితంలో ఎక్కువ కాలం గడిపింది, కాలజ్ఞానాన్ని రచించింది ఈ గ్రామంలోనే. అప్పట్లో ఇది ఒక చిన్న పల్లెటూరు. ఆయన ఇక్కడే ఒక చిన్న ఇంటిలో ఉంటూ పశువులను కాస్తూ, మరోవైపు లోక కళ్యాణం కోసం జ్ఞానబోధ చేసేవారు.

**కాలజ్ఞానం రాసిన చోటు:**

ఆయన తన ఇంటి ప్రాంగణంలోనే కూర్చుని తాళపత్ర గ్రంథాలపై భవిష్యత్తును లిఖించేవారు. ఆ ఇల్లే ఒక జ్ఞాన దేవాలయంగా వెలుగొందింది. ఆయన భార్య గోవిందమ్మ గారు కూడా అదే ఇంట్లో ఉంటూ స్వామివారి శిష్యులకు (సిద్దయ్య వంటి వారికి) మాతృ ప్రేమతో భోజనం వడ్డించేవారు.

**ప్రస్తుత స్థితి:**

బ్రహ్మంగారు నివసించిన చోటుకు సమీపంలోనే భక్తులు ధ్యానం చేసుకోవడానికి, స్వామివారి పాదుకలను దర్శించుకోవడానికి ఏర్పాట్లు ఉన్నాయి.

**బనగానపల్లి- రవ్వలకొండ (మరో ముఖ్యమైన నివాసం):**

కందిమల్లయ్య పల్లికి రాకముందు స్వామి వారు కర్నూలు జిల్లాలోని బనగానపల్లిలో కూడా నివసించారు. అక్కడ అచ్చమ్మ అనే మహిళ ఇంట్లో పశువుల కాపరిగా ఉంటూ అక్కడి సమీపంలోని రవ్వలకొండ గుహల్లో కూర్చుని కాలజ్ఞానం రాశారు. బనగానపల్లిలో ఆయన నివసించిన ఇంటిని కూడా భక్తులు మఠంగా పిలుస్తారు. అక్కడ ఆయన కాలజ్ఞానాన్ని పూడ్చిపెట్టినట్లుగా చెప్పబడే చింత చెట్టు కూడా ఎంతో ప్రసిద్ధి చెందింది. కాగా కందిమల్లయ్యపల్లి లోని బ్రహ్మంగారి నివాసం ఇప్పుడు ఒక మహోన్నతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది.

**తుఫాను ప్రభావంతో కూలిపోయిన బ్రహ్మంగారి నివాసం.. స్పందించిన ఇంటాక్:**


బ్రహ్మంగారు నివాసమున్న ఇల్లు గత ఏడాది తుఫాను కారణంగా కూలిపోయింది. దీంతో భక్తులు తీవ్ర ఆవేదన చెందారు. వెంటనే ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఇంటాక్ ఆధ్వర్యంలో బ్రహ్మం గారి నివాస గృహాన్ని యథాస్థితిలో నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈమేరకు భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్, న్యూఢిల్లీ - కడప చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి నేతృత్వంలోని బృందం కూలిపోయిన బ్రహ్మంగారి నివాస గృహాన్ని పరిశీలించింది. ఆ తర్వాత ఇదే విషయాన్ని ఇంటాక్ కేంద్ర కార్యాలయం దృష్టికి కూడా తీసుకెళ్లింది. దీంతో కేంద్ర కార్యాలయం తరఫున ప్రతినిధి బృందం ఇటీవల బ్రహ్మంగారిమఠం సందర్శించింది. కూలిపోయిన బ్రహ్మంగారి నివాసాన్ని యథాస్థితిలో పునర్ నిర్మించేందుకు అవసరమైన అంచనాలను రూపొందించింది. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. త్వరలో ఇంటాక్ ఆధ్వర్యంలో బ్రహ్మంగారి నివాసం పనులు పునరుద్ధరించబడనున్నాయి. గృహాన్ని పునర్ నిర్మించే విషయంలో ఇంటాక్ తీసుకున్న చొరవను భక్తులు, పర్యాటక ప్రియులు హర్షిస్తున్నారు.

- కె. చిన్నపరెడ్డి
INTACH కడప జిల్లా చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 98855 66644



*ఇంటాక్ న్యూఢిల్లీ కేంద్ర సభ్యులతో ఇంటాక్ కడప చాప్టర్ బృందం*

# జిర్కోనియం మూలకం యొక్క ఖనిజాలు




జిర్ కోనియం కేంద్ర ప్రభుత్వం ద్వారా నోటిఫై చేయబడిన క్రిటికల్ మినరల్స్‌లో ఒకటి. వీటి నిక్షేపాలు మనదేశంలో ప్రస్తుతం గుర్తించి, నిర్ధారించబడ్డ జిర్కోనియం నిక్షేపాలు మన అవసరాలకు సరిపడా లేవు. దాదాపు 70 శాతం వేరే దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాము.

జిర్కోనియం మూలకం యొక్క సింబల్ Zr మరియు దాని ఆటమిక్ నంబర్ 40. ఈ మూలకాన్ని మొట్టమొదట 1789లో గుర్తించబడినది. కాని దీని మ్యానుఫ్యాక్చరింగ్ 1925లో మొదలైంది. స్వచ్ఛమైన జిర్కోనియం గ్రేయిశ్ వైట్ కలర్‌లో ఉంటుంది. కొంత వరకు టైటానియం పోలి ఉంటుంది. ఇది రూమ్ టెంపరేచర్‌లో సాలిడ్‌గా ఉంటుంది. మరియు ఇది డాక్టైల్, మ్యూలియబుల్ మరియు క్రోశన్ రెసిస్టెంట్.

జిర్కోనియం పేరు దాని ఖనిజం జిర్కాన్ నుండి వచ్చింది. ఈ ఖనిజమే దీనికి ముఖ్యమైన ఆధారం. జిర్కోనియం జిర్కాన్ ఖనిజంలో కాకుండా ఇంకా 140 ఖనిజాలలో దొరుకుతుంది. వీటిలో కొన్ని ముఖ్యమైన ఖనిజాలు బ్యాడెలైట్, యుడ్యలైట్. జిర్కోనియం చాలా వరకు టైటానియం మరియు టిన్ డిపాజిట్స్‌లో నుండి బైప్రొడక్ట్‌గా ఉత్పత్తి చేయబడుతుంది.

ముఖ్యమైన జిర్కోనియం ఖనిజాలు జిర్కాన్ ($ZrSio_4$)లో 43 శాతం జిర్కోనియం ఉంటుంది. మరియు ఈ ఖనిజం చాలా వరకు హెవి మినరల్ సాండ్స్‌లో గార్నెట్, రూటైల్, ఇల్‌మెనైట్‌తో పాటు దొరుకుతుంది.


బ్యాడిలైట్ ఖనిజంలో 70 శాతం జిర్కోనియం ఉన్నప్పటికి ఇది తక్కువ మొత్తంలో దొరుకుతుంది. ఈ ఖనిజాలు చాలా వరకు బీచ్ డిపాజిట్స్ నుండి మైనింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, మొజాంబిక్ మరియు అమెరికా. మన దేశంలో కూడా కోస్తా ప్రాంతంలో బీచ్ సాండ్స్‌లో, ఎక్కువగా ఈస్ట్ కోస్ట్‌లో. ఎందుకంటే, ఈస్ట్‌కోస్ట్ డిపాజిశనల్ కోస్ట్ కావడం వల్ల, పెద్ద డెల్టాలు ఉండటం వలన. ఇది కాకుండా గ్రానైట్–నైస్ టెర్రేన్స్‌లో కొన్ని ప్రాంతాలలో జి.ఎస్.ఐ. జియోకెమికల్ మ్యాపింగ్ ద్వారా నిర్ధారించింది. ఆ ప్రాంతాలను దేశమంతటా డిటేల్డ్ జియోలాజికల్ పరిశోధనలు చేపట్టారు.

ప్రస్తుతం మన దేశంలో మన అవసరాలకు సరిపడే నిక్షేపాలు లేకపోవడం వల్ల దాదాపు 80శాతం దిగుమతి చేసుకొంటున్నాము. అందుకే కేంద్ర ప్రభుత్వం దీనిని క్రిటికల్ మినరల్‌గా నోటిఫై చేసింది.

జిర్కాన్‌ని డైరెక్ట్‌గా హైటెంప్రేచర్ అప్లికేషన్స్‌లో



ఆల్కలి ఫెల్సపార్ గ్రానైట్




జిరాకాన్ గ్రేన్స్ (Zr) – గ్రానైట్ సెక్షన్లో – మైక్రోసాకాపెలో



గ్రానోడయో రైట్

ఉపయోగిస్తారు. ఎందుకంటే దీనికి ఎక్కువ హార్డ్‌నెస్ మరియు రిఫ్రాక్టరీ క్వాలిటీస్ ఉండటం వలన మరియు కెమికల్ రియాక్షన్స్‌కు రెసిస్‌టెంట్‌గా ఉంటుంది.

జిర్‌కాన్ ముఖ్యంగా ఓపాసిఫైయర్‌గా ఉపయోగిస్తారు. అగ్రెస్సివ్ ఎన్విరాన్‌మెంట్స్‌లో మొల్డ్స్, మొల్‌టెన్ మెటల్స్‌లో ఉపయోగిస్తారు.

జిర్‌కోనియం డైయాక్సైడ్ ($ZrO_2$)ని లాబొరేటరీ క్రూసిచుల్స్, మెటలర్జికల్ ఫర్నేసెస్, రిఫ్రాక్టరీస్‌లో ఉపయోగిస్తారు. జిర్‌కాని, శిలల వయస్సు కనుగొనడానికి వాడతారు. వాటి రేడియో ఐసోటోప్స్ ద్వారా, అల్లాయ్స్‌లో కూడా ఉపయోగిస్తారు. వీటిని సర్జికల్ అప్‌లైన్సెస్, లైట్ ఫిలమెంట్స్, ప్రైమర్స్, వ్యాక్యూమ్ ట్యూబ్స్‌లో, ఫొటో గ్రాఫిక్‌ఫ్లాష్ బల్బులలో ఉపయోగిస్తారు. జిర్‌కోనియంని న్యూక్లియర్ రియాక్టర్ ఫుఎల్స్, జెట్ ఇంజెన్స్‌లో, డెంటల్ ఇంప్లాంట్స్‌లో కూడా ఉపయోగిస్తారు.

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



బ్లాక్ సాండ్ డిపోసిట్స్ – భీమునిపట్నం బీచ్, ఆంధ్రప్రదేశ్




# కాలానికి అతీతంగా వారణాసి

## జీవ నదీతీరంలో సజీవంగా పురాతన వారసత్వం

### యునెస్కో వారసత్వ గుర్తింపు

వారణాసిలోని 'ఐకానిక్ రివర్ ఫ్రంట్' (ఘాట్స్) యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో స్థానం పొందడం ప్రపంచంలోని అత్యంత పురాతన నగరాల్లో ఒకదానికి విశిష్ట గుర్తింపు తీసుకువచ్చినట్లయింది.


**దాఖలు చేసిన తేదీ:** 13/04/2021

**ప్రాథమ్యాలు:** (iii)(iv)(vi)

**విభాగం:** సాంస్కృతికం

**దాఖలు చేసింది:** యునెనస్కోలోని భారత శాశ్వత ప్రతినిధి బృందం

**రాష్ట్రం:** ఉత్తరప్రదేశ్



వారణాసి.. ఈ పేరు వింటే చాలు.. భక్తుల మనస్సుల్లోనే కాదు.. ప్రాచీన వారసత్వ పరిరక్షకుల మనస్సుల్లోనూ ఒక విధమైన చెప్పలేని పులకింత కలుగుతుంది. అందుకు కారణం ప్రపంచపు కొనసాగుతున్న అత్యంత ప్రాచీన సజీవ నగరాల్లో ఇది కూడా ఒకటి.

పురావస్తు తవ్వకాలు, చారిత్రక పత్రాలు, శాస్త్రీయ విశ్లేషణలు వారణాసి నగరం ప్రపంచంలోనే అత్యంత పురాతన మైన, నిరంతరం జనజీవనం సాగుతున్న నగరాలలో ఒకటి అనే వాస్తవాన్ని ధృవీకరిస్తున్నాయి. విశిష్టమైన ఘాట్లు, దేవాలయాలు, చారిత్రక నివాసాలు, సజీవ మత పరమైన, సాంస్కృతిక సంప్రదాయాలతో నిండిన వారణాసి, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ఒక అత్యున్నత రూపం. ఇక్కడి ఘాట్లు ఆయా సంప్రదాయాలకు ప్రతి రూపాలుగా నిలుస్తాయి. భారతీయ సందర్భంలో గంగానదికి ఉన్న అపారమైన పవిత్రత కారణంగా, ఈ నదీ తీర ప్రాంతం (రివర్ ఫ్రంట్) నగరంలోనే అత్యంత కీలకమైన భాగం. నదికి, భూమికి మధ్య వారధిలా ఉండే ఈ తీర ప్రాంతం.. నదిలోకి వెళ్లే మెట్లు (ఘాట్లు), వాటి పైన గంభీరంగా కనిపించే కట్టడాలు, వాటి వెనుక ఉండే పురాతన సందులతో కూడి ఉంటుంది. ఈ సందుల్లో దేవాలయాలు, మసీదులు, రాజభవనాలు, హవేలీలు (సంప్రదాయ ప్రాంగణ గృహాలు), కుండాలు (కోనేర్లు), అఖాడాలు, ఉద్యాన వనాలు, ముఖద్వారాలు విస్తరించి ఉన్నాయి. ఈ ఘాట్లు నగర సాంస్కృతిక సంప్రదాయాలను, మతపరమైన ప్రతీకలను ప్రతిబింబి స్తాయి. తద్వారా హిందూ ధర్మానికి ఇవి అత్యంత విశిష్ట మైనవిగా నిలుస్తున్నాయి

నగరానికి తూర్పు అంచున, గంగా నది వెంబడి 6.5 కిలోమీటర్ల (4 మైళ్ల) పొడవునా విస్తరించి ఉన్న ఈ నదీ తీర ప్రాంతం (రివర్ ఫ్రంట్) ఒక విశిష్టమైన చరిత్రను కలిగి ఉంది. ఇది ఎత్తైన భవనాలు, పుణ్యక్షేత్రాలతో కూడిన ఒక అద్భుతమైన నిర్మాణ శ్రేణిని ఆవిష్కరిస్తుంది. తద్వారా ఈ ఘాట్లు వాటి పైన ఉన్న కట్టడాలతో విడదీయలేని విధంగా ముడిపడి ఉన్నాయి. నదీ తీరంలోని ఈ పవిత్ర స్థలాల చరిత్ర సా.శ. 8వ-9వ శతాబ్దాల నాటి నుంచి ఉన్నప్పటికీ, రాతి మెట్లతో కూడిన ఘాట్ల నిర్మాణం మాత్రం సా.శ.14వ శతాబ్దం నుండి ప్రారంభమైంది. ఇక్కడి మెజారిటీ ఘాట్లు నేటికీ పండుగలు, ఆచారాలకు వేదికలుగా ఉన్నాయి. ఇది తన చారిత్రక గతం నుండి నిరంతరాయంగా కొనసాగుతున్న ఒక గొప్ప సంప్రదాయం.

నదీ తీరానికి దారితీసే ఈ మెట్లు (ఘాట్లు) పవిత్ర స్థలాల సంకేతాత్మక గొలుసుకట్టుగా ఏర్పడ్డాయి. ఇక్కడ మొత్తం 84 ఘాట్లు



ఉన్నాయి: అస్సి, గంగా మహల్, రివాన్, తులసి, భదైని, జానకి, మాతా ఆనందమయి, వచ్ఛరాజ, జైన్, నిషాద్, ప్రభు, పంచకోట, చేత్ సింగ్, నిరంజని, మహానిర్వాణి, శివాల, గులారియా, దండి, హనుమాన్, ప్రాచీన (పాత) హనుమాన్, కర్ణాటక, హరిశ్చంద్ర, లాలి, విజయనగరం, కేదార్, చౌకీ, క్షేమేశ్వర/సోమేశ్వర, మానసరోవర, నారద, రాజా (అమృత రావు ఘాట్), ఖోరి, పాండే, సర్వేశ్వర, దిగ్పాటియా, చౌసట్టి, రాణా మహల్, దర్భంగా, మున్షీ, అహల్యాబాయి, శీతల, దశాశ్వమేధ, ప్రయాగ్, రాజేంద్ర ప్రసాద్, మాన్ మందిర్, త్రిపుర భైరవి, మీర్, ఫూటా/నయా, నేపాలీ, లలిత, బౌలి/ ఉమారావ్‌గిరి/అమ్రోహా, జలశాయి, ఖిర్కీ, మణికర్ణిక, బాజీరావు, సింధియా, సంకట, గంగా మహల్ (II), భోంస్లా, నయా, గణేశ, మెహతా, రామ, జటార, రాజా గ్వాలియర్, మంగళ గౌరి, వేణిమాధవ, పంచగంగ, దుర్గ, బ్రహ్మ, బుందీ, (ఆది) శీతల, లాలా, హనుమాన్‌గఢీ, గయ/గాయ్, బద్రీ నారాయణ, త్రిలోచన, గోల, నందీశ్వర/నందు, సక్కా తెలియనాలా, నయా/ఫూటా, ప్రహ్లాద, రాజ్ మరియు ఆది కేశవ.

ఈ ఘాట్లు చూడటానికి ఒకే వరుసలో సాగిపోయే మెట్లలా అనిపించినప్పటికీ, ఇవి వేర్వేరు చారిత్రక కాలాల్లో నిర్మించబడ్డాయి. వాటన్నింటిలో ఒక్కోదానిలో సుమారు 40 నుండి 60 వరకు రాతి మెట్లు ఉంటాయి. ప్రజల ఉపయోగం కోసం నిర్మించిన అష్టభుజి ఆకారపు ఎత్తైన వేదికలు, మతపరమైన ఆచారాల కోసం బ్రాహ్మణులు ఉపయోగించేందుకు నదికి దగ్గరగా నిర్మించిన చిన్న చతురస్రాకార వేదికలు వీటి ప్రత్యేకత. ఈ ఘాట్లు వారణాసి (బనారసి) సంస్కృతికి సంబంధించిన దైనందిన కార్యకలాపాలు మొదలుకొని స్నానాలు, ఆచారాలు, పండుగలు, అంత్యక్రియల వంటి ఆధ్యాత్మిక అంశాల వరకు అనేక కార్యక్రమాలకు నిలయంగా ఉన్నాయి. చాలా ఘాట్లకు వాటి చరిత్రతో ముడిపడి ఉన్న ప్రముఖ వ్యక్తుల పేర్లు లేదా వాటి పురాణ, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను ప్రతిబింబించే పేర్లు పెట్టబడ్డాయి.

రాజ్ ఘాట్ వద్ద జరిగిన పురావస్తు తవ్వకాల ప్రకారం, ఈ నదీ తీర ప్రాంతం ఒకప్పుడు వాణిజ్య కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా ఉండేది. ఉత్తర భారతదేశం గుండా సాగే పాత వ్యాపార మార్గం గంగానదిని దాటే చోట ఈ నగరం ఉండటం వల్ల, సామాన్య శక పూర్వం మొదటి సహస్రాబ్దిలోనే పొరుగు ప్రాంతాలతో వాణిజ్య సంబంధాల కారణంగా వారణాసి ప్రాంతంలో జనావాసాలు అభివృద్ధి చెందాయి. గుప్త రాజవంశం (సా.శ. 3 – 6వ శతాబ్దాలు) కాలంలో ఇక్కడ వ్యాపార, విద్యా సంస్థల వృద్ధికి సంబంధించి సాటిలేని వాణిజ్య, గిడ్డంగుల సముదాయాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. పురాతన పురాణ ప్రస్తావనలు ఈ నగరాన్ని ఒక 'ఓడరేవు పట్టణం'గా కూడా అభివర్ణించాయి. కనీసం సా.శ. 6వ శతాబ్దం నుండి ఇది ఒక తీర్థయాత్రా స్థలంగా ఎదగడం ప్రారంభించింది. 12వ శతాబ్దం నాటికి, ఈ ఘాట్లు ప్రముఖ ఆకర్షణలుగా మారి, హిందువులకు అత్యంత పవిత్రమైన కేంద్రాలలో ఒకటిగా వారణాసి గుర్తింపు పొందింది. పురాణ సాహిత్యం వివిధ సందర్భాల్లో ఈ ఘాట్ల వైభవాన్ని స్పష్టంగా వర్ణించింది. అనేక శాసనాలు, గ్రంథాలు ఆచారాల పరంగా ఈ ఘాట్ల ప్రాముఖ్యతను ఉదహరించాయి. 17వ శతాబ్దం నాటికి, వారణాసి సమగ్ర రూపంలో ఈ నదీ తీర ప్రాంతం (రివర్ ఫ్రంట్) అత్యంత ప్రధానమైన భాగంగా ఎదిగింది.

ఘాట్ల వెంబడి ఉన్న రాజభవనాల వంటి భవనాలు చాలా వరకు 18–19వ శతాబ్దాలలో మరాఠాల పోషణలో నిర్మించబడ్డాయి. 18వ శతాబ్దపు చివరి నుండి 20వ శతాబ్దం మధ్య కాలంలో, భారతదేశంలోని వివిధ ప్రాంతాల పాలకుల ఆదరణతో అనేక ఆశ్రమాలు, సంస్కృత పాఠశాలలు, దేవాలయాలు, యాత్రికుల విశ్రాంతి గృహాలు నిర్మించబడ్డాయి – తద్వారా ఇవి దేశంలోని వివిధ ప్రాంతాల వాస్తుశిల్ప వైవిధ్యానికి నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి. నేటికీ ఇక్కడ కొనసాగుతున్న సంస్కృత భాషా వినియోగం, వేద పఠనం (దీనిని 2008లో యునెస్కో 'మానవత్వం యొక్క అమూల్యమైన సాంస్కృతిక వారసత్వ జాబితా'లో చేర్చింది). ఇక్కడ ఇప్పటికీ సజీవంగా ఉన్న సంపన్నమైన, విభిన్నమైన ఆచారాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

పురాణాల ప్రకారం, దుర్గా దేవి శుంభ-నిశుంభ అనే రాక్షసులను సంహరించిన తర్వాత, తన ఖడ్గాన్ని (అసి) నేలకేసి కొట్టింది. ఆ ఖడ్గం తగిలిన చోటు నుండి ఒక నది పుట్టిందని, అందుకే దానికి 'అసి' (సంస్కృతంలో అసి అంటే ఖడ్గం) అని పేరు వచ్చిందని చెబుతారు.

సంస్కృతంలో 'అసి' అంటే ఖడ్గం. ఈ నది వారణాసి నగరానికి ఒక రక్షణ కవచంలా (ఖడ్గంలా) దక్షిణ సరిహద్దులో ప్రవహిస్తుంది.

వారణాసి అనే పేరు ఉత్తరాన ఉన్న 'వరుణ', దక్షిణాన ఉన్న 'అస్సి' అనే రెండు నదుల కలయిక వల్ల వచ్చిందని ప్రతీతి (వరుణ + అసి = వారణాసి).

అస్సి నది గంగానదిలో కలిసే చోట ఉన్న ఘాట్‌ను అస్సి ఘాట్ అంటారు. ఇది కాశీలోని అత్యంత పవిత్రమైన, ప్రసిద్ధమైన ఘాట్లలో ఒకటి. ప్రస్తుతం ఈ అస్సి నది ఒక చిన్న కాలువలా కనిపిస్తుంది, కానీ ఆధ్యాత్మికంగా దీనికి చాలా ప్రాముఖ్యత ఉంది.

సుబహ్-ఎ-బనారస్ అనేది ప్రతిరోజూ సూర్యోదయానికి ముందే అస్సి ఘాట్ వద్ద ప్రారంభమయ్యే ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమం.

తెల్లవారుజామున 5:00 గంటలకు (వేసవిలో) లేదా 5:30 గంటలకు (శీతాకాలంలో) అత్యంత వైభవంగా గంగా హారతి జరుగుతుంది. సాయంత్రం జరిగే దశాశ్వమేధ ఘాట్ హారతి కంటే ఇది కొంచెం ప్రశాంతంగా ఉంటుంది. హారతి తర్వాత వేద మంత్రాల ఉచ్చారణతో కూడిన యజ్ఞం జరుగుతుంది. చివరగా, గంగా నది అలల సవ్వడి మధ్య ప్రముఖ కళాకారులచే హిందుస్తానీ శాస్త్రీయ






సంగీత కచేరీ జరుగుతుంది. ఈ అనుభవం పర్యాటకులకు ఎంతో మానసిక ప్రశాంతతను ఇస్తుంది.

అస్సి ఘాట్ సమీపంలోనే పురాతనమైన 'లోలార్క కుండం' ఉంది. సంతానం కోసం భక్తులు ఇక్కడ పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. ఇక్కడ ఒక పురాతన రావి చెట్టు కింద పెద్ద శివలింగం ఉంటుంది. ఇక్కడ పూజలు చేయడం చాలా విశేషంగా భావిస్తారు. ప్రసిద్ధ కవి తులసీదాస్ గారు 'రామచరిత మానస్' కావ్యాన్ని ఈ అస్సి ఘాట్ వద్దే పూర్తి చేశారని చెబుతారు. ఆయన ఇక్కడే పరమపదించారు. సంకట్ మోచన్ హనుమాన్ ఆలయం అస్సి ఘాట్ నుండి సుమారు 2 కి.మీ దూరంలో ఉంటుంది. ఇది కాశీలోని అత్యంత ప్రసిద్ధ హనుమాన్ ఆలయాలలో ఒకటి.

అత్యంత పుణ్యప్రదమైనవి, పవిత్రమైనవిగా వర్ణించబడిన ఐదు ఘాట్లను 'పంచతీర్థీలు' అని పిలుస్తారు. వీటి ప్రాముఖ్యత గురించి మొదటిసారిగా సా.శ. 6వ శతాబ్దం నాటి పురాతన గ్రంథమైన మత్స్య పురాణంలో ప్రస్తావించబడింది. ఆ ఐదు ఘాట్లు:



**అస్సి:** అస్సి, గంగా నదుల పూర్వ సంగమ ప్రాంతంలో ఉన్నందున దీనికి ఈ పేరు వచ్చింది (ఈ రెండు నదులు మతపరంగా, సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక పరంగా దేనికదే విశిష్టమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి).

**దశాశ్వమేధ:** చారిత్రకత, సంప్రదాయాల కొనసాగింపు దృష్ట్యా ఇది అత్యంత ముఖ్యమైన ఘాట్. పురాణాల ప్రకారం, బ్రహ్మదేవుడు ఇక్కడ పది అశ్వమేధ యాగాలు నిర్వహించారు. అనేక ముఖ్యమైన పుణ్యక్షేత్రాలు ఇక్కడే కొలువై ఉన్నాయి

●**మణికర్ణిక:** ఇది అత్యంత ప్రాచీనమైన, పవిత్రమైన స్మశాన వాటికగా ప్రసిద్ధి చెందింది. పురాణాల ప్రకారం, ఇక్కడ శివుడు లేదా పార్వతీ దేవి చెవి ఆభరణం (మణి) పడిందని చెబుతారు. జీవితం, మరణం కలిసే చోటుగా ఇది ఆధ్యాత్మిక ముక్తికి (మోక్షానికి) చిహ్నంగా నిలుస్తుంది.

●**పంచగంగ:** ఐదు పవిత్ర నదుల (గంగ, యమున, సరస్వతి, కిరణ, ధూతపాప) అదృశ్య సంగమ స్థానంగా దీనిని పరిగణిస్తారు. ఇక్కడ ఉన్న 'బిందు మాధవ' ఆలయం, ఘాట్ పై వరుసగా వెలిగే దీపాలు (కార్తీక మాసంలో) అత్యంత విశిష్టమైనవి.

●**ఆది కేశవ:** ఇది వారణాసి నగరానికి ఉత్తర అంచున, వరుణ, గంగా నదుల సంగమ ప్రాంతంలో ఉంది. వారణాసిలోకి విష్ణుమూర్తి మొదట ఇక్కడే అడుగుపెట్టారని నమ్ముతారు, అందుకే దీనిని 'ఆది' (మొదటి) క్షేత్రంగా పిలుస్తారు.

వారణాసి నగరం అనేక సంకేతాత్మక అర్థాలను కలిగి ఉంది. ఇది పవిత్ర గంగానది వల్లనే ఉనికిలోకి వచ్చింది. ఇక్కడి నదీ గర్భం మొత్తం ప్రకృతి సిద్ధమైన వారసత్వాని (నేచురల్ హెరిటేజ్)కి ఒక విశిష్ట ఉదాహరణ. గంగానది ప్రవాహ దిశలో ఏర్పడిన అసాధారణ మార్పు కారణంగానే అప్పట్లో 'కాశీ'గా పిలువబడే ఈ పురాతన నగరం అభివృద్ధి చెందింది. ఈ ప్రాంతంలో నది అకస్మాత్తుగా ఉత్తర దిశగా (ఉత్తరవాహినిగా) మలుపు తిరగడం అనేది మరణం నుండి జీవితం వైపు సాగే 'జీవన చక్రానికి' సంకేతంగా భావించబడుతుంది. ఘాట్ల వద్ద గంగానదిలో పవిత్ర స్నానం చేయడం వల్ల వ్యక్తి ఆత్మ శుద్ధి అవుతుందని విశ్వసిస్తారు.

ఒక ప్రత్యేకమైన భౌగోళిక నిర్మాణం కారణంగా, ప్రవహించే గంగ వెంబడి పాత నగరం అర్ధచంద్రాకారంలో విస్తరించింది. ఈ నెలవంక ఆకారాన్ని ఆధ్యాత్మికంగా శివుని నుదుటిపై ఉన్న చంద్రునితో పోలుస్తారు. నదీ ప్రవాహ ప్రక్రియల వల్ల పశ్చిమ తీరంలో ముతక అవక్షేపాలు పేరుకుపోవడం వల్ల ఈ అద్భుతమైన ఆకారం ఏర్పడింది. వారణాసి చుట్టూ ఉన్న 'కాశీ క్షేత్రం' మొత్తం విశ్వానికి ప్రతీకగా భావించబడే ఒక పవిత్ర ప్రాంతం. ఇది పంచక్రోశీ యాత్ర ద్వారా సాగే ప్రదక్షిణలో స్పష్టంగా వ్యక్తమవుతుంది.

వారణాసి నదీతీరపు నిర్మాణ వారసత్వం, దాని చారిత్రక కేంద్రం, ఇక్కడి సజీవ సాంస్కృతిక సంప్రదాయాలతో విడదీయలేని విధంగా ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం హిందూ తీర్థయాత్రలకు ఒక లఘు ప్రపంచంగా ప్రసిద్ధి చెందిన ఈ నగరం, బౌద్ధం, జైనం, సిక్కు మతాలతో సహా ఇతర మతాలకు కూడా విద్య, ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. తన సుదీర్ఘ చరిత్రలో, ఈ నగరం ఆలోచనల మార్పిడికి ఒక ప్రధాన కేంద్రంగా నిలిచింది. ఉత్తర పథం (ఉత్తర మార్గం) హిమాలయాల నుండి దక్షిణ పథం (దక్షిణ మార్గం) వరకు సాగే పురాతన సాంస్కృతిక రహదారుల కూడలిలో ఉండటం వల్ల, ఇది పెద్ద సంఖ్యలో ప్రజలను ఆకర్షించే శక్తిని కలిగి ఉంది.

నదీ తీరమే ప్రతిరూపంగా వెలుగొందుతున్న ఈ నగరం, శతాబ్దాలుగా తత్వవేత్తలకు, సంస్కర్తలకు, సన్యాసులకు, మత, ఆధ్యాత్మిక బృందాలకు ఒక ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఇక్కడి సంప్రదాయ విద్య, సంగీతం, నృత్యం, హస్తకళలు, కళారూపాలు తరతరాలుగా ఒకరి నుండి మరొకరికి అందుతూనే ఉన్నాయి. ఆంగ్లేయుల వలస



పాలన కాలంలో క్రైస్తవ మతం కూడా ఈ నగరంపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఆ సమయంలో సంస్కృత బోధనతో పాటు హిందూ ధర్మ సంస్థలు, సెమినరీలు (మత శిక్షణాలయాలు), చర్చిలు, ఆసుపత్రులు ఇక్కడ స్థాపించబడ్డాయి.

సా.శ. 1021–30 మధ్య కాలంలో జరిగిన మహమూద్ గజనీ దండయాత్రలు వారణాసిలో ముస్లిం స్థావరాలకు దారితీశాయి. ఇవి మధ్యయుగ మొఘల్ కాలంలో గణనీయంగా అభివృద్ధి చెందాయి. నేడు వారణాసిలో సజీవంగా ఉన్న చీరల నేత, నృత్యం, సంగీతం వంటి అనేక సాంస్కృతిక సంప్రదాయాలలో వారు అంతర్భాగంగా ఉన్నారు. 11–17వ శతాబ్దాల మధ్య, ఈ నగరం కనీసం నాలుగు సార్లు దండయాత్రలకు గురై ధ్వంసమైంది. కానీ ఇక్కడి ఆలయాలు, ఘాట్లు, వాడలు పదేపదే పునర్నిర్మించ బడ్డాయి. తన ఆధ్యాత్మిక శక్తిని నిలబెట్టుకోవాలనే వారణాసి పట్టుదల ఇక్కడి నిర్మాణ శైలిలోనూ, ఆచారాల నిర్వహణలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. అందువల్ల, వారణాసి నగరం సమగ్ర భారతీయ మతం, ఆధ్యాత్మికత, సంస్కృతికి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని, ఈ లక్షణాలన్నీ దాని విశిష్ట ఘాట్ల రూపంలో ప్రతిబింబిస్తున్నాయని చెప్పవచ్చు.

### అత్యున్నత సార్వత్రిక విలువ

వారణాసి నగరం, దాని విశిష్ట నదీ తీరంలో ప్రతిబింబించే విధంగా, అనూచాన కాలం నుండి పవిత్రమైన, ఆధ్యాత్మిక విలువలను కలిగి ఉంది. కనీసం సా.శ. పూర్వం 1200 నుండి ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన, నిరంతరం జనజీవనం సాగుతున్న నగరాలలో ఒకటిగా ఉండటమే దీని 'అత్యున్నత సార్వత్రిక విలువ'. చరిత్ర, భౌగోళికం, పురాణాలు, అమూర్త వారసత్వం, సాంస్కృతిక సంస్థలు, నగర నిర్మాణ శైలుల అద్భుతమైన కలయిక ఈ శాశ్వత నగరపు నదీ తీరంలో వ్యక్తమవుతుంది. విద్యా, తాత్విక కేంద్రంగా దీనికి ఉన్న స్థానం దీనిని మరింత ప్రత్యేకంగా నిలుపుతోంది. గంగానదికి (తద్వారా నదీ తీరానికి) ఈ నగరపు మతపరమైన, సాంప్రదాయ, సాంస్కృతిక జీవనంతో ఉన్న ప్రాచీన అనుబంధం, ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దానికున్న అపారమైన ప్రభావం ప్రపంచంలోనే అద్వితీయమైనవి. ఈ విశిష్ట నదీ తీరం ఆ పవిత్రతను చాటిచెప్పడమే కాకుండా, పవిత్ర నదికి, భూమికి మధ్య ఉన్న సంబంధాన్ని, అంటే 'దైవిక–లౌకిక అంశాల' సంగమాన్ని ప్రతిబింబిస్తుంది

నదీ తీరానికి దారితీసే ఈ మెట్ల వరుసలు (ఘాట్లు), భూమికి, నదికి మధ్య అనుసంధానకర్తగా పనిచేసే ఒక అద్భుతమైన సాంకేతిక రూపం. ఇది భారత ఉపఖండానికే ప్రత్యేకమైనది. అందులోనూ వారణాసి ఘాట్లు ఈ విశిష్టతకు అత్యున్నత ప్రతిరూపాలు. భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో ఉన్న ఘాట్లు కూడా పురాణాల పరంగా, ఆధ్యాత్మికంగా లేదా సాంస్కృతిక కార్యకలాపాల పరంగా ప్రాముఖ్యత కలిగినవే అయినప్పటికీ, ఏవీ కూడా వారణాసిలోని నిర్మాణ వైభవం, వైవిధ్యంతో సమానం కావు.

ఉదాహరణకు, మథురలోని ఘాట్లు మానవ పరిమాణానికి (సాధారణంగా) అనుగుణంగా ఉంటాయి. కానీ వారణాసిలోని ఘాట్ల అపారమైన వైభవంతోనూ, అక్కడి ప్రణాళికాబద్ధమైన నిర్మాణ శైలితోనూ వీటిని పోల్చలేము. గత కొన్ని దశాబ్దాలుగా బృందా వనంలోని ఘాట్లు ఆచారాలు, స్నానాలకు అనువుగా లేవు. అదేవిధంగా, బిఠూర్ ఘాట్లు కూడా తీవ్రమైన మార్పులకు లోనై తమ పూర్వ వైభవాన్ని కోల్పోయాయి. ఉజ్జయిని ఘాట్లు ఆధ్యాత్మికంగా ముఖ్యమైనవే అయినప్పటికీ, హిందూ తీర్థయాత్రల విషయంలోనూ, సౌందర్య విలువలోనూ వారణాసి తర్వాతే వస్తాయని చెప్పవచ్చు. భారత ఉపఖండంలో వారణాసిలో ఉన్నంత సుదీర్ఘమైన మెట్ల వరుసలు మరెక్కడా లేవు.

వారణాసిలో భిన్న మతాలకు చెందిన ప్రజలు సామరస్యంగా జీవించడం, ఈ నదీ తీర ప్రాంతాన్ని భిన్నత్వంలో ఏకత్వానికి, సమైక్యతకు నిదర్శనంగా నిలుపుతోంది. హిందూ ధర్మంలో, సహజ సిద్ధమైన ఆధ్యాత్మిక పరిమళం కలిగిన ప్రపంచంలోని అరుదైన ప్రదేశాలలో ఇది ఒకటి. హిందువుల ఏడు పవిత్ర నగరాలలో (సప్త మోక్షపురులు) అత్యంత పవిత్రమైనదిగా, అతి ముఖ్యమైన తీర్థయాత్రా స్థలంగా ఇది పరిగణించబడుతుంది.

సా.శ.పూర్వం 528లో గౌతమ బుద్ధుడు తన మొదటి బోధన అయిన 'ధర్మచక్ర ప్రవర్తన'ను వారణాసికి సమీపంలోని సారనాథ్‌లో ప్రారంభించారు. ఇది బౌద్ధులకు ఈ ప్రాంతాన్ని అత్యంత విశిష్టమైనదిగా మార్చింది. సిక్కు మత స్థాపకుడు గురునానక్ దేవ్ 16వ శతాబ్దంలో రెండుసార్లు వారణాసిని సందర్శించారు. అలాగే, 24 మంది జైన తీర్థంకరులలో కొందరు ఇక్కడే జన్మించారు. వారిలో 8వ శతాబ్దానికి చెందిన ప్రముఖ ప్రవక్త పార్శ్వనాథుడు కూడా ఒకరు.

ఈ నగరపు సజీవ సాంస్కృతిక సంప్రదాయాలు, ముఖ్యంగా ఇక్కడి నదీతీరపు అద్భుతమైన నిర్మాణ శైలిలో సంస్కృతి యొక్క అన్ని రూపాలను ప్రతిబింబిస్తాయి. భారతదేశం నలుమూలల నుండి వచ్చిన పోషకుల ద్వారా, వారి ఆధ్యాత్మిక విశ్వాసాలతో ముడిపడి నిర్మించబడిన ఈ విభిన్న నిర్మాణ శైలుల కలయిక.. భారత దేశపు మూర్త, అమూర్త ప్రపంచాల సమ్మేళనంగా నిలుస్తుంది. ఇది వారణాసికి 'సాంస్కృతిక రాజధాని' అర్హతను కల్పిస్తోంది.

భారతదేశం మొత్తానికి ఒక నమూనాగా వారణాసి గుర్తింపు 12వ శతాబ్దాని కంటే ముందే ప్రారంభమైంది. ఆ కాలంలోనే





భారతదేశంలోని అన్ని పవిత్ర క్షేత్రాల ప్రతిరూపాలు ఇక్కడ నిర్మించబడ్డాయి. ఈ ఘాట్లు, వాటికి అనుబంధంగా ఉన్న నదీతీర కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉండటం అనేది, ఇక్కడి ప్రజల బలమైన విశ్వాసాలకు, వారణాసి నగరంతో వాటికి ఉన్న అవినాభావ సంబంధానికి ఒక నిదర్శనం.

ప్రపంచవ్యాప్తంగా నలుమూలల నుండి యాత్రికులు ఇక్కడికి సుదీర్ఘ తీర్థయాత్రలు చేయడం వల్ల వారణాసి నదీ తీర ప్రాంతానికి జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత లభిస్తోంది. అందువల్ల, ఇది మరెక్కడా కనిపించని ఒక విశిష్టమైన పవిత్రతను కలిగిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రం. చివరిగా, వారణాసి ఘాట్ల వద్ద గంగా నదికి అనుబంధంగా ఉండే దైవిక – లౌకిక అంశాలు, జీవితం – మరణం, ఆధ్యాత్మిక – భౌతిక కోణాల సమ్మేళనం. నగరంలోని ప్రకృతి – పట్టణ మూలకాల మధ్య జరిగే అత్యంత ముఖ్యమైన పరస్పర సంబంధానికి నిదర్శనంగా నిలుస్తుంది.



**ప్రాథమ్యం (iii):** వారణాసి నగరం, ప్రత్యేకించి గంగానదితో ఈ నదీ తీరానికి (రివర్ ఫ్రంట్) ఉన్న అనుబంధం.. సంప్రదాయ భారతీయ సంస్కృతి నిర్మాణ, కళాత్మక, మతపరమైన వ్యక్తీకరణలలో అద్వితీయమైనది. ఇది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఒక సజీవ చిహ్నం. ఇక్కడి మతపరమైన ఆచారాలు, బహుళ జాతుల కళా సంప్రదాయాలు, నిర్మాణ సంపద, జీవితం – మరణంతో దీనికి ఉన్న ప్రత్యేక సంబంధం, ప్రాచీన విద్యా పద్ధతులు దీనికి నిదర్శనం.

ఈ ప్రాంతంలోని కంటికి కనిపించే, కంటికి కనిపించని వారసత్వాల మధ్య ఉన్న గతిశీల సంబంధం.. సామాజిక, క్రియాశీలక వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తుంది. గత కాలపు వారసత్వానికి, ప్రస్తుత, భవిష్యత్తు తరాల అవసరాలకు మధ్య ఒక సుస్థిరమైన సమతుల్యతను సాధించాలంటే ఇటువంటి 'సజీవ వారసత్వ ప్రదేశాలను' కాపాడు కోవడం అత్యంత అవసరం.

**ప్రాథమ్యం (iv):** మెట్ల ఘాట్లు అనేవి నదికి, భూమికి మధ్య ఉండే నిర్మాణ వారధి వంటివి. ఇవి భారతదేశానికే ప్రత్యేకమైన ఒక విశిష్ట నిర్మాణ శైలి. వారణాసి ఘాట్లు ఈ శైలికి అత్యంత అద్భుతమైన నిదర్శనాలు. నదీ తీరంలోని నిర్మిత వారసత్వంలో భాగంగా ఘాట్లపై ఎత్తుగా కనిపించే భవ్యమైన భవనాలు, వాటి వెనుక రకరకాల నిర్మాణ శైలులు, ఖాళీ ప్రదేశాలతో కూడిన అందమైన ఇరుకైన సందులు ఉన్నాయి. నదీ తీరంలోని మెట్లు, ప్లాట్‌ఫామ్‌ల వద్ద ఉన్న కట్టడాలు గంగానది ప్రత్యేక భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా రూపొందించబడ్డాయి. దీని చుట్టూ అల్లుకున్న విశిష్టమైన జీవన శైలిలోనే ఈ ప్రాంతం విశిష్ట సార్వత్రిక విలువ దాగి ఉంది. ఈ ఘాట్లు పవిత్ర నదికి, భూమికి మధ్య ఒక గొప్ప బంధాన్ని ఏర్పరచడమే కాకుండా, ప్రకృతి వైపరీత్యాలు, సాంస్కృతిక ఒడిదుడుకుల నుండి కోలుకొని నిలబడగలిగే నిర్మాణ దృఢత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి

**ప్రాథమ్యం (vi):** వారణాసి ప్రత్యక్ష వారసత్వం, ముఖ్యంగా దాని నదీ తీరం (రివర్‌ఫ్రంట్), ప్రపంచంలోని మూడు ప్రధాన మతాలైన హిందూ, బౌద్ధ, జైన మతాల సజీవ సాంస్కృతిక, ఆధ్యాత్మిక, మతపరమైన సంప్రదాయాలతో బలంగా ముడిపడి ఉంది. ఇక్కడ కొనసాగుతున్న సంప్రదాయాలలో చెక్క బొమ్మల తయారీ, చీరల తయారీ, పట్టు నేత, లోహ, చెక్క మరియు టెర్రాకోట హస్తకళలు, ప్రత్యేక చిత్రలేఖన శైలులు, సంస్కృత భాషా వినియోగం, వేద పఠనం వంటివి ఉన్నాయి. ఈ నగరం దేనికైతే ప్రసిద్ధి చెందిందో, ఆ పురాతన సంప్రదాయాలు ఇక్కడి నిర్మాణ శైలి నుండి (ముఖ్యంగా ఘాట్ల నుండి) విడదీయలేనివి. ఈ కట్టడాలే ఆ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, కాపాడుతున్నాయి. అంతేకాకుండా, వారణాసి ఆధ్యాత్మిక శక్తికి గంగానది మూలం... అదే గమ్యం. ఘాట్ల సహజ, నిర్మిత భాగాలు కలిసి ఒక గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయి. సాంస్కృతిక జ్ఞాపకాలను, నమ్మకాలను, విలువలను నిలబెట్టిన ప్రాచీన సంప్రదాయాలు ఇక్కడ నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. స్వయం-వ్యవస్థీకృత ఆరాధన, తీర్థయాత్రా పద్ధతుల ద్వారా ఏర్పడిన ఒక కాలాతీత క్రమాన్ని ఇవి ప్రదర్శిస్తాయి. అనేక శతాబ్దాలుగా వివిధ సంస్కృతులు, మతాల సమ్మేళనం ఈ ఘాట్ల వెంబడి కొనసాగడం అనేది, ఈ ప్రాంతం విశిష్టతను, వైవిధ్యాన్ని ఏకం చేసి వేడుక చేసుకునే దాని శక్తిని చాటిచెబుతుంది.


**ఇతర సారూప్య ప్రాంతాలతో పోలిక:**

**సాంటా క్రూజ్ డి మోంపాక్స్ చారిత్రక కేంద్రం:** ఈ నగరం 1540లో దేశపు ప్రధాన జలమార్గమైన మాగ్డలీనా నది ఒడ్డున స్థాపించబడింది. ఉత్తర దక్షిణ అమెరికాలో స్పానిష్ వలస పాలన విస్తరించడంలో మోంపాక్స్ కీలక పాత్ర పోషించింది. 16వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకు, ఈ నగరం నదికి సమాంతరంగా అభివృద్ధి చెందింది. ఇక్కడి ప్రధాన వీధి ఒక రక్షణ గోడలా ఉండి, నగరం నది



ఒడ్డున స్వేచ్ఛగా, పొడవుగా విస్తరించడానికి సహాయపడింది.

ఈ చారిత్రక కేంద్రం తన పట్టణ దృశ్యాల సామరస్యాన్ని, ఐక్యతను ఇప్పటికీ కాపాడుకుంటూ వస్తోంది. చాలా భవనాలు ఇప్పటికీ వాటి అసలు అవసరాల కోసమే ఉపయోగించ బడుతున్నాయి. ఇది ఒక స్పానిష్ వలసరాజ్య నగరం ఎలా ఉండేదో చెప్పడానికి ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుంది.




దక్షిణ పశ్చిమ ఇంగ్లాండ్‌లోని బాత్ నగరం క్రీ.శ. 1వ శతాబ్దంలో రోమన్లచే స్థాపించబడింది. వారు ఇక్కడి సహజ ఉష్ణ ఉష్ణ స్నానశాలలుగా ఉపయోగించారు. రోమన్ శిథిలాలు, ముఖ్యంగా సులిస్ మినర్వా ఆలయం, స్నానశాలల సముదాయం (ఇవి రోమన్ పట్టణమైన 'ఆక్వా సులిస్' మధ్యలో ఉండే ఉష్ణ గుండాల ఆధారంగా నిర్మించబడ్డాయి. అప్పటి నుండి నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నాయి) ఆల్ప్స్ పర్వతాలకు ఉత్తరాన ఉన్న అత్యంత ముఖ్యమైన రోమన్ శిథిలాలలో ఒకటిగా నిలుస్తాయి. ఇవే బాత్ నగరం ఒక 'స్పా టౌన్'గా ఎదగడానికి నాంది పలికాయి.

బాత్ నగరపు నిర్మాణ నాణ్యత, పట్టణ రూపకల్పన, దాని ఏకరూపత, అందం ప్రధానంగా 18, 19వ శతాబ్దాల నాటి వాస్తుశిల్పులు, దార్శనికుల నైపుణ్యానికి నిదర్శనం. వారు ఈ స్పా టౌన్ అందించిన ప్రత్యేక అవకాశాలకు, అక్కడి భౌతిక వాతావరణం, సహజ వనరులకు (ముఖ్యంగా ఉష్ణ గుండాలు, స్థానిక 'బాత్ ఊలిటిక్ సున్నపురాయి') అనుగుణంగా పల్లాడియనిజం అనే వాస్తుశైలిని వర్తింపజేసి అభివృద్ధి చేశారు.

దీనితో పోలిస్తే వారణాసి నదీతీరం, వివిధ కాలాల్లో వేర్వేరు పాలకులు నిర్మించిన భవన సముదాయాల సమాహారం. ఇక్కడ ఘాట్లు (నది వైపు వెళ్లే మెట్లు), వాటి వెనుక ఉన్న రాజభవనాల వంటి నిర్మాణాలు విభిన్న వాస్తుశైలుల కలయికగా కనిపిస్తాయి. గంగానది వల్ల ఏర్పడిన ప్రత్యేక భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఇక్కడి మెట్లు, వేదికల మీది నిర్మాణాలు రూపొందించబడ్డాయి.

బాత్ నగరంతో పోలిస్తే, వారణాసి ఒక గొప్ప సజీవ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తుంది. ఇది కేవలం పాత వాటిని భద్రపరచడానికే పరిమితమై స్థిరంగా ఉండిపోలేదు, కాలంతో పాటు వచ్చే సహజమైన మార్పులను, పరిణామాన్ని ఆహ్వానిస్తుంది. అంతేకాకుండా, మతపరమైన, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన ఇక్కడి ఘాట్లు, ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా వివిధ అవసరాల కోసం నదితో నిరంతర అనుబంధాన్ని కలిగి ఉంటాయి. వారణాసి హిందూ పునర్జీవనానికి, జ్ఞానానికి, తత్వశాస్త్రానికి, సంస్కృతికి, దైవభక్తికి, భారతీయ కళలు, చేతివృత్తులకు చిహ్నంగా నిలుస్తూ శతాబ్దాలుగా వర్ధిల్లుతోంది.

ఈ మౌలిక విలువలు ఇప్పటికీ కొనసాగు తున్నాయి. కాలపు పొరలను, సంప్రదాయాలను తనలో ఇముడ్చుకున్న ఒక సజీవ నగరంగా వారణాసి భవిష్యత్తును అర్థం చేసుకోవడంలో ఇవి చాలా కీలకం. ఇవి దేశంలోనే అత్యంత సమగ్రమైనవి, ఆకర్షణీయమైనవి. అంతేగాకుండా అత్యధిక మంది సందర్శించే ఘాట్లు.

ఓసున్-ఓసోగ్బో పవిత్ర వనం (ఓసోగ్బో, ఓసున్ స్టేట్, నైజీరియా, 2005లో యునెస్కో జాబితాలో చేర్చబడింది): సంతానోత్పత్తి దేవత అయిన 'ఓసున్' (యోరుబా దేవుళ్లలో ఒకరు), ఇతర దేవతల గౌరవార్థం నిర్మించిన అనేక పుణ్యక్షేత్రాలు, విగ్రహాలు, కళాఖండాల సమాహారమే ఈ పవిత్ర వనం. ఇవన్నీ ఓసున్ నది వెంబడి విస్తరించి ఉన్నాయి. ఈ నదికి ఆ దేవత పేరు పెట్టడం వల్ల దీనికి ఎంతో పవిత్రత చేకూరింది.

ఈ వనం ఓసోగ్బో నగర శివార్లలో ఉంది. ఇది యోరుబా ప్రజల అస్తిత్వానికి చిహ్నంగా పరిగణించబడుతోంది. బహుశా యోరుబా సంస్కృతిలో మిగిలి ఉన్న చివరి పవిత్ర వనం ఇదే కావచ్చు. గత 40 ఏళ్లుగా జరిగిన పునరుద్ధరణ పనుల వల్ల, ఇది మొత్తం యోరుబా ప్రాంతానికే ఒక పవిత్ర స్థలంగా మారింది. ప్రస్తుతం రోజు వారీ, వారపు, నెలవారీ పూజా కార్యక్రమాలు జరిగే ఒక ముఖ్యమైన మతపరమైన కేంద్రంగా ఇది వెలుగొందుతోంది.

వారణాసి కూడా అదే విధంగా హిందూ భక్తులకు ఒక ప్రత్యక్ష చిహ్నంగా నిలుస్తోంది. వారణాసి ఘాట్ల బహుముఖ స్వభావం, అక్కడ ఉన్న అద్భుతమైన నిర్మాణ శైలిలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నిర్మాణాలే ఆ ప్రాంతపు ఉనికికి, నిరంతర కార్యకలాపాలకు పునాదిగా ఉన్నాయి. గతంలో జరిగిన పునరుద్ధరణ పనులు, అలాగే భవిష్యత్తు కోసం రూపొందించిన ప్రణాళికలు... ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు ఈ ప్రాంతం ఒక పవిత్ర పుణ్యక్షేత్రంగా కొనసాగేలా చేస్తాయి.


– అనువాదం: ఎస్. వంశీమోహన్

m : 98489 02520
e: vamsiglobal@gmail.com



# సంగారెడ్డి జిల్లా కల్పగూరు కాకతీయ దేవాలయ పునరుద్ధరణ

సంగారెడ్డి జిల్లా కల్పగూరు గ్రామమంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయము కాకతీయ కాలం నాటి 13వ శతాబ్దానికి చెందిన త్రికూట అంటే ఉమ్మడి మండపంతో కూడిన మూడు గర్భగుడులు గల ఆలయము. ఇది హెరిటేజ్ డిపార్టుమెంటు యొక్క రక్షిత చారిత్రక కట్టడము. ఈ దేవాలయము ప్రాంగణములో ముందు భాగాన ఒక కోనేరు కూడా వుంది.




అప్పటి హెరిటేజ్ డిపార్ట్మెంటు డైరెక్టర్ శ్రీమతి యన్.ఆర్. విశాలాక్షి, సంగారెడ్డి జిల్లా కలెక్టరు శ్రీ రోనాల్డ్ రోస్ 2016లో ఈ దేవాలయాన్ని ఉమ్మడిగా సందర్శించడం జరిగింది.

ఈ దేవాలయము యొక్క చరిత్ర, ప్రాధాన్యత, కాకతీయ వాస్తు లక్షణాలను క్షున్నంగా పరిశీలించారు. గత 800 సంవత్సరాలుగా తరతరాల సాంస్కృతిక సామాజిక ప్రకృతి కాలగమనంలో జరిగిన మార్పుల పర్యావసాన మూలాన ఈ దేవాలయము నేల మట్టము నుండి సుమారు 8 అడుగుల ఎత్తు వరకు మట్టిలో కూరుకుపోయినట్లుగా, ఎన్నో అక్రమ కట్టడాలతో దేవాలయ ప్రాంగణము ఆక్రమణలకు గురి అయినట్లుగా, ప్రధాన గర్భగుడికి నంది మండపానికి మధ్యలో వున్న RCCతో మండపము నిర్మాణం,నంది మండపము కప్పు రాళ్ళు, కాక్షాసన శిలలు కాలగర్భములో తప్పిపోయినట్లుగా గుర్తించడం జరిగింది.

ఆరోజు జరిగిన అధికారుల ఉమ్మడి తనిఖీలో ఈ దేవాలయాన్ని పునరుద్ధరించాలని, రెవిన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణలను తొలగించాలని, కూరుకు పోయిన మట్టిని నేల మట్టము వరకు తవ్వి అసలైన కాకతీయ దేవాలయాన్ని వెలుగు లోకి తేవాలని, నూతనంగా కనిపించిన RCC కట్టడాలను తీసివేయాలని, చుట్టూ ప్రహరీగోడ నిర్మాణము గ్రిల్స్‌తో ఏర్పాటు చేయాలని నిర్ణయాలు జరిగాయి.

ఈ పునరుద్ధరణ పనులకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని అప్పటి జిల్లా కలెక్టరు శ్రీ రోనాల్డ్ రోస్ జిల్లా కలెక్టర్ నిధుల నుండి మంజూరు చేశారు. మిగతావి హెరిటేజ్ డిపార్టుమెంటు సమకూర్చింది. అందుకు అనుగుణంగా పనులు చెయ్యటం జరిగింది.

పనులు ప్రారంభించేముందు దేవాలయం మొత్తాన్ని డాక్యుమెంట్ చేసి ప్రహరీ లోపల వైశాల్యాన్ని 1,591 చదరపు





గజాలుగ లెక్కించటం జరిగింది. రెవెన్యూ, పోలీస్ శాఖల వారి సహకారంతో అక్రమణలన్నీ తొలగించటం జరిగింది. తర్వాత వైశాల్యమును లెక్కించగా అది 7,756 చదరపు గజాలుగా పెరిగింది.

దేవాలయము చుట్టూ పేరుకు పోయిన మట్టిని 8 అడుగుల లోతు వరకు అంటే 7,756 చదరపు గజాల వైశాల్యంలో 330 అడుగుల పొడవు 250 అడుగుల వెడల్పుతో తవ్వి మట్టి మొత్తాన్ని తరలించటం జరిగింది. సుమారు 620 ట్రాక్టర్ల మట్టిని తరలించి అసలైన అప్పటి కాకతీయ త్రికూట దేవాలయాన్ని వెలుగులోకి తేవటం జరిగింది.



నంది మండపం, గర్భగుడి మధ్యలో ఉన్న RCCతో నిర్మించిన మండపాన్ని, ప్రాంగణంలో నూతనంగా సిమెంట్‌తో నిర్మించిన ఇతర కట్టడాలను పూర్తిగా నిర్మూలించటం జరిగింది.

చుట్టూ ప్రహరీ గోడను 1,130 అడుగుల పొడవుతో నిర్మించి పైన గ్రిల్స్‌ను దేవాలయము కనిపించే విధంగా ఏర్పాటు చేయటం జరిగింది. మట్టిని తవ్వి దేవాలయాన్ని పూర్తి స్థాయిలో వెలికి తీసిన తరువాత కొన్ని గోడ శిలలు/రాళ్లు కనుమరుగైనట్లు గుర్తించి వాటి స్థానంలో కొత్త శిలలను శిల్పులచే చెక్కించి బిగించటం జరిగింది. దేవాలయము చుట్టూ నేలమట్టములో గ్రానైట్ రాళ్ల ఫ్లోరింగ్ (ప్లింత్ ప్రొటెక్షన్ పనులు) చెయ్యటం జరిగింది. నంది మండపం పైకప్పు రాళ్లను, కక్షాసన శిలలు ఎక్కడైతేలేవో అక్కడ కొత్త వాటిని శిల్పులచే చెక్కించి అమర్చడం జరిగింది.

ఈ కాకతీయ దేవాలయము గత 800 సంవత్సరాల కాలంలో వివిధ దశలలో మారిన వాస్తు విరుద్ధమైన మార్పులను సవరించి, ఆక్రమణలకు గురియైన ప్రాంగణాన్ని తిరిగి స్వాధీన పరుచుకొని, తిరిగి ఆక్రమణలకు అవకాశం యివ్వకుండా ప్రహరీ నిర్మించి, అక్రమ మరియు నూతన సిమెంట్ కట్టడాలన్నీ తొలగించి, దేవాలయాన్ని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి, కాకతీయ వాస్తు నైపుణ్యాన్ని పునరుద్ధరించి, సువిశాలమైన ప్రాంగణముతో కాకతీయ దేవాలయ పునర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావటం జరిగింది. ఇది చూసిన స్థానిక ప్రజలు నాయకులు ఎంతో ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ పని నిర్వహించిన హెరిటేజ్ డిపార్టుమెంటు యొక్క సంరక్షణ విభాగము, అప్పటి డైరెక్టర్ శ్రీమతి యన్.అర్. విశాలాక్షి, నిధులు సమకూర్చిన జిల్లా కలెక్టర్ శ్రీ రోనాల్డ్ రోస్ అభినందనీయులు.

–బావండ్ల నారాయణ,
ఆర్కియాలాజికల్ ఇంజనీర్/డిప్యూటీ డైరెక్టర్(రెటైర్డ్),
డిపార్టుమెంట్ అఫ్ హెరిటేజ్ తెలంగాణ,హైదరాబాద్.





# దేశదేశాల తెలుగువారి కోసం ప్రపంచ విశ్వవిద్యాలయం ఎందుకవసరం?

నలభైకు పైగా దేశాలలో వ్యాపించి ఉన్న తెలుగు వారి భాషావసరాల కోసం ప్రపంచ స్థాయిలో పని చేసే ప్రత్యేకమైన విశ్వవిద్యాలయం చాలా అవసరమని మహారాష్ట్ర గవర్నరుగా సేవలందించిన సి.హెచ్. విద్యాసాగర్ రావు 2025 జూన్ 7వ తేదీన సాహితీవేత్త డా. సి.నారాయణరెడ్డి సాహిత్యోత్సవాన్ని ప్రారంభిస్తూ వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాదులో జరిగిన ఒక సమావేశంలో అభిప్రాయపడ్డారు. ప్రభావాన్ని కలుగజేసే పత్రికలు కూడా ఈ విషయాన్ని గురించి పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ ప్రకటను చూడగానే అసలు ఇటువంటిదవసరమా? తెలుగు విశ్వవిద్యాలయం ఉంది కదా! అనే సమాధానాలు అనాలోచితంగానే తారసపడతాయి. ఇలాంటి విశ్వవిద్యాలయం మరెక్కడైనా ఉందా... అనే ప్రశ్న కూడా మన మీద సంధింపబడవచ్చు. తరువాత ఏ ఏ దేశాల్లో తెలుగు వారున్నారు? ఏ ఏ రాష్ట్రాల్లో మన భాష మాట్లాడే వారు ఉన్నారు..? అనే విషయంలో చాలా పెద్ద చర్చ కూడా అవసరం కావచ్చు. అవి వేరే సంగతులు. ఇలా ఏర్పడే సంస్థను 'తెలుగు ప్రపంచ విశ్వవిద్యాలయం' అంటారా లేదా 'తెలుగు ప్రపంచ సంస్థ' అంటారా అనేది కూడా ముందు ముందు చర్చించుకోవచ్చు. 'ప్రపంచ, విశ్వ' అనే రెండు మాటలు కలిసి ఉండటం కూడా కొందరికి ఆశ్చర్యం కలగవచ్చు. కానీ విశ్వవిద్యాలయం అంటే సర్వం నేర్పించే అనే అర్థంలో వాడుతాము. ఇక 'తెలుగు ప్రపంచ' లేదా 'ప్రపంచ తెలుగు' అంటే తెలుగు భాషకు సంబంధించి ప్రపంచవ్యాప్తపు అవసరాలనే భావనలో స్వీకరించాలి.



### పూర్వ రంగం:

1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత తెలుగు భాష అవసరాలు గుర్తించడానికి దాదాపు దశాబ్దం పైగా పట్టింది. ఈ దశలో మనకు చాలా ఉత్కృష్టంగా కనిపించే వారు రచయితగా కూడా రాణించిన రాజకీయ నాయకుడైన సాహితీమూర్తి పి.వి.నరసింహారావు. ఆయన రాష్ట్రస్థాయిలో చేసిన విశేష ప్రయత్నాలు కారణంగా హైస్కూలు, కళాశాల స్థాయిలలో తెలుగు మీడియంలో బోధన, తెలుగు టైపు మిషన్లు రూపొందించుకోవడం, తెలుగు పుస్తకాలను విద్యా అవసరాలకు తగ్గట్టుగా తయారు చేసుకోవడం, ప్రామాణికంగా అందుబాటులో ఉన్న ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి తీసుకురావడం. వీటికి తగ్గట్టుగా తెలుగు అకాడమీ ఏర్పాటు చేసుకోవడం– ఇదంతా ఒక కోవకు సంబంధించిన కృషి సాధ్యమైంది. దీనికి సంబంధించిన ఆలోచన మరింత విస్తృతమై, సాంస్కృతికపరమైన పార్శ్వాలను కూడా జోడించి ఆలోచించిన నేపథ్యంలో ప్రపంచ తెలుగు మహాసభలనే భావన రూపుదిద్దుకుంది. ఈ ధోరణి మరింత విస్తృతమై, ఇంకొంత లోతుగా ఆలోచనలకు కారణమై క్రమంగా నాలుగు దక్షిణాది భాషల నేపథ్యంగా ద్రావిడ విశ్వవిద్యాలయం, అలాగే తెలుగు భాష కోసం తెలుగు విశ్వవిద్యాలయం నాలుగు దశాబ్దాల క్రితమేర్పాటయ్యాయి. ఈ రెండు విశ్వవిద్యాలయాలేర్పడినప్పుడు ఆయా అధికార వర్గాలు, పండిత ప్రముఖులు చేసిన ఆలోచనలు, రూపొందించినప్పటి ప్రణాళికలు తర్వాత ఏమయ్యాయని మరోచోట దారి తప్పిన వైనాలు గురించి వివరంగా చర్చించుకోవాలి.

### తెలుగు మీద కొత్త చూపు:

పి.వి. నరసింహారావు కేంద్రకంగా మొదలైన కృషి నందమూరి తారక రామారావు ఆధారంగా సాగిన ప్రయత్నాలు దాకా సుమారు పాతిక, ముప్పై సంవత్సరాలు విమర్శలు, పరిమితులు, అవినీతి ఆరోపణలు, రాజకీయ తంత్రాలు మధ్యనే ఎంతో కొంత గణనీయమైన కృషి జరిగింది. అప్పటికి పత్రికలు, రేడియో తప్పా మరే ఇతర సాంకేతికపరమైన అద్భుతాలు చొచ్చుకు రాలేదు. కంప్యూటర్, టెలివిజన్ ఆవిష్కరణలు జరిగినా అవి మనదేశంలో పెద్ద ఎత్తున ప్రవేశించలేదు, కనుక అప్పటికి ఇంటర్నెట్ ఊసే మన సమాజంలో లేదు. మరోవైపు సరళీకరణ, ప్రపంచీకరణ, ఇంగ్లీష్ మాధ్యమం, ఇంటర్నెట్ సదుపాయం, కంప్యూటర్ వ్యామోహం, విదేశీ చదువులు ఉద్యోగాలు, డాలర్ల గోల... ఈ ధోరణితో అటక ఎక్కినది తెలుగు భాష. ఫలితంగా తెలుగు మాధ్యమం పై స్థాయిలో వ్యాప్తి చెందకుండా క్రమంగా మునిసిపల్ స్కూళ్లకే పరిమితమైపోయింది. మరోవైపు టెలివిజన్‌కు ఉపగ్రహసాంకేతిక పరిజ్ఞానం తోడు కావడం, కంప్యూటర్ అనుసంధానం, ఇంటర్నెట్ వెసులుబాటు, టెలిఫోన్ చేతిలోకి మారడం, అది స్మార్ట్‌ఫోన్‌గా రూపాంతరం చెంది సోషల్ మీడియాగా వ్యాప్తి కావడంతో విమాన ప్రయాణాలు, విదేశీ పర్యటనలు, ఇతర దేశాల ఉద్యోగాలు విచ్చలవిడిగా మారిపోయాయి. గత నాలుగు దశాబ్దాలలో ఆడియో కమ్యూనికేషన్ చాలా కీలకంగా మారిపోయింది. దానికి తోడు వైటుకే, కరోనా వంటి సంచలనాలు సమస్యలు కమ్యూనికేషన్ దృష్ట్యా కొత్త లోకాలకు దారులు తీశాయి.

### మారిన సామాజిక నేపథ్యం:

కంప్యూటర్లతో ఉద్యోగాలు పోతాయనే భయంతో కొన్ని సంవత్సరాలు పాటు జరిగిన ఉద్యమాలు ఇప్పుడు అర్థరహితమైన

ప్రయత్నాలుగా చరిత్రలో కనబడుతున్నాయి. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెద్ద ఎత్తున వస్తే ఏఏ వర్గాలకు ఉద్యోగాలు పోతాయనే దాన్ని లోతుగా ఎవరికి వారు సంస్థాపరంగా ఎక్కువ స్థాయిలో చర్చించుకుంటున్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్, ఒడిస్సా, పశ్చిమబెంగాల్ వంటి చోట్ల ఎంతోమంది తెలుగువారు (ఉభయ రాష్ట్రాల్లో చాలామంది భావించినట్టు) వాళ్లు ప్రవాసాంధ్రులు కాదు, స్థిర నివాసాంధ్రులు; అంటే వాళ్లు తొలినుంచి అక్కడే నివాసం ఉన్నవారు. తర్వాతి కాలంలో రాజకీయ కారణాలతో రాష్ట్రాలు విడిపోవడం అనేది వేరే విషయం. కోరాపుట్ తెలుగు, కోయంబత్తూర్ తెలుగు, కోలార్ తెలుగు, కొచ్చిన్ తెలుగు... ఇలాంటి వాటిని తెలుగు భాషకు ఉన్న వేరువేరు రూపాలుగా పరిగణించి ఆదరించాల్సిన గౌరవించాల్సిన అగత్యం ఉంది. ఇది నాలుగు దశాబ్దాల క్రితం చర్చించుకున్న విషయం. అయితే నేడు ఇంగ్లీషు, కంప్యూటర్ పరిజ్ఞానం, చొరవ, కష్టపడి లక్షణం కారణంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, మయన్మార్, మలేషియా, ఆస్ట్రేలియా, కెనడా, బాంగ్లాదేశ్, ఫిజి, యునైటెడ్ కింగ్డమ్, మారిషస్, బెహ్రైన్, ఒమన్, న్యూజిలాండ్, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో ఎంతోమంది తెలుగువారు ఉన్నారు. అలాగే ఈ నాలుగైదు దశాబ్దాలలో చదువులు, ఉద్యోగాలు కారణంగా సరిహద్దు రాష్ట్రాలే కాకుండా ఇతర భారతీయ రాష్ట్రాలలో నగరాలలో తెలుగువారు బాగా వ్యాపించి ఉన్నారు. నిజానికి జనాభా లెక్కలు కూడా చెప్పే విషయాలు పూర్తి వాస్తవాలు కాదేమో అనే రీతిలో మనకు అభిప్రాయం కలుగుతాయి. దేశవ్యాప్తంగా తెలుగు విస్తారమై ఉంది ఏనాటి నుంచో అనడానికి ఇంగ్లీషు పాలనలో నాణేల మీద, కరెన్సీ నోట్ల మీద కనబడే నాలుగు భాషలలో తెలుగు ఒకటే దక్షిణాది భాష. ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తే ఈ తెలుగు వ్యాప్తికి కుదురు ఎంత లోతుగా, విస్తృతంగా ఉందో బోధపడుతుంది.



### వర్తమానపు అవసరం:

చదువు, ఉద్యోగం వీటికి సంబంధించిన ఇంటి బయటి వ్యవహారాలు ఇంగ్లీషులోనే సాగుతాయి. అయితే మద్రాస్ వంటి మహానగరంలో కూడా బస్సులో మొబైల్ మోగ్గానే పక్క వాడితో తమిళంలో మాట్లాడే శాల్తీ టక్కున తెలుగులోకి మారిపోతాడు. భాష అనేది ఒక ఎమోషనల్ రిక్వైర్మెంట్. అంతేగాని ఇదని, అదని.. ఇంకొకటి, మరొకటి అని లెక్కర్లు చేయాల్సిన వ్యవహారం వేరే. మాతృభాష అనేది కేవలం వ్యక్తీకరణకు, మన భావాలను పూర్తిగా పంచుకునేందుకు దోహదపడే గొప్ప సాధనం మాత్రమే అని వాస్తవికంగా, స్పష్టంగా గుర్తించాలి. అంతేగాని దానికి అవసరం లేని గుదిబండలు తగిలించాల్సిన అవసరం లేదు. 40 ఏళ్ల క్రితం మొదలైన సామాజిక మార్పుల కారణంగా ఒక తరం అక్కడే పుట్టి, ఆ ప్రాంతంలోని చదువుకుని, అక్కడే ఉద్యోగాలు చేసుకునే దశలో ఉంది. ఫలితంగా మతం, కులం అతీతంగా వివాహాలు, ఇతర కుటుంబ సంబంధాలు మారాయని కూడా గమనించాలి. ఒకటి, రెండు తరాలకు తెలుగు పత్రికలు, పుస్తకాలు అవసరమైతే; మిగతా అందరికీ తెలుగు ఆడియో, వీడియోల రూపంలో లభ్యమయ్యే సినిమాలు, సాహిత్యంశాలు, అన్ని రకాల సంగీతం, వినోద కార్యక్రమాలు ఎంతో అవసరంగా మారాయి.

### ఎలా ఉండాలి?

అదే సమయంలో ఆ ప్రాంతపు, ఆ దేశపు సాంస్కృతిక పరమైన, రాజకీయపరమైన విశ్వాసాల, సెంటిమెంట్ల పార్శ్వాలను గౌరవిస్తూ ఆ అవసరాలను తీర్చాలి. భావ ప్రకటన, ఎమోషనల్ రిక్వైర్మెంట్, కాలక్షేపం వంటి కోణాలలో మాత్రం భాషా ప్రయత్నాలు ఏ రకంగా దోహదపడతాయో గమనించి, వాటి ఆధారంగా 'సెల్ఫ్ సస్టైన్డ్' గా ప్రయత్నాలు జరగాల్సి ఉంది. యూనివర్సిటీ అనగానే కొందరికి ఉద్యోగాలు, మరికొందరికి టెండర్లు; అలాగే తెలుగు అనగానే సాహిత్యం, దాని సంబంధిత విషయాలు అనుకొని ఎంతో ఉద్రేకపడి తద్వారా కొంతమంది ఉపాధికి దోహదపడేలా ఉండాల్సిన అవసరం లేనేలేదు. అంటే ప్రభుత్వ సంస్థలలో స్థిరపడే అవినీతి మొదలైన అవసవ్య ధోరణులకు దూరంగా ఉండేలా ప్రయత్నించాలి. అదే సమయంలో సినిమాలు, పుస్తకాలు,వీడియోలు అనగానే... ఇది ప్రొడ్యూసర్ల, ప్రచురణకర్తల దోపిడీకి వేదికని భావించాల్సిన అవసరమూ లేదు; వారికాస్కారమూ ఇవ్వనక్కర్లేదు.

అలాగే నేడు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో 'అంతర్జాతీయ తెలుగు సంస్థ' అని ఒక విభాగం ఉంది. అది ప్రపంచ దేశాల తెలుగువారి గురించి కృషి చేయాల్సిన అగత్యం ఉందని మాలాంటి వాళ్ళు భావిస్తున్నారు. నిజానికి దాని ప్రణాళికలు ఏమిటో, దానికి ఉన్న వనరులు ఏమిటో ఎప్పుడూ చర్చకు రాలేదని నాకు గుర్తు. అలాగే ఆ సంస్థ అద్భుతంగా సాధించిన ఫలితాలు ఏమిటో కూడా తెలియడం లేదు. నిజానికి నాలుగు దశాబ్దాల క్రితం భావనలు వేరు, మన మీద వచ్చి పడిన టెక్నాలజీ కారణంగా పరిణమించిన నేటి ప్రపంచం తీరు మరింత వేరు. చదవడం, రాయడం అనేది ఇదివరకు విద్యాసంస్థలలో కీలకంగా ఉండేది. కానీ నేడు ఒకవైపు టెక్నాలజీ, మరోవైపు భాషతో అంతగా సంపర్కం లేని పరిస్థితులు ఇతర ప్రాంతాలలోని తెలుగువారిలో ఉండటమనేది ప్రణాళిక స్థాయిలో కేంద్రంగా ఉండాలి. వినడం, మాట్లాడటం అనే క్రియల ఆధారంగానే దేశదేశాల తెలుగు వారి అవసరాలకు తగినట్లుగా ప్రణాళికలను తీర్చిదిద్దాలి; ప్రధానంగా ఆడియో, వీడియో, సినిమా రూపాల్లోనే సాధన సంపత్తి రూపొందించబడాలి. అదేవిధంగా కోర్సులైనా పుస్తకాలైనా రూపుదిద్దుకోవాలి. ఈ స్థాయి రూపకల్పనలో ఇదివరకు వాడిన విధానాలను పక్కనపెట్టి, నేటి అవసరాలను కొత్తగా జల్లెడ పట్టి ముందుకు సాగాలి. ఉపయోగపడే రీతిలో ఇలాంటి సంస్థలు లాభదాయకంగా కొనసాగి స్థిరపడాలి; అంతే కానీ చెడ్డ పేరు తెచ్చుకొని మూతపడకూడదు.

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com

# కర్నూలు నందు అరుదైన శ్రీచక్రలింగం

కావేరి తుంగభద్రాచ కృష్ణవేణిచ గౌతమి భాగీరథీతి విఖ్యాతః పంచ గంగాహ ప్రకీర్తితాః పంచ గంగలుగా ప్రసిద్ధిగాంచిన నదులు కావేరి, తుంగభద్ర, కృష్ణవేణి, గౌతమి మరియు భాగీరథి. వీటిలో రెండవదిగా గుర్తించబడ్డది తుంగభద్రా నది. సహ్య వరాహ పర్వతము శృంగముల నుండి తుంగ జన్మించగా కుద్రీముఖ్ పర్వతశ్రేణి నందలి గంగా మూల నందు భద్రానది జన్మించినది. ఈ రెండు నదులు కూడలి (Kudli) నందు కలిసి తుంగభద్ర గా మారి కర్ణాటక, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్లో రమారమి 330 మైళ్ళు/530 కిలోమీటర్లు ప్రయాణం కొనసాగించి కర్నూలుకు సమీపంలో గల సప్త సంగమేశ్వరం నందు కృష్ణా నదిలో సంగమించడం జరిగింది.

ఈ తుంగభద్ర నది తీరమున ఎన్నో పట్టణములు, మఠాలు మరియు దేవాలయములు వెలిసాయి. ప్రత్యేకించి విద్యారణ్య దీవెనతో హరి హర రాయులు మరియు బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యమును తుంగభద్ర ఒడ్డున గల హంపి నందు ఏర్పాటు చేసిన విషయం అందరికీ తెలిసినదే. అదేవిధంగా తుంగభద్ర ప్రవాహం నందు ఒడ్డును వెలిసిన చివరి పట్టణము ఆంధ్రప్రదేశ్ నందలి కర్నూలు పట్టణమే.



చింతామణి మఠంలోని
శ్రీ చక్రలింగం - ఆనగొంది

తుంగభద్ర నది ఒడ్డున ఒకవైపు హంపి ఉండగా మరియొక వైపు ఆన గొంది కలదు. ఈ ఆన గొంది. నందు ఒక శివాలయం ఉంది. అందులో అరుదైన శ్రీచక్ర శివలింగమును గమనించగలం. అటువంటి అరుదైన లింగముగల శివాలయమును తుంగభద్ర ఒడ్డున గల చిట్టచివరి పట్టణమైన కర్నూలు నందు గమనించగలం. భారతదేశంలో ఇటువంటి అత్యద్భుతమైన ప్రత్యేకమైన శ్రీ చక్ర లింగ శివాలయములు చాలా అరుదుగ ఉంటాయనటలో ఎలాంటి సందేహం లేదు.

**ఈ శివలింగములకు ఎందుకింత ప్రత్యేకత ఉందో గమనిద్దాం!**

భారతదేశంలో 12 జ్యోతిర్లింగాలు (వెలుగు రూపంలో ప్రత్యక్షమైన శివలింగం) ఉన్న విషయం అందరికీ తెలిసినదే అవి (1) గుజరాత్ లోని సోమనాథ దేవాలయం (2) ఆంధ్రప్రదేశ్ నందలి భ్రమరాంబిక మల్లికార్జున దేవాలయం (శ్రీశైలం) (3) మధ్యప్రదేశ్‌లోని మహాకాళేశ్వర దేవాలయం (4) మధ్యప్రదేశ్ లోని ఓంకారేశ్వర దేవాలయం (5) ఉత్తరాఖండ్ నందలి కేదార్నాథ్ దేవాలయం (6) మహారాష్ట్రలోని భీమశంకర్ దేవాలయం (7) ఉత్తరప్రదేశ్లోని కాశీ విశ్వనాథ దేవాలయం (8) మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర దేవాలయం (9) జార్ఖండ్ రాష్ట్రంలోని వైద్యనాథ జ్యోతిర్లింగ దేవాలయం (10) గుజరాత్ నందలి నాగేశ్వర జ్యోతిర్లింగ దేవాలయం (11) తమిళనాడు నందలి రామనాథ స్వామి దేవాలయం మరియు (12) మహారాష్ట్ర నందలి ఘృశ్నేశ్వర్ దేవాలయములు కలవు. వీటిలో సోమనాథ దేవాలయము అత్యంత ప్రాచీనమైనదిగా గుర్తిస్తారు. ఈ 12 జ్యోతిర్లింగ దేవాలయంలో శ్రీ చక్రం కలిగిన శక్తి పీఠాలు ఐదింటిని మాత్రమే గమనించగలము. అవి ప్రధానంగా (1) భ్రమరాంబికా మల్లికార్జున దేవాలయము (శ్రీశైలం), (2) ఉజ్జయిని నందలి మహాకాళి ఆలయం, (3) కాశీ విశ్వనాథ దేవాలయమునకు సమీపంలో గల విశాలాక్షి దేవాలయం, (4) కేదారనాథ దేవాలయమునకు సమీపమున గల కాశ్మీర్ సరస్వతి ఆలయం మరియు (5) వైద్యనాథ దేవాలయం వద్ద గల పార్వతి దేవి ఆలయము. ఈ పేర్కొన్న అయిదు శక్తిపీఠముల యందు శ్రీ చక్ర మేరువును గమనించగలం.

అదేవిధంగా పంచభూతాలు అయినటువంటి భూమి, అగ్ని, జలము, ఆకాశము, మరియు వాయువుకు సంబంధించినటువంటి శివాలయాలు కూడా భారతదేశం నందు కలవు. అవి కంచి నందలి ఏకాంబరేశ్వర దేవాలయం, (భూమి), అరుణాచలం నందలి అరుణాచలేశ్వరుడు (అగ్ని), ట్రిచి నందలి జంబు లింగేశ్వరుడు (జలం), చిదంబరం నందలి నటరాజస్వామి (ఆకాశం) మరియు శ్రీకాళహస్తి నందలి శ్రీకాళహస్తీశ్వరుడు (వాయు వు). ఈ ఐదు దేవాలయంల యందు ఐదు శ్రీ చక్రములను లేదా ప్రధాన దేవతకు (శివునికి) కొంచెం దూరంలో గమనించగలం. కంచి నందు కామాక్షమ్మ దేవాలయంలో శ్రీ చక్రం గలదు. అరుణాచలంలో, అసిత కుచలాంబిక విగ్రహం ముందు మేరువు కలదు. జంబుకేశ్వర దేవాలయము నందు అఖిలాండేశ్వరి చెవి దుద్దుల యందు శ్రీ చక్రం గలదు. చిదంబరం నందు శివకామి అమ్మన్ దేవాలయం నందు శ్రీ చక్రము కలదు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయము నందు

జ్ఞాన ప్రసూనాంబ విగ్రహం ముందు శ్రీ చక్రమును గమనించగలరు. 12 జ్యోతిర్లింగ దేవాలయల నందు కానీ, ఐదు పంచభూత దేవాలయంల నందు గాని మరియు అష్టాదశ పీఠములు గలిగిన దేవాలయంలో గానీ లింగములను మరియు శ్రీ చక్రములను ఒకే చోట, ఒకే విగ్రహ రూపంలో మరియు ఒకే గర్భగుడి నందు మనము గమనించలేదు.

అయితే కర్నూలు నందు తుంగభద్ర ఒడ్డున గల రామబట్ల దేవాలయమునకు సమీపమున గల విజయనగర రాజుల కాలం నాటి కాశీ విశ్వేశ్వర దేవాలయం నందు ప్రత్యేకమైన శివలింగమును గమనించగలం. రేఖాగణితమునకు రూపకల్పన ఏర్పరిచిన విధానంలో శ్రీ చక్రమును లింగము మీద గమనించగలం. ఈ శ్రీ చక్రము నందు ప్రధానంగా తొమ్మిది త్రిభుజములు కలవు. ఈ తొమ్మిది త్రిభుజాలలో నాలుగు త్రిభుజాలు పైకి చూస్తుండగా (శివశక్తి) మరియు ఐదు త్రిభుజాలు క్రిందికి (శక్తితత్వం) చూస్తుంటాయి.



శ్రీ చక్ర లింగం

దీనిని సంపూర్ణ నవావరణ శ్రీ చక్రం అని పిలుస్తారు. ప్రధాన త్రిభుజాలతో పాటు 43 చిన్న త్రిభుజాలను సైతం ఈ చక్రం నందు గమనించగలము. ఈ చక్రమునకు లోపల భాగమున చుట్టూ ఎనిమిది దళాలు ఉండగా బయట వైపు 16 దళాలు ఉండడం గమనించవచ్చు. అనగా 24 దళాలు కలిగి ఉన్నాయని అర్థమవుతుంది. ఈ చక్రమునకు మధ్యలో బిందువును గమనించవచ్చు. ఆ బిందువునే పరబ్రహ్మ లేదా త్రిపుర సుందరి స్థానము అని పిలుస్తారు. ఈ శ్రీ చక్రము ఒక చతురస్రంలో మిళితమై నాలుగు ద్వారాలు కలిగి ఉంది. దీనిని భూపురం అని అంటారు. ప్రతి ద్వారానికి మూడు అడ్డగీతలు కలిగి ఉంటాయి. ఇటువంటి శ్రీ చక్రంను కలిగిన లింగమును శ్రీ చక్ర లింగం లేదా శ్రీయంత్రలింగం లేదా శివశక్తి ఐక్య లింగంగా పిలుస్తారు. లింగము శివతత్వానికి ప్రతీకైతే శ్రీ చక్రం శక్తి తత్వాన్ని సూచిస్తుంది. రెండూ కలిపి పరబ్రహ్మ తత్వాన్ని సూచిస్తాయి.



గర్భగుడి నందలి నాగాకృతి సోమసూత్రము

గర్భగుడి యందు గణపతి, భైరవుడు, అమ్మవారు మరియు ఆంజనేయ స్వామి విగ్రహంతో పాటు మరియొక విచిత్రమైన శిలను సైతం గమనించగలం. శివలింగమునకు నాగేంద్రుడు మూడు చుట్టలు చుట్టుకొని ఉండడం గమనార్హం. ఈ విగ్రహము లన్నింటినీ గర్భగుడిలో ఉంచి రక్షణ కలిగించినారు. మరియొక ప్రత్యేకత గర్భగుడి నుండి అభిషేక జలాలు మరియు తీర్థం బయటకు వెళ్లే మార్గాన్ని గోముఖం లేదా ప్రణాళం అని అంటారు. ఇది ఒక్కోసారి ఆవు ముఖం లేదా మకర ఆకారంలో ఉండడం గమనిస్తాము. వీటిని గర్భగుడి బయట గమనించ గలము. అయితే విచిత్రంగా గర్భగుడిలోనే సోమ సూత్రం (లింగం నుండి బయటికి నీరు వెళ్లే పవిత్ర దిశ లేదా మార్గం) నాగాకృతిలో ఉండడం విశేషం. కొన్ని దేవాలయముల నందు సోమసూత్రమును నాగకృతి సోమసూత్రమును గమనించగలము కాని ఈ దేవాలయము నందు నాగాకృతి సూత్రమును గమనించ గలము. ఆంధ్రప్రదేశ్ తెలంగాణల యందు ఇటువంటి సోమసూత్రమును ఎక్కడా గమనించము.

రెండు తెలుగు రాష్ట్రాలలో ఇటువంటి అద్భుతమైన శ్రీ చక్ర లింగాన్ని ఎక్కడా గమనించము. రమారమి 690 సంవత్సరాల కాలమునాటి గొప్ప ఆలయమును వృద్ధి చేయవలసిన అవశ్యకత ఎంతైనా ఉందని ఇక్కడ కళ్యాణ మండపం ఏర్పాటు చేయాలని ఈ దేవాలయ ప్రత్యేకతను అందరికీ తెలియజేయాలని టెంపుల్ టూరిజం నందు వృద్ధిచేయాలని దేవాదాయశాఖ వారు మరింత శ్రద్ధవహించాలని ప్రజలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

– డా॥ జి.యస్.రామయ్య
INTACH సభ్యులు – కర్నూలు జిల్లా చాప్టర్,
ఆంధ్రప్రదేశ్
m : 898 555 0007

# యుద్ధ వాతావరణంలో కవిత్వం

ప్రపంచంలో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ ముసాబ్ అబు తోహా (Mosab Abu Toha) కవిత్వం గురించి అతని వేదన గురించి తెలుసుకోవాల్సిందే.

ముసాబ్ అబు తోహా పాలస్తీనాకు చెందిన ప్రముఖ యువ కవి, విద్యావేత్త, లైబ్రేరియన్, వ్యాసకర్త. ముసాబ్ 1992లో గాజాలో జన్మించారు. ఆయన గాజాలోని ఇస్లామిక్ యూనివర్సిటీ నుండి ఆంగ్ల సాహిత్యంలో పట్టా పొందారు. ప్రస్తుతం ముసాబ్ అబు తోహా అమెరికాలో నివసిస్తున్నారు. Syracuse Universityలో విజిటింగ్ స్కాలర్‌గా ఉన్నారు.

గాజాలో మొట్టమొదటి ఆంగ్ల భాషా ప్రజా గ్రంథాలయాన్ని (Edward Said Public Library) స్థాపించిన వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. యుద్ధం, ఆంక్షల మధ్య ఉన్న యువతకు ప్రపంచ సాహిత్యాన్ని పరిచయం చేయాలనేది ఆయన లక్ష్యం. ఆయన రాసిన "Things You May Find Hidden in My Ear: Poems from Gaza'' అనే కవితా సంపుటి అంతర్జాతీయంగా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇది 'అమెరికన్ బుక్ అవార్డ్' (2023) 'పాలస్తీనా బుక్ అవార్డ్' వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను గెలుచుకుంది. 2024లో ఆయన "Forest of Noise'' అనే తన రెండవ కవితా సంపుటిని విడుదల చేశారు. ఇది కూడా ప్రస్తుతం సాహిత్య లోకంలో చర్చనీయాంశంగా మారింది



'Things You May Find Hidden in My Ear' అన్న కవితలో ముసాబ్ ఒక వైద్యుడిని సంబోధిస్తూ (డాక్టర్ ఎలిసియా క్వైస్నెల్), తన చెవిలో ఉన్న సమస్యను పరీక్షించమని కోరుతూనే, తన గుండెలో గూడుకట్టుకున్న యుద్ధ బీభత్సాన్ని కవిత్వీకరించారు. బాంబుల శబ్దాల వల్ల తన వినికిడి శక్తి తగ్గుతున్నా, తన బాల్యపు జ్ఞాపకాలు మరియు తన మాతృభూమి పట్ల ఉన్న ప్రేమ ఏమాత్రం తగ్గలేదని ఆయన ఈ కవిత ద్వారా చాటిచెప్పారు. ఆ కవిత ఇలా ఉంటుంది

నా చెవిలో దాగి ఉన్నవి
(అలీసియా ఎమ్. క్వైస్నెల్, MD గారి కోసం)
నా చెవిని తెరిచినప్పుడు, దానిని మెల్లగా తాకండి.
నా తల్లి స్వరం ఎక్కడో లోపల నిలిచి ఉంది.
నేను ఏకాగ్రత కోల్పోయి కళ్లు తిరిగితే,
తిరిగి నన్ను నిలబెట్టే ప్రతిధ్వని ఆ గొంతుక.
మీకు అక్కడ అరబిక్ పాటలు,
నాకు నేనే చదువుకునే ఆంగ్ల కవితలు,
వినిపించవచ్చు
మా పెరట్లోని పక్షుల కిలకిలారావాలతో కలిసి
నేను పాడే పాట ని మీరు అస్వాదించవచ్చు
డాక్టర్
ఆ గాయాన్ని కుట్టేటప్పుడు,
వీటన్నింటినీ మళ్ళీ నా చెవిలో ఉంచడం మర్చిపోకండి.
మీ బీరువాలో పుస్తకాలను సర్దినట్టుగా,
వాటన్నింటినీ వరుస క్రమంలో అమర్చండి.

× × ×

డ్రోన్ల హోరు, F-16 యుద్ధ విమానాల గర్జన, ఇళ్ల మీద, పొలాల మీద, మనుషుల మీద కూలుతున్న బాంబుల కేకలు, దూసుకుపోతున్న రాకెట్ల శబ్దాలని నా చిన్న చెవి నాళం నుండి తొలగించండి.

మీరు చేసిన ఆ కోత మీద
మీ చిరునవ్వుల పరిమళాన్ని చల్లండి.
నన్ను నిద్రలేపడానికి
నా నరాల్లోకి జీవన గీతాన్ని ఎక్కించండి.
నా మనసు మీ మనసుతో కలిసి నాట్యం చేసేలా,
మెల్లగా నా చెవిలోని డ్రమ్‌ని వాయించండి
ఓ డాక్టర్!

ఈ కవితలో ముసాబ్ ఒక వైద్యుడిని సంబోధిస్తూ, తన చెవిలో ఉన్న సమస్యను పరీక్షించమని కోరుతూనే, తన గుండెలో గూడుకట్టుకున్న యుద్ధ బీభత్సాన్ని కవిత్వీకరించారు. బాంబుల శబ్దాల వల్ల తన వినికిడి శక్తి తగ్గుతున్నా, తన బాల్యపు జ్ఞాపకాలు మాతృభూమి పట్ల ఉన్న ప్రేమ ఏమాత్రం తగ్గలేదని ఆయన ఈ కవిత ద్వారా చెబుతారు.

ముసాబ్ అబు తోహా రాసిన కవితల్లో మరొక శక్తివంతమైన మరియు హృదయాన్ని కదిలించే కవిత "నా తాతయ్య –ఇల్లు'' (My Grandfather and Home). ఈ కవితలో ఆయన తన మూలాలను, తన తాతయ్య జ్ఞాపకాలను తాను కోల్పోయిన మాతృభూమిని ఎలా వెతుక్కుంటున్నారో అద్భుతంగా వివరిస్తారు ఆ కవిత ఇలా కొనసాగుతుంది

**మా తాత – ఇల్లు**

తన ఇంటికి
తిరిగి వెళ్ళడానికి
మా తాత రోజులని
తన వేళ్లతో లెక్కపెట్టుకునేవాడు
ఆ తర్వాత రాళ్లను ఉపయోగించి లెక్కించాడు
అవి సరిపోలేదని
మేఘాలను, పక్షులను, మనుషులను లెక్కించాడు
ఆయన ఎడబాటు చాలా సుదీర్ఘమైపోయింది
ఆయన చనిపోయేటప్పుడు ముప్పై ఆరేళ్లు
మాకైతే ఇప్పుడు డెబ్బై ఏళ్లు దాటిపోయింది
మా తాత
తన జ్ఞాపకశక్తిని కోల్పోయాడు
అంకెలను, మనుషులను మరిచిపోయాడు
తన ఇంటిని కూడా మరిచిపోయాడు.

× × ×

నేను నీతో ఉంటే బాగుండేది తాత
నీ కోసం కవితలు రాయడం నేర్చుకునేవాడిని,
ఎన్నో సంపుటాలు.. తెచ్చే వాడిని
నీ కోసం మన ఇంటిని అలంకరించేవాడిని
ఈ మట్టిలో మొక్కలతో వస్త్రం లా కుట్టేవాడిని
నువ్వు పెంచిన చెట్లతో అలంకరించేవాడిని
నారింజ పండ్ల నుండి నీకు పరిమళాన్ని,
ఆకాశపు ఆనంద బాష్పాలతో
నీకు సబ్బును తయారు చేసేవాడిని
అంతకంటే స్వచ్ఛమైనది నాకు ఏదీ తట్టలేదు.

× × ×

నేను ప్రతిరోజూ స్మశానానికి వెళ్తాను
నీ సమాధి కోసం వెతుకుతాను,
కానీ అది దొరకదు
నిన్ను ఖననం చేశారని వారు ఖచ్చితంగా చెప్పగలరా? నువ్వు ఒక చెట్టుగా మారావా?
బహుశా ఒక పక్షితో కలిసి ఏ శూన్యంలోకో ఎగిరిపోయావా?

× × ×

నీ ఫోటోను ఒక మట్టి పాత్రలో ఉంచాను
ప్రతి సోమవారం, గురువారం సూర్యాస్తమయ సమయంలో
దానికి నీళ్లు పోస్తాను
ఆ రోజుల్లో నువ్వు ఉపవాసం
ఉండేవాడవని నాకు చెప్పారు
రమదాన్ మాసంలో
ప్రతిరోజూ నీళ్లు పోస్తాను ముప్పై రోజుల పాటు..
అవి తక్కువైనా, ఎక్కువైనా

× × ×

మన ఇల్లు ఎంత పెద్దదిగా ఉండాలని నువ్వు కోరుకుంటున్నావు?
నువ్వు సంతృప్తి చెందే వరకు నేను కవితలు రాస్తూనే ఉంటాను
నీకు ఇష్టమైతే,
పక్కనే ఉన్న ఒకటి రెండు గ్రహాలను కూడా
మన ఇంటికి కలిపేస్తాను.

× × ×

ఈ ఇంటి కోసం
నేను ఎటువంటి సరిహద్దులు గీయను
ఎలాంటి విరామ చిహ్నాలు ఉంచను.

అబు తోహా రాసిన ఈ కవితలోని వేదన, ముఖ్యంగా మూలాలు కోల్పోయిన మనిషి పడే ఆవేదనని మనం చూడవచ్చు

> **ముసాబ్ అబు తోహా కవిత్వం కేవలం రాజకీయాల గురించి మాత్రమే కాకుండా, మానవ సంబంధాలు కోసం, మనుగడ కోసం చేసే పోరాటం గురించి మాట్లాడుతుంది.**

ఆయన కవిత్వం ప్రధానంగా గాజాలో సామాన్య ప్రజల దైనందిన జీవితం, యుద్ధం వల్ల కలిగే వేదన, మరణం, మరియు ఆశల చుట్టూ తిరుగుతుంది. అత్యంత సున్నితమైన పదాలతో అమానవీయ పరిస్థితులను ఆయన అక్షరీకరించారు.

**సమకాలీన ప్రాముఖ్యత:** 2023-24 యుద్ధ సమయంలో ఆయన తన అనుభవాలను సోషల్ మీడియా ద్వారా అంతర్జాతీయ పత్రికల (The New Yorker వంటివి) ద్వారా ప్రపంచానికి తెలియ జేశారు. ఒకానొక సమయంలో ఆయనను నిర్బంధించినప్పుడు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న రచయితలు ఆయన విడుదల కోసం గళం ఎత్తారు.

ముసాబ్ అబు తోహా కవిత్వం కేవలం రాజకీయాల గురించి మాత్రమే కాకుండా, మానవ సంబంధాలు కోసం, మనుగడ కోసం చేసే పోరాటం గురించి మాట్లాడుతుంది.

ముసాబ్ అబు తోహా కవిత్వాన్ని చదువుతున్నప్పుడు మనకు కొన్ని ముఖ్యమైన అంశాలు కనిపిస్తాయి:

ఒక తాళం చెవి, ఒక పాత రేడియో, లాంటి చిన్న చిన్న వస్తువుల ద్వారా ఆయన పెద్ద చరిత్రను, యుద్ధ బీభత్సాన్ని ఆవిష్కరిస్తారు.

యుద్ధంలో చెట్లు నరికివేసినా, పక్షులు ఎగిరిపోయినా.. మళ్ళీ అక్కడ చిగురులు వస్తాయనే ఆశను ఆయన కవిత్వంలో నింపుతారు

రాజకీయాల కంటే ఎక్కువగా, ఒక సామాన్య మనిషి పడే ఆవేదనను ఆయన అక్షరీకరిస్తారు. అందుకే ఆయన కవిత్వం ప్రపంచవ్యాప్తంగా అందరికీ అర్థమవుతుంది.

**–మంగారి రాజేందర్ (జింబో)**
m : 9440483001
e : rajenderzimbo@gmail.com



ముప్పేశ్వర గర్భాలయం



కుందమాంబ త్రికూటాలయం

# నిడిగొండ చరిత్ర తొవ్వల్లో...

ప్రస్తుతం జనగామ జిల్లాలోని రఘునాథపురం మండలంలో ఉన్నది నిడిగొండ. వరంగల్లుకు 52కి.మీ., జనగామకు 10కి.మీ.ల దూరంలో ఉన్న పురాతన నగరం నిడిగొండ.

**నిడిగొండ కా పేరు:**

నిలువుకొండ, నిడివిగొండ నుంచి నిడిగొండగా ఈ వూరికి పేరు స్థిరపడ్డది. కాకతి గణపతిదేవుని సోదరి కుండమాంబ వేయించిన కుందారం శాసనంలో, నిడిగొండ శాసనంలోను కుందపురానికి తూర్పు, దక్షిణం, ఉత్తరదిశలలో ఉన్నవనే స్థలనామాలు 'వేములతోంట', 'జమ్మిపడియ', 'బాదమకుంట', 'నిలువురాయి' పేర్కొనబడ్డాయి. వీటిలో 'నిలువురాయి' నిడికొండ గురించేననిపిస్తున్నది.

**రాజధాని నిడిగొండ**

చారిత్రకంగా నిడిగొండ నతవాడి పాలకుల రాజధాని. నతవాడిని ఎక్కడో చూపిస్తారు కాని, నతవాడిపాలన అంతా తెలంగాణాలో నిడిగొండ, ఇనుగుర్తి ప్రాంతాలలోనే సాగింది. తొలుత పశ్చిమచాళుక్యులకు సామంతులుగా వున్న నతవాడి నాయకులు, కాకతీయులతో వియ్యం పొందినవారు. నర్సంపేట శాసనం మొదటిసారి వీరి ప్రస్తావన చేస్తున్నది. నతవాడి నాయకుడు బుద్ధరాజు కొడుకు దుర్గరాజు. దుర్గరాజు పేరు మీద నిడిగొండ రాచెరువులో శాసనముంది. కాకతీయ మహాదేవుని తల్లి దుర్గరాజు సోదరి ముప్పలదేవి. దుర్గరాజు మనుమడైన బుద్ధరాజు కొడుకులు రుద్రుడని ఒకే పేరున్న పెదరుద్ర, వక్కటి మల్లరుద్రులు, ఇద్దరు కొడుకులకు, మహాదేవుడు తన కుమార్తెలు మైలమ, కుందమాంబలతో పెళ్ళిచేసాడు. మైలమకు ఇనుగుర్తి, బయ్యారం ప్రాంతాలు, కుందమకు నిడిగొండ, కుందవరం, జనగాం, చెన్నూరు ప్రాంతాలు మాన్యాలు.



జైనబసది ద్వారశాఖ



ముప్పేశ్వరాలయ శాసనం

బయ్యారం శాసనంలో నతవాడి వారు కాకతీయులు ఒకే కులం వారని పేర్కొనబడ్డది. కాని, ఏ కులమని చెప్పలేదు. బూదపురం శాసనం కాకతీయులు చతుర్థవంశం వారంటుంది.

ఇనుగుర్తి, బయ్యారం శాసనాలు, ఆ మధ్య కొత్తగా దొరికిన రెడ్లవాడ శాసన శకలం మైలమను ప్రస్తావిస్తే, నిడిగొండ, కుందవరం శాసనాలు కుందమను పేర్కొంటున్నాయి.

కాకతీయులతో వియ్యమందిన నతవాడి పాలకులలో వక్కడిమల్ల దుగ్గరాజు తనసోదరి ముప్పమను 2వ ప్రోలరాజు కిచ్చాడు. (వరంగల్ శాసనసంపుటి, Historical Introduction-xvii-Ed. Nelaturi Venkataramanaiah, బయ్యారం శాసనం–27–30 పంక్తులు) అయితే దుగ్గభూపతి భార్యపేరు కూడా ముప్పమాంబనే. (వరంగల్ శాసనసంపుటి–శా.సం.17, పే38–39, పంక్తి 37–44)

**ముప్పేశ్వరాలయం:**

ఈ ముప్పమాంబిక నిడిగొండలో 'ముప్పేశ్వర దేవర'కు గుడి కట్టించింది. అంగభోగానికై, పూజారి ఆహారానికై ఉత్తరాయణ సంక్రాంతి నిమిత్తం మాండలిక దుగ్గరస 'రట్టసముద్రం' అనే చెరువు వెనక 2మర్తురుల గద్దె(తరి)భూమిని, 20 మర్తురుల


కేశవమూర్తి


యోగశివుడు


వీరభద్రుడు


వీరభద్రుడు


సూర్యుడు


గణపతి

కరంబభూమిని దానం చేసాడని నిడిగొండ శాసనంవల్ల తెలుస్తున్నది. (వరంగల్ శాసనసంపుటి-శా.సం.17, పే.39, పంక్తి 44-58)

అందరు నిడిగొండలో అప్పటి ఆం.ప్ర. పురావస్తుశాఖ పునరుద్ధరణకోసం పాతగుడిని విప్పి కట్టడానికి చేసిన ప్రణాళిక నిలిచిపోయిన త్రికూటాలయాన్నే 'ముప్పేశ్వరాలయం' అంటున్నారు. ఇది పొరపాటుగా పేరుపడ్డది. త్రికూటాలయం కుందమాంబ కట్టించి, శాసనం వేయించిన గుడి.

నిడిగొండ గ్రామంలో చెరువు పక్కన కనిపించే తూర్పు ప్రవేశద్వారం, ఉత్తరాభిముఖంగా దేవాలయ ద్వారంతో పాతగుడి ముప్పమాంబిక కట్టించిన ముప్పేశ్వరాలయం. శాసనంలో పేర్కొన్నట్టు క్రీ.శ. 1104వ సం.లో వేసిన నిడిగొండ శాసనంలో అప్పటి మహారాజు కళ్యాణీచాళుక్య చక్రవర్తి త్రిభువనమల్ల 6వ విక్రమాదిత్యుడు. అతని సామంతుడు నతవాడి దుగ్గరాజు. ముప్పేశ్వర దేవాలయం చాళుక్యశైలిలోనే నిర్మించబడ్డదనడానికి గుడిలోని వర్తులాకార పానవట్టంలో బాణలింగం, నంది శిల్పం, మంటపస్తంభాలు, సూర్యుడు, గణపతి, వీరభద్ర శిల్పాలు ప్రతిమాలక్షణపరంగా, శైలిపరంగా సాక్ష్యాలు. ముప్పేశ్వరాలయం అంతరాళం ద్వారబంధంమీద లలాటబింబంగా శివలింగం, అర్చిస్తున్న సింహం చెక్కబడివున్నాయి. ఈ చిహ్నం నతవాడి పాలకుల రాజ్యచిహ్నమేమో. గర్భగుడి ద్వారశాఖ మీద రెండు కలశాలు, పుష్పగర్భఅష్టభుజయంత్రం చెక్కబడివున్నాయి.

గుడిముందర కళ్యాణమంటపం, కొంచెం దూరంలో దీపస్తంభం, విడిగా వీరగల్లులు, నాగశిలలున్నాయి.

**కుందమాంబ త్రికూటాలయం:**

క్రీ.శ.1219నాటి మరొక నిడిగొండ శాసనం పాత శివాలయం పక్కన విరిగిన రాయిమీద దొరికింది. దీనిని నతవాడి రుద్రుని భార్య, గణపతిదేవుని సోదరి కుందమాంబ వేయించింది. ఇది కుందారం శాసనాన్ని పోలివుంటుంది. తన తండ్రి మహదేవుడు, సోదరుడు గణపతిదేవుడు, కొడుకు మాధవుడు, భర్త రుద్రునిపేర దేవాలయాలకు చేసిన దానాలీ శాసనంలో వివరించబడ్డాయి. కాకతీయ వంశక్రమాన్ని కూడా వివరించడం జరిగింది. ఈ శాసనకవి భాలభారతి.

ఈ శాసనంలో పేర్కొన్న త్రికూటాలయమే నిడిగొండ గ్రామానికి ఈశాన్యంలో శిథిలస్థితిలో కనిపిస్తున్నది. దీనిని విప్పి, తిరిగి కట్టడానికి జరిగిన ప్రయత్నాలు సఫలం కాలేదు. అద్భుతమైన, సౌందర్య మోహనమైన కాకతీయ శిల్పాలు విరిగి, మట్టి కొట్టుకునిపోయి దుస్థితిలో అగుపిస్తున్నాయి. రామప్పను పోలిన దేవాలయ వాస్తుతో నిర్మించిన ఈ కుందమాంబ త్రికూటాలయం లోని శిల్పాలు మనోహరాలు. లింగవేదికలు, అష్టదిక్పాలకులు, నర్తకీమణులు, అధోశాటీలనువిప్పే స్త్రీలు రామప్ప శిల్పాలను పోలి వున్నాయి. నాగిని (కాదు యోగిని) శిల్పం కూడా కనిపిస్తుందిక్కడ. రామప్పగుడి చూరు కింద నిలిపిన పొత్తళికలను పోలిన శిల్పాలిక్కడ వున్నాయి. నాగిని అని పిలిచే సర్పాలను ధరించి సర్పపీఠంపై నిలిచిన స్త్రీమూర్తుల శిల్పాలు రామప్పలోనే కాదు ఎల్లకొండ, వేల్పుగొండ, నందికంది శివాలయాల గోడలమీద కూడా అగుపిస్తాయి. అలసకన్యలను చెక్కే సంప్రదాయాన్ని పాటించిన గుడులలో ఈ బొమ్మలుంటాయి. శిథిలాలలో గజపరిక్రమలో కాలాముఖగురువు, శివాలయం, శిథిల నటరాజు, వైష్ణవ ద్వార పాలకులు, పంచశాఖ ద్వారబంధాలు, సింహయాళీలు, జాలకాలు, విరిగిన నంది, రంగవేదిక, కోలాటం, మల్లన్న, భద్రకాళి, ఏనుగు అంబారీ, యోగేశ్వరుల శిల్పాలు అగుపిస్తున్నాయి.

రామప్పగుడిగా పేరువడ్డ ఏకకూటం 'రుద్రేశ్వరాలయం'


కాకతీయ, కాకతీయపూర్వ స్తంభాలు


చాళుక్యశైలి
లింగ సహిత నంది


చాళుక్యశైలి బాణలింగం


జైన యక్షిణి


మల్లన్న


నాగశిల


గణపతి


చాముండి శిథిలశిల్పం


శూలారోహణ వీరగల్లు


నాట్యలావిక


వీరగల్లు-నతవాడి

నిర్మాణం క్రీ.శ. 1213నాటికి పూర్తయింది. తర్వాత 6రేండ్లకు 1219లో నిడిగొండ త్రికూటాలయం నిర్మించబడ్డది. శిల్పపరంగా ఎన్నో పోలికలు కలిగివున్నాయి ఈ దేవాలయాలు.

**నిడిగొండలో జైనం:**

ముప్పేశ్వరాలయం ముందరున్న కళ్యాణమంటపానికి మూదురకాల స్తంభాలను అమర్చి కొత్తగా నిలిపినట్లున్నది. దానికి వేసిన మెట్లలో జైన తీర్థంకరుల శిల్పాలతో చెక్కిన శాసన స్తంభాలున్నాయి. ఆ మెట్లను విప్పి శాసనాలను అచ్చుతీస్తే నిడిగొండ చరిత్రలో కొత్తపుటలు చేరుతాయి. నిడిగొండలోని ముప్పేశ్వరాలయం, కుందమాంబ గుడులకన్నా ముందిక్కడ జైనబసదులుండేవని ఆనవాళ్ళు లభిస్తున్నాయి.

మంటపం మెట్లకు జైన శాసనాలు, ఉన్నత పాఠశాల వెనకున్న పెద్దగుట్ట రాతిగోడలమీద చెక్కిన శిల్పాలు జైనధర్మానివే. కుందారం, నిడిగొండ శాసనాలలో పేర్కొనబడిన వేములతోంట జైనుల ఆవాసమే. కుర్క్యాల శాసనంలోని మొదటి పంక్తిలో పేర్కొనబడిన 'నిదుగొండ' ఈ నిడిగొండేనని చరిత్ర కారులు ఆర్.శేషశాస్త్రిగారి అభిప్రాయం.


కలశం

నిడిగొండ గ్రామంలో లభించిన జైనపాదాలు, జైనయక్షిణి శిల్పం, విరిగిన జైనబసది ద్వారశాఖ అక్కడొకప్పుడు జైనబసది ఉండేవనడానికి నిదర్శనాలు. పెద్దగుట్ట శిల్పాలలో 9మంది స్త్రీలు, రాజోచిత ఆహార్యంలో ఒక పురుషుడు... చేతులలో ఫలాలు, దుమ్ముదులిపే కుంచెలున్న వారంతా జైనబసదిని ఊడ్చి, శుద్ధిసేవలకు వెళుతున్నట్టున్నదని డా. ఈమని శివనాగిరెడ్డిగారు అభిప్రాయపడ్డారు.

అక్కడే ఆ శిల్పాల పక్కన లభించిన లేబుల్ శాసనాలలో మేం చదవగలిగినవి 1. బ్రమ్మదేవనిన్న ...లుకారాం నిడికొ..., 2.అసగమ, 3.కాలధరుదు, 4. వదుబ్రమ్మదే..., 5. సాస... శతప్రి... పతవే... దళదస్తి నాయ..... ప్రశస్తి.... తివే..... తపస్తి.. శాయ.

వీటిలో అసగమ(రస) కొలిపాక పాలకుడుగా వుండేవాడు. రాష్ట్రకూట కుటుంబీకుడు. జైనధర్మావలంబి. ఆ పేరిక్కడ కనబడడంవల్ల కూడా ఇక్కడ జైనబసది వుందని చెప్పడానికి ఆస్కారముంది.

**విడిశిల్పాలు:**

నిడిగొండలో ద్విభుజులైన గణపతుల శిల్పాలు మూడున్నాయి. ఇండ్లల్లో అర్చామూర్తులుగా గణపతులున్నారు. చాళుక్యశైలి గణపతి పెద్దశిల్పమున్నది. కాకతీయానంతర శైలి చతుర్భుజ గణపతి శిల్పాలున్నాయి. చాముండ శిల్పాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. విరిగిన శిల్పాలే ఎక్కువ. వేర్వేరు శైలులు, కాలాలకు చెందిన నాగశిలలు 16 లభిస్తున్నాయి.

మల్లన్న దేవుని చిన్నశిల్పం దొరికిందిక్కడ. పెద్దగుట్ట పై భాగాన కొలనుకి క్రింద బురుజుకి పైభాగంలో సాతవాహనులకాలపు ఇటికెల దిబ్బ ఉన్నది. రెండు వైష్ణవమూర్తుల పాదాలున్నాయి.

విరిగివడివున్న మకరశిల్పతోరణంలో మూడువరుసల శిల్పాలున్నాయి. పై వరుసలో ఉన్న 24 శిల్పాలు 24 విష్ణురూపాలవలె వున్నాయి. దాని కింద కుదులలో ఉన్నవేవీ స్పష్టంగా కనబడడం లేదు. కింది వరుసలో పుష్పమాలలతో విద్యాధరులు కనిపిస్తున్నారు. ఇది అపురూపమైన తోరణం. ఈ తోరణంతో ఉండాల్సిన వైష్ణవమూర్తిని అన్వేషించాలి.

నిడిగొండ వెలుపల రోడ్డుదగ్గర శైవమతం అవశేషాలున్నాయి. స్తంభాలు, ద్వారబంధం ఉన్నాయి.

ఒకనాటి రాజ్యరాజధాని ఆనవాళ్ళుగా పొట్టిగుట్ట, పెద్దగుట్టల


కాకతీయశైలి సమలింగం


చాముండి శిల్పాలు


సాతవాహనకాలం ఇటికెలపోగు


వైష్ణవమూర్తి తోరణం


ముప్పేశ్వరాలయ లలాటబింబంగా లింగం, సిహం


మైలారదేవ


చాళుక్యశైలి మంటపస్తంభాలు


జైనశాసనాల మెట్లు

మీద కోటగోడల అవశేషాలున్నాయి.

**నిడిగొండలో వీరులు:**

ముప్పేశ్వరాలయానికి వెలుపల చెలకలో కనిపించే వీరగల్లు రాచ ఆహార్యంతో కనబడుతున్నది. శిరోవేష్టకం, కంఠాభరణాలు, భుజభూషణాలు, నడికట్టు, బొడ్లో చురకత్తి, ఒర నుంచి తీస్తున్న ఖడ్గం, ఎత్తులు కట్టిన పాదరక్షలు, డాకాలు ముందుమోపి యుద్ధోన్ముఖుడైనట్లు కనిపిస్తున్నది. ఎవరో ఒక నతవాడి రాజుద్దె వుండవచ్చు.

రెండుచేతుల్లో ఆయుధాలు ధరించి నిల్చున్న వీరుడు మెడలో కంటె, దండకడియాలు, వీరకాసెతో అగుపిస్తున్నాడు. చాళుక్యశైలి శిల్పం.

మూడో వీరగల్లు నడినెత్తిన కొప్పుతో కత్తి, డాలు ధరించిన వీరుడు ఉత్తరాభిముఖుడై డాకాలు ముందుమోపి యుద్ధంలో వున్నాడు. ఆ వీరుని యాదిలో వేసిన వీరగల్లు. రాష్ట్రకూటశైలి.

నాలుగో వీరగల్లులో వీరుడు భుజంపై ఖడ్గంమోపి, డాలుతో యుద్ధోన్ముఖుడై కనిపిస్తున్నాడు. చాళుక్యశైలి.

పొడవైన బాకుతో, తలవెనక కొప్పుతో, ఉత్తరాభిముఖుడై కనబడుతున్న వీరుడు పొడగరి. ఈ ఐదో వీరగల్లు చాళుక్యశైలిలో ఉన్నది. మరొక వీరగల్లులో పై అంతస్తు ఒకటే మిగిలివుంది. అందులో వీరస్వర్గం పొందిన వీరుడు అప్సరసల సేవలందు కుంటున్నాడు.

శూల గుండయ్య, శూల బ్రహ్మయ్యల శూలారోహణ ఆత్మాహుతి వీరశైవ వీరగల్లు శిల్పమున్నది.

మొత్తం పదిదాక వీరగల్లులున్నాయి.

**నిడిగొండ శాసనాలు:**

వరంగల్ జిల్లా శాసన సంపుటిలో 3 శాసనాలు వరుసగా 1. ఆదిత్య భటార శాసనం శా.సం. 7, పే.15లో, 2. ముప్పమాంబ ముప్పేశ్వరాలయ శాసనం శా.సం.17, పే37-39లలో, 3. కుందమాంబ త్రికూటాలయ శాసనం శా.సం. 57, పే.168-173లలో ఉన్నాయి.

ఇవిగాక ఏఎస్సై వారి Indian Epigraphy.1983-84, App. B.17-19, p.31లో నిడిగొండలోని 3 శాసనాల ప్రస్తావన ఉన్నది. ఉన్నతపాఠశాల వెనక జైనశిల్పాలున్నాచోట చెక్కిన శాసనాలలో 'వడుబ్రహ్మదేవ' మరికొన్ని పేర్లున్నాయని రాయబడ్డవి. కాని అవేవో పేర్కొనబడలేదు. ముప్పేశ్వరాలయం బయటున్న మంటపంలో తేది ఉన్న శాసనశకలం ఉందని కూడా చెప్పబడ్డది.

కళ్యాణీచాళుక్యులకాలంనాటి మరొక శాసనం పెద్దగుట్ట పైన లభించిందని డా. ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. అయితే ఆ శాసనం అచ్చుకాలేదు.

**కోనేటి శాసనం:**

ముప్పేశ్వరాలయం వెనక గుట్టమీద లక్ష్మినరసింహాలయం ఉంది. అక్కడ నీటి కుండంవద్ద చెక్కివున్న శాసనం ఒక రాతిగుండు మీద హనుమంతుల గంటుగీతల బొమ్మ పక్కన ఉంది. ఇది 17వ శతాబ్దపు తెలుగులిపిలో, తెలుగుభాషలో రాసిన లేఖనం. ఈ శాసనంలో 'శ్రీ అన్నమరాజువారి పోచిరాజు సమర్పించిన తిరువళ్ళువం' అని ఉంది. అంటే పోచిరాజు దేవస్థానానికి ముందు కోనేటి గుండం తొలిపించారు. ఈ శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్రబృందమే పరిష్కరించింది.

**ధన్యవాదాలు:**


నిడిగొండను దర్శించినపుడు మాతోవున్న అరవింద్ ఆర్య, చంటి, పాఠశాలవిద్యార్థులు, నిడిగొండ త్రికూటాలయ విశేషాలను చెప్పిన డా. ఈమని శివనాగిరెడ్డిగారికి, రెండు గుడులే కాదు కొల్లలుగా వున్న నిడిగొండ శిల్పాలను, విశేషాలను వెలుగులోనికి తెచ్చిన మా చరిత్రబృందం పరిశోధకుడు కండాడై కృష్ణమాచార్యకు, కుర్క్యాల శాసనంలో పేర్కొనబడిన నిడుగొండ ఈ నిడిగొండేనని చెప్పిన ఆర్.శేషశాస్త్రిగారికి... నిడిగొండ గురించి చెప్పిన ఎందరో మహానుభావులందరికి.

- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com


వీరగల్లు చాళుక్యశైలి


త్రికూటాలయ శిథిలాలు


పెదగుట్ట జైన శిల్పాలు



త్రికూటాలయ ద్వారశాఖ


కోటగోడ

ప్రకృతి గమనం! 6 ప్రకృతి ధర్మం!!

# మహానగరాలు కృంగుతున్నాయా..!!

పదార్థంలోని అణువుల మధ్యన ఖాళీస్థలం వుంటుందని పాఠశాలస్థాయిలో అందరం చదువుకున్నాం. దీనికి రెండు ప్రయోగాల్ని చూసాం. ఒక గాజు బీకరులో చిన్నపాటి ఉక్కుగోళీలను (చెర్రాలు) నిండానింపి, అందులో సన్నని ఇసుకను వేస్తే ఉక్కుగోళీల మధ్యలో అది నిండుకోవడం, బీకరును కదిలిస్తే మరికొంత ఇసుక దాంట్లోకి పోవడం, గోళీల మధ్యన ఖాళీ పూర్తిగా నిండిన తర్వాత ఇక ఇసుక అందులోకి జారకపోవడం చూసాం. అలాగే, మరో బీకరును నిండా నీటితో నింపి, కొంచెం కొంచెం చక్కెరను వేస్తూపోతే, నీరు బయటకు రాకుండా చక్కెర ఆ నీటిలో ఇమిడిపోవడం, అలా పూర్తిగా ఇమిడిన తర్వాత మరికొంత చక్కెర వేస్తే నీరు బయటకు దొర్లడం చూసాం. ఇలా మొదటి దశలో ఇసుక గోళీలలోకి, చక్కెర నీటిలోకి చేరడం, గోళీల మధ్యన (ఘణ), నీటి అణువుల మధ్యన (ద్రవ) ఖాళీవుంటుందని గుర్తించాం. ఆ తర్వాత ఇసుక, చక్కెర అందులోకి పోకవడంతో, ఆయా పదార్థాల్లోని అణువుల మధ్యన ఖాళీస్థలం లేదని గ్రహించాం. ఇదో శాస్త్రీయ పరిశీలన. ఇదే శాస్త్రీయ విధానం ప్రకృతిలో నిరంతరం జరుగుతుంది. ఈ విధానం భౌగోళికంగా అనేక మార్పుల్ని కలిగిస్తుంది.




ఇప్పుడు మహానగరాలున్న ప్రాంతాల్ని చూద్దాం. ఆకాశ హర్మ్యాల్ని నిర్మించడానికై భూమిని పదుల మీటర్ల లోతుకు తవ్వడం తెలిసిందే! అలా తవ్విన ప్రాంతంలో అత్యంత ఎత్తైన భవన సముదాయాల్ని నిర్మిస్తారు. పదార్థ ధర్మానుసారం, ఎత్తు పెరిగిన కొలది, అవి కలిగించే పీడనం కూడా పెరుగుతుంది. భవన సముదాయాల నిర్మాణానికి ముందు సాధారణ ఉపరితలు నేలలో వున్న ఒత్తిడి, భవనాల నిర్మాణం తర్వాత అత్యధిక ఒత్తిడికి గురైతుంది. ఇలా ఒత్తిడికి గురైన ప్రాంతంలో మట్టిపొరల్లో వుండే నీరు, ఇసుక, మట్టి రేణువులు కూడా మరో దిశకు పోవడం జరుగుతుంది. అలాగే, ఈ భవన సముధాయాల నిర్మాణానికి, నివాస ప్రజల అవసరాలకు పదుల సంఖ్యలో అతిలోతైన బోరుబావుల్ని తవ్వాల్సి వస్తుంది. ఇది కొన్నిసార్లు కిలోమీటరు లోతుల్లోకి కూడా వుంటుంది. ఈవిధంగా అతిలోతుల్లో వున్న భూగర్భనీటిని ఉపరితలానికి, ఆకాశహర్మాల పై అంతస్తుకు పంపింగ్ చేయాల్సి వస్తుంది. ఈ విధంగా వేలాది గ్యాలన్ల నీటిని భూగర్భం నుండి తోడడంతో, పదార్థ ధర్మానుసారంగా, అణువుల మధ్యన (మట్టి) ఖాళీస్థలం ఏర్పడుతుంది. ఉదాహరణకు ఒక చదరపు అడుగు నేలలో వంద గ్రాముల నీటిని తీయడంతో, ఆ చదరపు అడుగులో అంతే మోతాదులో ఖాళీస్థలం ఏర్పడుతుంది. అలా ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో అణువుల మధ్య దూరం పెరగడంతో పదార్థం యొక్క ఉనికిలో మార్పు జరిగి దాని ఘనపరిమాణం తగ్గుతుంది. ఇలా భవన సముదాయాల కింద వేలాది అడుగుల నేల ఆకృతిలో, పరిణామంలో మార్పుచెంది కుంచించుకపోతుంది. దీంతో పైన నిర్మించిన, సుమారు వెయ్యి అడుగుల ఎత్తైన భారీ నిర్మాణం ఒత్తిడి కిందగల నేలపై మరింతగా కలిగిస్తుంది. ఇదో సహజ ప్రక్రియ.


ఈ దృష్టితోనే, యూరోపియన్ సెంటినెల్-1 (European Senti-nel-1) ఉపగ్రహం పంపించిన 1,299 రాడార్ చిత్రాల్ని పరిశీలించగా మహానగరాల నేల కృంగుతున్నట్లుగా పరిశీలకులు గుర్తించారు. ఈ పరిశీలనలను నేచర్ సస్టైనెబిలిటి (Nature Sustainability) అనే సైంటిఫిక్ జర్నల్లో ప్రచురించడం జరిగింది. పరిశీలకులు దీనికోసం ఇంటర్ ఫెరోమెట్రిక్ సింథటిక్ అపర్చర్ రాడార్ (InSAR) అనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఈ విధానంలో రాడార్ పంపించిన ప్రతి ఫోటోను తెరపై అతి సూక్ష్మంగా పరిశీలించారు. అలాగే అనేక ఉపగ్రహాలు పంపించిన చిత్రాల్ని, ఒకే రాడారు ఒక ప్రదేశాన్ని విభిన్న కోణాల్లో తీసిన చిత్రాల్ని క్రోడీకరించారు. ఇలా సుమారుగా 5,00,000 లక్షల మైక్రో (pixel) చిత్రాల్ని పరిశీలించి, మహానగరాల అడుగునేల కృంగుతున్నట్లు (subsiding)గా నిర్ధారణకు వచ్చారు.

నితేష్‌నిర్మల్ సదాశివం నాయకత్వంలో, ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో వర్జీనియా టెక్నాలజీ విశ్వవిద్యాలయం చేపట్టిన ఈ ప్రాజెక్టు, మహానగరాలైన ఢిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూర్ లాంటి మహానగరాలను 2015 నుంచి 2023 ఉపగ్రహ రాడార్లు పంపిన గణాంకాలు పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనల ప్రకారం పై నగరాల నేల కృంగుదల ఈకింది విధంగా వుంది.

| మహానగరం | సంవత్సరానికి నేలకృంగుదల |
|---|---|
| 1) ఢిల్లీ | 52 మి.మీ. |
| 2) చెన్నై | 31.7 మి.మీ. |
| 3) ముంబై | 26.1 మి.మీ. |
| 4) కోల్‌కతా | 16.4 మి.మీ. |
| 5) బెంగళూర్ | 6.7 మి.మీ. |

40-50 మి.మీ. సరాసరి కృంగుదల అంటే, ప్రతి మూడు సంవత్సరాలకు ఒక అడుగు మెట్టు (step) నేల కృంగుతున్నట్లుగా లెక్క. అయితే, ఈ కృంగుదల సాధారణ దృష్టికి కనపడదు. కాని,

కాలక్రమంలో దీని ప్రభావం ఆకాశహర్మ్యాలపై, భవనాల పటిష్టతపై, నేలలోని పైపులైన్లపై, మురికి కాలువలపై, నీటి సరఫరాపై తీవ్రప్రభావాన్ని చూపుతుంది. ఈ మహానగరాల్లోని సుమారు 13.1 మిలియన్ భవనాల చిత్రాల్ని (V3) డేటాబేస్‌లో అన్వయించి చూడగా, పక్క పక్కన గల భవనాల్లో కృంగుదల రేటు, వాటి ఎత్తుకు సంబంధంగా వున్నట్లు తేలింది. పరిశీలనకు ముందున్న ఈ భవనాల స్థితికి, పరిశీలన తర్వాత (8సం॥తర్వాత) ఎంతో వ్యత్యాసం వున్నట్లుగా తేలింది. వ్యత్యాసం ఎక్కువగా వుందంటే సంబంధిత భవనం అంతే ఎక్కువగా వంగిపోతున్నట్లుగా గుర్తించారు. ఈ విధానాన్ని కోణీయ వక్రీకరణ




(angular distortion) అంటారు. భవనాలు ఎక్కువ మోతాదులో కోణీయ వక్రీకరణ (వంగే కోణం) వుంటే కింద నేల కూడా క్రమరహితంగా కృంగుదలకు గురవుతూ వుంటుందని ఇంజనీరు నిపుణులు చెపుతున్నారు. వీరి పరిశీలనలు ప్రకారం అత్యంత ప్రమాదకరంగా వుండే భవనాల్ని కూడా వీరు గుర్తించడం జరిగింది. అవి..

| | |
|---|---|
| ఢిల్లీ | 11,457 భవనాలు |
| చెన్నై | 8,284 భవనాలు |
| ముంబై | 3,477 భవనాలు |
| కోల్‌కతా | 199 భవనాలు |
| బెంగళూర్ | 112 భవనాలు. |

వీటిలో ఢిల్లీ, ముంబై, చెన్నై నగరాల్లోని 2,406 భవనాలు అత్యంత ప్రమాదకర స్థితిలో వున్నట్లుగా తేల్చారు. నేల కృంగుదల ఇదేవిధంగా వుంటే, రానున్న 50 సం॥లలో మరో 23,500 భవనాలు ఈ జాబితాలోకి చేరుతాయి. అయితే, ఈ ప్రమాదం ఇప్పటి కృంగుదల రేటుతో వుంటేనే! కాని, రానున్న సంవత్సరాలలో, నేల మరింతగా ఎక్కువగా కృంగే ప్రమాదం కూడా వుంది. అప్పుడు మరికొన్ని భవనాలు ఈ జాబితాలో చేరడమేకాక, 50 సం॥లకు ముందుగానే ఈ భవనాలు ప్రమాద ఘంటికల్ని వినిపిస్తాయి.

అంతర్జాతీయంగా ఇలాంటి పరిస్థితి 150 మహానగరాలకు వున్నట్లుగా ఉపగ్రహ చిత్రాలు చూపుతున్నాయి. ఇందులో ఇండోనేషియా

- మహానగరాల అస్తవ్యస్థ నిర్మాణాలలో సంభవించే వరదల నష్టం సంవత్సరానికి ఒక ట్రిలియన్ డాలర్లని ప్రపంచబ్యాంక్ నివేదిక తెలిపింది.
- నెదర్‌ల్యాండ్ సంవత్సరానికి 3.5 బిలియన్ల డాలర్లను, చైనా 1.5 బిలియన్ల డాలర్ల నష్టాన్ని పొందుతున్నాయి.
- సముద్రతీర ప్రాంతాల్లోని మహానగరాల్లో నివసిస్తున్న 1,50,000 జనాభా భవిష్యత్ ఆందోళనకరంగా వుంది.
- 40 శాతం జకార్తా నీట మునుగుతున్నది
- 54 శాతం ఆసియా జనాభా లోతట్టు ప్రాంతాల్లో వుంటున్నారు.

రాజధాని జకార్తా సంవత్సరానికి 25 సెం.మీ. చొప్పున కృంగుతున్నట్లుగా గుర్తించారు. అలాగే గత దశాబ్ద కాలంలో మెక్సికో మహానగరం ఏకంగా 9 మీటర్ల లోతుల్లోకి కృంగిందంటే, పరిస్థితి ఎలా వుందో తెలుస్తుంది. మన దేశంలోని పై అయిదు మహానగరాల్లో, కనీసం సంవత్సరానికి 4 మీ.మీ. చొప్పున కృంగుతున్న నేల ప్రాంతాల్లో సుమారు 1.9 మిలియన్ల (2 కోట్ల) జనాభా నివసిస్తుండగా, ప్రపంచ వ్యాపితంగా కృంగుతున్న నేల ప్రాంతాల్లో నివసిస్తున్నవారు 80 మిలియన్లు (8కోట్లు).

**నేల కృంగుదలకు కారణాలు:**

| | |
|---|---|
| 1) అత్యధికంగా భూగర్భజలాల్ని వినియోగించడం | భూ ఉపరితల గట్టినేల తోపాటు మృతిక కృంగడం. |
| 2) ఆకాశ హర్మ్యాల నిర్మాణం | మెత్తని నేలపై నిలువెత్తు భవనాల భారం (పీడనం) పడడం |
| 3) గతితప్పిన వర్షరుతువులు (వర్షాభావస్థితి) | వర్షాభావస్థితి, భూగర్భంలోకి వర్షపు నీరు ఇంకకపోవడం. (కాంక్రీట్ / సిమెంట్ రోడ్లు) |
| 4) పట్టణీకరణ (సం॥నికి 9% చొ॥) | పల్లెలు వల్లకాడుగా మారడంతో ఉపాధిలేక పోవడం. పట్టణీకరణ పెరగడంతో అత్యధిక నీటిని వినియోగించడం. |
| 5) భవన నిర్మాణాలపై, నిబంధనలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం | అనుమతులకు, నిర్మాణాలకు సంబంధం లేకపోవడం భవనాల రక్షణపై నియంత్రణ నిఘా లోపించడం. |

**నేల కృంగితే ఎత్తైన భవనాల పరిస్థితి ఏంటి?**

అడుగులు, సెంటీమీటర్లు కాదు, మిల్లీమీటర్ల నేలకృంగినా,

**సముద్రనీటితో జలమయమయ్యే మహానగరాలు**

జకార్తా, బాంక్‌కాక్, ఢాకా, మనిలా, లండన్, మియామి, బర్లిన్స్, వేనిస్, టోక్యో, వర్జినియా, సింగపూర్, నైయ్( డెన్మార్క్)

**భూతలంపై కృంగుతున్న మహానగరాలు:**

ఢిల్లీ, సావొసాల్లో (బ్రెజిల్), లాస్‌వెగాస్ (బ్రెజిల్), రియాద్ (సౌది).

**దిద్దుబాటు చర్యలు**

టోక్యో భూగర్భజలాల వినియోగాన్ని నియంత్రించింది. పర్వతాల్లో జలాశయాల్ని నిర్మించడం ప్రారంభించింది.

వర్జినియా, సింగపూర్‌లు మురుగు నీటిని త్రాగునీటిగా మార్చి, నీటి సంరక్షణను మొదలు పెట్టాయి.

నైయ్ వర్షపునీటిని నిల్వచేసి, భూగర్భజలానికి ప్రత్యామ్నాయంగా వినియోగిస్తుంది.

**వేనిస్ మహానగరంలో తేలికపాటి వస్తువులతో నిర్మించే భవనాలను ప్రోత్సహిస్తున్నది. మన దగ్గర లారిబేకర్ ప్రయోగం జరగాలి.**

నిబంధనలు పాటించని భవనాల్లో వెంటనే అడుగుభాగం కృంగుతుంది. పునాదులు జతకడం (కృంగడం) అతి స్వల్ప కాలంలోనే గోడల్లో పగుళ్లు ఏర్పడుతాయి. వీటి ప్రభావం నీటిపైపులపై, బాతురూం పైపులపై ప్రభావం చూపి పగలడం, విరగడం, ఊడిపోవడంతో నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. లావెటరీ వ్యవస్థ దెబ్బతిని, దుర్గంధం వస్తుంది. ఇక విద్యుత్‌వైర్లు తడవడం, తెగడంతో షార్టు సర్క్యూట్ ఏర్పడడం, విద్యుత్ షాక్స్ రావడం, ప్రమాదాలు జరగడం చోటుచేసుకుంటాయి. అన్నింటికి మించి స్లాబులు, పిల్లర్లు, భీంలు వంగడం, విరగడం, పగలడంతో స్టీలు (Iron) తేమకుగురై, త్రుప్పు పట్టి, బలహీనమై భవనం మొత్తంగా కూలిపోతుంది. పాతభవనాలు ఇప్పటికే కూలడం, ప్రాణంతంగా మారడం చూస్తూనే వున్నాం.


నీట మునుగుతున్న జకార్తా

ఒకప్పుడు ప్రకృతి అనుకూల ఇల్లు, భవనాలు సురక్షితంగా వుండేవి. వాటి నాణ్యత, మన్నిక దీర్ఘకాలంగా వుండేది. కేవలం మానవ శ్రమతో, స్థానికంగా దొరికే వస్తువులతో, వనరులతో నిర్మించబడేవి. ఇప్పుడంతా వ్యాపారమయమే! స్థానికేతర వస్తువుల వినియోగంతో, ఖనిజవనరులు అన్ని ప్రాంతాల్లో కొల్లగొట్ట బడుతున్నాయి. వనరుల్ని తవ్వితీసిన ప్రాంతాలు నిరుపయోగంగా మారి, ప్రకృతి విపత్తులకు కారణమైతున్నాయి. ఆధునికతతో భవన నిర్మాణ ప్రాంతాలు, నిర్మాణంకై ఈ ఉపయోగించే ఖనిజ ప్రాంతాలు ప్రకృతికి శాపంగా మారుతున్నాయి.

**నేలకృంగడం ఆగాలంటే...?!**

1) భూగర్భజల వినియోగంపై నియంత్రణ వుండాలి. వ్యవసాయ రంగానికి వాల్టా (WALTA) 2002 చట్టం అమలు జరగాలి. పట్టణ ప్రాంతాల్లో బోరుబావుల్ని నియంత్రించాలి. నిషేధించాలి. ప్రభుత్వమే నీటి సరఫరా చేయాలి.

2) వర్షపునీరు అత్యధికశాతంగా నేలలో ఇంకేలా చర్యలు చేపట్టాలి. రియలెస్టేట్ భూతాన్ని నియంత్రించాలి. వ్యవసాయ భూముల్ని, వ్యవసాయేతర భూములుగా మార్చవద్దు. పట్టణీకరణపై నియంత్రణ వుండాలి. పట్టణాల్లో 30శాతం, గ్రామాల్లో 50 శాతం రోడ్లు, రహదారులు ఇరువైపుల మట్టి నేలను కలిగి వుండాలి. దీనిపై గరిక, పొదలు, గడ్డిజాతిని పెంచాలి. మధ్యన చెట్లు వుండాలి.

3) వరదప్రాంతాల్లో, సముద్ర, నదీతీర ప్రాంతాల్లో నిర్మాణాల్ని నిషేధించాలి.

4) వ్యవసాయానికి భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించాలి. నియంత్రించాలి. నిషేధించాలి. ఉపరితల నీటి రవాణ వ్యవస్థను, స్థానికతకు అనుగుణంగా అభివృద్ధి చేయాలి.

5) ఆధునిక సాంకేతికత సంతరించు కున్న సబ్‌మర్జిబుల్ పంపింగ్ విధానాన్ని నిషేధించాలి.

6) రహదారుల నిర్మాణం పరిమితంగా వుండాలి. అభివృద్ధి పేరున విశాలమైన రాష్ట్ర, జాతీయ రహదారులను నియంత్రించాలి.

7) పట్టణాల్ని నిర్మించే (అమరావతి నిర్మాణం శివరామకృష్ణ కమిటీకి విరుద్ధంగా చేపట్టబడింది) రాజకీయ విధానాల్ని అనుమతించవద్దు. ఉన్న నగరాలు నరకకూపాల్లా మారుతుంటే, భవిష్యత్ నగరాలంటూ (Future City) విలువైన పంటభూముల్ని రాజకీయాలకు బలిచేయకుండా పటిష్టమైన వ్యవస్థ వుండాలి.

8) అన్నింటికి (విద్య, వైద్యం, ఉపాధి మొ॥) మహానగరాలపై ఆధారపడే వ్యవస్థల్ని నియంత్రించాలి. వికేంద్రీకరణ విధానాన్ని అమలు పర్చాలి.

9) గ్రామీణ వ్యవస్థను పటిష్టపర్చాలి. చదువుకున్న యువత పట్టణ, విదేశీబాట పట్టే వలస విధానాన్ని నియంత్రించాలి. స్థానిక ఉపాధి, ఉద్యోగ అవకాశాల్ని పెంపొందించాలి.

ఈ మాటలు, తీర్మాణాలు, ఉపదేశాలు పట్టించుకునే రాజకీయ వ్యవస్థలు దాదాపు ప్రపంచ వ్యాపితంగా కనుమరుగై పోతున్నాయి. అశోకుడు చెట్లు (క్రీ.పూ.) నాటించెను అనే పాఠాన్ని పార్లమెంటు, న్యాయవ్యవస్థల్లో విధిగా చర్చించాలి. దీని గూఢార్థాన్ని చెప్పాలి. అయితే ఇవన్నీ జరిగే పనులు కాకున్నా, ఆలోచనాపరులు (Think Tankers) ఈ దిశగా మాట్లాడాలని ఆశిస్తూ..

– డా॥ లచ్చయ్య గాండ్ల,
m : 9440116162
e : drglachaiah@gmail.com




# భావితరాలకు వారసత్వ స్ఫూర్తి!

ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని (World Heritage Day) ఏటా ఏప్రిల్ 18న నిర్వహిస్తారు. దీన్నే 'ఇంటర్నేషనల్ డే ఫర్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్' అని కూడా పిలుస్తారు. ప్రపంచంలోని వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి ప్రాముఖ్యతను చెప్పి, భవిష్యత్తు తరాల కోసం వాటిని రక్షించాల్సిన అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం.

**చారిత్రక నేపథ్యం:**

ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ (ఐసీఓఎంఓఎస్) సంస్థ 1982, ఏప్రిల్ 18న మొదటిసారి ఈ దినోత్సవాన్ని ప్రతిపాదించింది. 1983లో యునెస్కో ఇదే తేదీన ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించింది.

ప్రాకృతిక, సాంస్కృతిక వారసత్వ వనరులు ప్రపంచ మానవాళి ఉమ్మడి సంపద. ప్రపంచ మానవులంతా ఒక్కటేనన్న భావనను పెంపొందించడానికి, వివిధ దేశాలూ, ప్రాంతాల్లోని వారసత్వ చిహ్నాలను పరిరక్షించడానికి యునెస్కో శ్రమిస్తోంది. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రభుత్వాలకు, ప్రజలకు గుర్తుచేస్తోంది. ఏప్రిల్ 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం.



మన దేశంలో ప్రాంతీయ, జాతీయ, చారిత్రక ప్రాధాన్యమున్న స్థలాలూ కట్టడాలను కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖలు కాపాడుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి కలిగిన వాటిని యునెస్కో ఆధ్వర్యంలోని ప్రపంచ వారసత్వ కేంద్రం గుర్తించి, పరిరక్షిస్తోంది. ఇప్పటిదాకా యునెస్కో 168 దేశాల్లో సుమారు 1223 వారసత్వ స్థలాలు, కట్టడాలను గుర్తించింది. వీటిలో మన దేశంలోవి 43 ప్రదేశాలున్నాయి. తెలుగువారంతా గర్వించేలా తెలంగాణ నుంచి రామప్ప దేవాలయానికి వీటిలో చోటు దక్కింది.

**నియమాలకు అనుగుణంగా...**

ప్రపంచ స్థాయి చారిత్రక ప్రదేశం, కట్టడం, ప్రాకృతిక సుందర ప్రదేశంగా ప్రకటించే ఎంపిక ప్రక్రియలో పది నియమాలు ఉంటాయి. వాటిలో ఒకటైన అత్యుత్తమ సార్వత్రిక విలువను కలిగి ఉండాలన్న నిబంధనలకు లోబడి మన దేశంలో 62 ప్రదేశాలు తాత్కాలిక జాబితా వరకు వెళ్లాయి. వాటిలో హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, కుతుబ్‌షాహీ సమాధులు, చార్మినార్, ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షి వీరభద్రాలయ సముదాయాలు, ఏకశిల నంది విగ్రహాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రపంచ వారసత్వ కేంద్రం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తే 15 ఏళ్ల ఎదురుచూపులు ఫలిస్తాయి. అందుకు ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకుని వివిధ విభాగాల సమన్వయంతో ప్రభుత్వాలు చొరవ చూపాలి. వరంగల్ కోట, అలంపూర్‌లోని నవ బ్రహ్మేశ్వరాలయ సముదాయాలు, గుత్తి దుర్గం, కొండవీటి కోట, ముఖలింగంలోని మధుకేశ్వర భీమేశ్వరాలయ సముదాయం లాంటి చారిత్రక కట్టడాలను ప్రపంచస్థాయి కట్టడాల జాబితాలో చేర్చేందుకు ఎంపిక ప్రక్రియ నియమాలకు అనుగుణంగా ప్రతిపాదలను సిద్ధం చేయాలి. అందుకోసం సుశిక్షితులైన నిపుణులను సంప్రదించాలి.

**ప్రపంచస్థాయి వారసత్వ స్థలాలు, కట్టడాల జాబితాలో మనవి..**

ఆగ్రా కోట, ఫతేపూర్ సిక్రి, అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటా గుహలు, తాజ్‌మహల్, భీంబేట్కాలోని రాతి ఆవాసాలు, చంపానేర్- పావగఢ్ ఆర్కియోలాజికల్ పార్క్, సాంచీ బౌద్ధ కట్టడాలు, ఢిల్లీలోని హుమాయూన్ సమాధి, కుతుబ్‌మినార్, డార్జిలింగ్ పర్వత రైల్వే, ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్, ఢిల్లీలోని ఎర్రకోట, జైపూర్‌లోని జంతర్‌మంతర్, రాజస్థాన్ గిరి దుర్గాలు, నలందాలోని నలందా మహావిహార, పటన్‌లోని రాణీకీ వావ్, చండీగఢ్‌లోని లే కార్బుజియర్ నిర్మించిన వాస్తు కట్టడాలు, అహ్మదాబాద్ చారిత్రక నగరం, ముంబయిలోని విక్టోరియన్ గోథిక్, కళాత్మక నిర్మాణాలు, ధోలావీరా-హరప్పా నగరం, అస్సాంలోని మియోడమ్స్.

**మహాబలిపురం, హంపీ స్మారక చిహ్నాలు**

కజిరంగా, కియోలాదేవ్, సుందరబన్ జాతీయ ఉద్యాన వనాలు, మానస్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, నందాదేవి పువ్వుల లోయ జాతీయ ఉద్యానాలు, హిమాలయాల్లోని నేషనల్ పార్కు కన్జర్వేషన్ ఏరియా, కాంచన్‌జంగా జాతీయ ఉద్యానం, శాంతినికేతన్, పశ్చిమ కనుమలు.

కోణార్క్ సూర్య దేవాలయం, తమిళనాడులోని గంగైకొండ చోళపురం, తంజావూరులోని బృహదీశ్వరాలయం, దారాసురంలోని ఐరావతేశ్వర ఆలయం, పట్టదకల్ దేవాలయాలు, ఖజురహో దేవాలయం, బోధ్‌గయలోని మహాబోధి ఆలయం, బేలూరు చెన్నకేశవ, హలేబీడు-హోయసలేశ్వర, సోమనాథ్‌పూర్ కేశవ(హోయసల) దేవాలయాలు, గోవా చర్చిలు, కాన్వెంట్లు.

**థీమ్:** "సంఘర్షణలు మరియు విపత్తుల సందర్భాలలో జీవన వారసత్వం కోసం అత్యవసర ప్రతిస్పందన". ICOMOS ద్వారా స్థాపించబడిన ఈ థీమ్, విపత్తులు మరియు సంఘర్షణల వల్ల ముప్పు పొంచి ఉన్న సాంస్కృతిక ప్రదేశాలకు అత్యవసర పరిస్థితి, స్థితిస్థాపకత మరియు రక్షణను బలోపేతం చేయడంపై దృష్టి పెడుతుంది.

**అత్యధిక ప్రపంచ వారసత్వ స్థలాలు కలిగిన టాప్-10 దేశాలు**

| ర్యాంక్ | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| దేశం | ఇటలీ | చైనా | జర్మనీ | ఫ్రాన్స్ | స్పెయిన్ | భారత్ | మెక్సికో, బ్రిటన్ | రష్యా | ఇరాన్ | జపాన్, అమెరికా |
| సంఖ్య | 60 | 59 | 54 | 53 | 50 | 43 | 35 | 32 | 28 | 26 |


- కొత్వాల్ సచిన్,
m : 86866 64949
e: desk.deccan@gmail.com

# సార్వభౌమత్వ విత్తనాలు

## సమాజ నేతృత్వంలోని విత్తన పునరుజ్జీవనం భారతదేశంలో వ్యవసాయాన్ని ఎలా మారుస్తోంది.




కెఎస్ఎస్ఎస్ యొక్క సీడీబీ ప్లాట్‌ను సందర్శిస్తున్న రైతులు

ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల రైతులు సమిష్టిగా వాతావరణాన్ని తట్టుకునే దేశీయ విత్తనాలను తిరిగి పొందుతున్నారు. ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించుకుంటున్నారు. సమాజ నాయకత్వం ప్రధానాంశంగా స్థితిస్థాపకంగా ఉండే ఆహార వ్యవస్థలను పునర్నిర్మిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోని బలోదబజార్–భటపారా జిల్లాలోని కాస్డోల్ బ్లాక్‌లోని గ్రామాలు ఒకప్పుడు నీటిపారుదల కొరత, పేలవమైన కనెక్టివిటీ మరియు ప్రభుత్వ పథకాలపై తక్కువ అవగాహనతో సతమతమయ్యాయి. చాలా కుటుంబాలు తమ జీవనోపాధి కోసం రోజువారీ కూలీ కార్మికులపై ఆధారపడి ఉన్నాయి. స్థానిక లాభాపేక్షలేని 'కల్ప సమాజ్ సేవి సంస్థ' (KSSS) 2016లో ఇక్కడ పనిచేయడం ప్రారంభించింది. 21 గ్రామాలలో నిర్వహించిన ప్రాథమిక సర్వేలో జీవనోపాధి తక్కువగా ఉండటం, వడ్డీ వ్యాపారులపై భారీగా అప్పులు చేయడం మరియు నిర్ణయం తీసుకునే ప్రదేశాలలో మహిళలు లేకపోవడం వంటివి వెల్లడయ్యాయి. అయినప్పటికీ ఆ సమాజాలు లోతైన సాంప్రదాయ వ్యవసాయ జ్ఞానం మరియు బలమైన సామాజిక బంధాలను కలిగి ఉన్నాయి. తరువాతి దశాబ్దంలో బయటపడినది వ్యవసాయ జోక్యం కంటే చాలా ఎక్కువ. ఇది విత్తన సార్వభౌమత్వంపై ఆధారపడిన సామాజిక పరివర్తన.

ప్రారంభంలో 'కెఎస్ఎస్ఎస్' సామాజిక పునాదులను నిర్మించడంపై దృష్టి పెట్టింది. ఇది ప్రతి గ్రామంలో ఒకటి, మహిళల నేతృత్వంలోని గ్రామ అభివృద్ధి కమిటీలతో పాటు 21 స్వయం సహాయక బృందాల (SHGs) ఏర్పాటుకు దోహదపడింది. నీటి సదుపాయం, ఆహార భద్రత, హక్కులు, పాలన ప్రక్రియలలో పాల్గొనడం వంటి స్థానిక సమస్యలపై చర్చించడానికి మహిళల కోసం మహిళా గ్రామ సభలు ప్రత్యేక స్థలాలను సృష్టించాయి. SHGsని బ్యాంకులకు అనుసంధానించడం వల్ల దోపిడీ రుణాలపై ఆధారపడటం తగ్గింది. అంతే కాకుండా సామూహిక పొదుపులు బలపడ్డాయి. పోషకాహారం తదుపరి ప్రవేశ స్థానంగా మారింది. 2017లో గృహ కిచెన్ గార్డెన్లు – చిన్న 20×20 మరియు 30×30 అడుగుల ప్లాట్లు కాలానుగుణ కూరగాయలను సరఫరా చేయడం ప్రారంభించాయి. చాలా కుటుంబాలకు, దీని అర్థం మెరుగైన ఆహారం, తక్కువ ఆహార ఖర్చులు. నేలను నిర్మించడం.

2018లో కల్ప సమాజ్ బిట్కులి గ్రామంలో సేంద్రియ వరి సాగును ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. రైతులు లైన్ సీడింగ్, యాంత్రిక కలుపు మందులు, సహజ వ్యవసాయంలో ఉపయోగించే పులియబెట్టిన సూక్ష్మజీవుల ద్రావణం అయిన జీవామృతంతో ప్రయోగాలు చేశారు. సాంప్రదాయ రసాయన సాగు కంటే దిగుబడి కొంచెం తక్కువగా ఉంది. కానీ సాగు ఖర్చులు బాగా తగ్గాయి. నేల ఆరోగ్యం స్పష్టంగా మెరుగుపడింది. తక్కువ ఇన్‌పుట్ వ్యవసాయం ఆర్థికంగా, అర్థవంతంగా ఉంటుందని రైతులు చూడటం ప్రారంభించారు.

2019లో వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్ (వాసన్), రివైటలైజింగ్ రెయిన్‌ఫెడ్ అగ్రికల్చర్ (ఆర్ఆర్ఎ) నెట్‌వర్క్ నేతృత్వంలోని నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ ఎవాల్వింగ్ సీడ్ సిస్టమ్స్ ఫర్ ట్రెడిషనల్ వెరైటీస్‌లో కెఎస్ఎస్ చేరినప్పుడు నిర్ణయాత్మక మార్పు వచ్చింది.



గోధుమ పంట వైవిధ్య ప్లాట్

అప్పటి వరకు విత్తన పునరుద్ధరణ ప్రయత్నాలు చెల్లాచెదురుగా, ప్రదర్శన ఆధారితంగా ఉండేవి. భాగస్వామ్యం నిర్మాణాన్ని ప్రవేశపెట్టింది. ఈ జోక్యం దేశీయ రకాలను పరిరక్షించడం, భాగస్వామ్య రకాల ఎంపిక, వికేంద్రీకృత విత్తన ఉత్పత్తి ప్లాట్లు, ప్రామాణిక విత్తన ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్‌పై దృష్టి పెట్టింది. క్రమబద్ధమైన డేటా రికార్డింగ్ వృత్తాంత పరిశీలనను భర్తీ చేసింది.

ప్రారంభంలో అర్హార్, మినుములు, పెసలు వంటి మిశ్రమ పంటలతో పాటు నాలుగు సాంప్రదాయ వరి రకాలను ప్రదర్శించారు. త్వరలోనే, సఫేద్ లోచాయ్, రామ్ జీరా, మధురాజ్, సిజి సుగంధిత్, బ్లాక్ రైస్, లోహండి వంటి ఆరు దేశీ వరి రకాలు రైతు నెట్‌వర్క్‌లలోకి ప్రవేశించాయి. 2020 మరియు 2022 మధ్య, రైతులు జవాఫూల్ అనే సువాసనగల రకంపై సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్ (SRI)తో ప్రయోగాలు చేశారు. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి. అధిక పిలకలు వేయడం, బలమైన అనుసరణ, దేశీయ విత్తనాలపై కొత్త ఆసక్తి.

**పంట వైవిధ్యం**

2023లో రైతు మనుజ్ రామ్ ప్రధాన్ క్షేత్రంలో దియోతరై గ్రామ పంచాయతీలో 'క్రాప్ డైవర్సిటీ బ్లాక్' (CDB) స్థాపించబడింది. ఇరవై ఐదు సాంప్రదాయ వరి రకాలను ప్రతిరూప ప్లాట్లలో సాగు చేశారు. మొదటిసారిగా, రైతులు క్రమపద్ధతిలో పంట డేటాను పరిశీలించి నమోదు చేశారు. భాగస్వామ్య రకాల ఎంపిక విభిన్న ప్రాధాన్యతలను వెల్లడించింది. గృహ ఆహార భద్రతను నిర్ధారించడానికి మహిళలు స్వల్పకాలిక రకాలను ఇష్టపడ్డారు. పురుషులు ధాన్యం నాణ్యత, మార్కెట్ విలువపై దృష్టి సారించారు. ఈ చర్చలు భవిష్యత్ గుణకార నిర్ణయాలను రూపొందించాయి.

డైవర్సిటీ బ్లాక్ నుండి విత్తనాలను 20-25 మంది రైతులతో పంచుకున్నారు. కమ్యూనిటీ స్థాయిలో స్కేలింగ్ ప్రారంభించారు. అధిక దిగుబడినిచ్చే సాంప్రదాయేతర రకం కొంతకాలం వ్యవస్థ లోకి ప్రవేశించినప్పుడు కూడా, రైతులు దానిని నిలిపివేసి, దేశీయ విత్తన సార్వభౌమత్వానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

2024 నాటికి మూడు అదనపు CDBలు స్థాపించబడ్డాయి. జోలార్, దేశీ దుబ్రాజ్, మధురాజ్, బోర్ చారి వంటి రకాల విత్తన ఉత్పత్తి ఐదు క్వింటాళ్లకు చేరుకుంది. 55 మంది రైతులకు పంపిణీ చేయబడింది.

2025 నాటికి ముగ్గురు రైతులు డైవర్సిటీ బ్లాక్‌లలో 32 దేశీ రకాలను నిర్వహిస్తున్నారు. 39 మంది రైతులు 8.53 ఎకరాల్లో సాంప్రదాయ వరిని సాగు చేశారు.

**ఉత్తరప్రదేశ్‌లో కూడా ఇలాంటి కథే..**

ఉత్తరప్రదేశ్‌లోని అటార్రాలో కూడా ఇలాంటి పరివర్తనే జరిగింది. అక్కడ జైవిక్ గ్రామ్ రైతు ఉత్పత్తిదారు సంస్థ (FPO) 2015 నుండి సాంప్రదాయ విత్తనాలతో అనధికారికంగా ప్రయోగాలు చేస్తోంది. సంవత్సరాలుగా ఈ పని అనుభవ ఆధారితంగా, చెల్లాచెదురుగా ఉంది. మూడు సంవత్సరాల క్రితం FPO WASSAN తో సహకరించినప్పుడు అది మారిపోయింది. ఎక్స్‌పోజర్ సందర్శనలు, సాంకేతిక సెషన్‌లతో ప్రారంభమైన భాగస్వామ్య శిక్షణ విత్తన వైవిధ్య నిర్వహణ, సేంద్రీయ ఉత్పత్తి పద్ధతులు, డేటా డాక్యుమెంటేషన్‌పై స్పష్టతను తీసుకువచ్చింది. పది దేశీ వరి రకాలతో ప్రారంభించి వరి, గోధుమల కోసం కమ్యూనిటీ వైవిధ్య బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. ప్రభావం కనిపించింది.

కలనామక్, మహాచిన్నవర్ వంటి రకాలు దిగుబడి, ధాన్యం నాణ్యత, మార్కెట్ ధరలలో బలంగా పనిచేశాయి. రైతుల

భాగస్వామ్యం 4-5 హెక్టార్లలో సాగు చేయబడినప్పటి నుండి రెండేళ్లలో దాదాపు 50 హెక్టార్లకు పెరిగింది. గతంలో కొద్దిమంది మాత్రమే సాగు చేసిన రైతులు ఇప్పుడు 50 మంది రైతులు సాగులో నిమగ్నమై ఉన్నారు.

గోధుమలలో, పదిహేను సాంప్రదాయ రకాలను మూల్యాంకనం చేశారు. వాటిలో లోక్-1, సి-306 వంటి రెండు చెక్ రకాలు ఉన్నాయి. సాంప్రదాయ రకాలతో తులనాత్మక అధ్యయనాన్ని ప్రారంభించడానికి చెక్ రకాలను చేర్చారు. సాంప్రదాయ రకాల్లో, బన్సీ, పైగాంబరి, బ్లాక్ వీట్ గణనీయంగా పనిచేశాయి. లోక్-1, సి-306 పనితీరుకు సరిపోతాయి. ఇవి ఇప్పుడు విస్తృతంగా గుణించబడుతున్నాయి. ఈ మార్పు సాగు ప్రాంతంలో మాత్రమే కాదు; అది అవగాహనలో ఉంది. సాంప్రదాయ విత్తనాలను ఇకపై తక్కువ దిగుబడినిచ్చేవిగా చూడలేదు. కానీ ఆచరణీయమైన, లాభదాయకమైన ప్రత్యామ్నాయాలుగా గుర్తించబడ్డాయి.

**వైవిధ్యభరితమైన వ్యవసాయ వ్యవస్థలు**

జైవిక్ గ్రామ్ FPO తన పనిని విత్తన పునరుజ్జీవనంతో పాటు సమగ్ర వ్యవసాయ నమూనాగా విస్తరించింది. ప్రదర్శన ప్లాట్లలో, రైతులు సేంద్రీయ ఇన్పుట్ తయారీ, పండ్లు, కూరగాయల సాగు, ఔషధ మొక్కలు, పశువుల ఏకీకరణ, చేపల పెంపకం మరియు నీటి రీఛార్జ్ నిర్మాణాలు ఒకే వ్యవస్థగా పనిచేస్తున్నట్లు చూడవచ్చు. ఏడాది పొడవునా ఆహారం, పశుగ్రాసం, ఆదాయ భద్రతను నిర్ధారిస్తూ ఒకే పంట ఆర్థిక వ్యవస్థలు, బాహ్య ఇన్పుట్లపై ఆధారపడటాన్ని తగ్గించడం దీని లక్ష్యం. ఈ చొరవ ఇప్పుడు దాదాపు ఇరవై ఐదు గ్రామాలకు విస్తరించింది. రైతులు పీర్ లెర్నింగ్, స్థిరమైన సాంకేతిక మద్దతును కీలకమైన డ్రైవర్లుగా పేర్కొంటారు.

కాన్డోల, అటార్రా ఇద్దరూ ఇలాంటి కథనే చెబుతారు. సాంకేతిక మార్గదర్శకత్వం, హ్యాండ్‌హోల్డింగ్ మద్దతు, సంస్థాగత సదుపాయం కీలక పాత్ర పోషిస్తాయి. కానీ నిజంగా మార్పుకు దారితీసినది సమాజ యాజమాన్యం. ఒకప్పుడు సమావేశాలకు హాజరు కావడానికి సంకోచించిన మహిళలు ఇప్పుడు రికార్డులను నిర్వహిస్తున్నారు. పంట వైవిధ్య బ్లాక్‌లకు నాయకత్వం వహిస్తున్నారు. ఇతరులకు శిక్షణ ఇస్తున్నారు. బాహ్య మార్కెట్లు, హైబ్రిడ్ విత్తనాలపై ఆధారపడిన రైతులు తమ సొంత స్థానిక రకాలను సంరక్షించడం, గుణించడం, మార్పిడి చేసుకోవడం చేస్తున్నారు. ఈ ప్రాంతాలలో విత్తన సార్వభౌమత్వం అంటే ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం, నేల ఆరోగ్యాన్ని బలోపేతం చేయడం, వ్యవసాయ జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించడం, నిర్ణయం తీసుకునే శక్తిని తిరిగి పొందడం.

తదుపరి దశలు ప్రతిష్ఠాత్మకమైనవి. కాన్డోల్‌లోని కమ్యూనిటీలు స్థానిక విత్తన బ్యాంకును స్థాపించడం, యువతను పరిరక్షణ ప్రయత్నాలలో నిమగ్నం చేయడం గురించి ఆలోచిస్తున్నాయి. అటార్రాలో, FPO విత్తన నెట్‌వర్క్‌లను ఏకీకృతం చేస్తోంది. సాంప్రదాయ రకాలకు మార్కెట్ సంబంధాలను బలోపేతం చేస్తోంది. ఇవి భారతదేశ విస్తారమైన వ్యవసాయ ప్రకృతి దృశ్యంలో చిన్న భౌగోళిక ప్రాంతాలు. అయినప్పటికీ అవి శక్తివంతమైన పాఠాన్ని అందిస్తాయి. కమ్యూనిటీలు తమ విత్తనాలను నియంత్రించినప్పుడు స్థితిస్థాపకత పెరుగుతుంది.



కల్పసమాజ్ సేవి సంస్థ యొక్క సీడీబీ ప్లాట్‌లో బ్యూషనింగ్ ప్రాక్టీస్

వాతావరణ అనిశ్చితి, పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చుల యుగంలో, దేశీయ రకాల పునరుద్ధరణ అనేది నేలలో పాతుకుపోయిన సాంస్కృతిక పరిరక్షణ, వాతావరణ అనుకూలత, రైతుల ఆర్థిక, సామాజిక సాధికారత వైపు ఒక మార్గం.

**-జయంత కుమార్ పధియారీ, ఎం. లీలావతి** వీరిద్దరూ *హైదరాబాద్ లోని వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్ (వాసన్) కోసం సీడ్ సిస్టమ్ - ప్రోగ్రామ్ ఆఫీసర్‌లుగా పనిచేస్తున్నారు.*


**-అభిజిత్ మొహంతి,** *భువనేశ్వర్‌లోని వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్ (వాసన్) కోసం నాలెడ్జ్ బిల్డింగ్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.*

**-సతానిక్ సిల్,** *రామకృష్ణ మిషన్ వివేకానంద ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థి, వ్యవసాయం, గ్రామీణ మరియు గిరిజన అభివృద్ధిలో ప్రత్యేకత కలిగి ఉన్నాడు. వీరు హైదరాబాద్‌లోని వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్ (వాసన్)లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశాడు.*

*ఫోటోలు: వాసన్.*

– 'డౌన్ టు ఎర్త్' వెబ్‌సైట్ సౌజన్యంతో

***జర్నలిజం ముఖ్యంగా రేడియోకు సంబంధించిన ఆడియో జర్నలిజం గురించి దాదాపు సమగ్రమైన అవగాహన కల్పించేందుకు ఈ మూడు పుస్తకాలు దోహదపడతాయి.***




## రేడియో ప్రసారాల పరిణామం

**చారిత్రక, సాంకేతిక సృజనాత్మక నేపథ్యం:**


సాంకేతిక పరమైన మార్పులను చెప్పడమే కాకుండా భారత దేశపు చరిత్రతో పాటు తెలుగు రేడియో కేంద్రాలు లోనైన చారిత్రక పరిణామాలను ఇందులో వివరించాను. రేడియో మాధ్యమంలో గొప్పగా పాసించిన వారి ప్రసార సామర్థ్య మర్మాలను చెప్పడంతో పాటు ఇప్పుడు ప్రవేశించాలనుకునే వారికి కొన్ని సూచనలు కూడా లభిస్తాయి. వెల: 135 రూపాయలు.




## సిగ్నేచర్ ట్యూన్

**ఆకాశవాణిలో నాగసూరి బాణి:**

మూడు దశాబ్దాల పైచిలుకు నా రేడియో ఉద్యోగ మజిలీలో తారసపడిన విజయవంతమైన ప్రయోగాల సాధకబాధకాలు బ్రాడ్ కాస్టింగ్ ప్రవేశించా లనుకునే వారికి కచ్చితంగా దోహదపడతాయి. వెల: 153 రూపాయలు.




## తెలుగు జనమాధ్యమాలు

**జనమాధ్యమాల్లో తెలుగు:**

పత్రికారంగం, రేడియో, టెలివిజన్ ఈ మూడు మాధ్యమాలకు సంబంధించి భారత దేశంలో వాటి ప్రవేశం, ఎదుగుదల, ప్రభావం, ప్రస్తుత స్థితి సంబంధించి, ఆ పరిణామాల గురించి వివరంగా చెప్పడంతో పాటు ఈ మూడు మాధ్యమాలలో భాషను ఎలా వాడాలో వివరించే ప్రయత్నం ఈ పుస్తకంలో కనబడుతుంది. ఇందులోని విషయాలను ఆకళింపు చేసుకోవడం ద్వారా ఈ మూడు మాధ్యమాలలో రాణించే అవకాశం పుష్కలంగా ఉంటుంది. వెల: 200 రూ.

**గమనిక:**

ఈ మూడు పుస్తకాలను ఒకేసారి కొనాలనుకునే వారు 500 రూ.లు పంపితే రిజిస్టర్ పోస్టులో నేరుగా మీ ఇంటికి అందుతాయి.

**చిరునామా:** Dr. Nagasuri Venugopal
B-517, Villa Heights, Brahman wadi, Begumpet
Hyderabad-500 016 Telangana Mobile: 9440732392

ద

# ఉపాధ్యాయునికి ఒక లేఖ

ఎంతమంది టీచర్లు తరగతికి వెళ్ళే ముందు పుస్తకాలు చదువుతున్నారు? ఎంతమంది టీచర్లు మరుసటి రోజు తరగతుల కోసం పుస్తకాల నుండి నోట్స్ తయారు చేసుకుంటున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయి. చాలా మంది టీచర్లు పాత నోట్స్ మీద ఆధారపడుతున్నారు. కొత్త పుస్తకాలు చదవడం, కొత్త సమాచారాన్ని సేకరించడం చాలా తక్కువ మంది మాత్రమే చేస్తున్నారు.

మలాలా యూసఫ్ జాయ్ అన్నట్లు, ఒక పుస్తకం, ఒక పెన్ను, ఒక బిడ్డ, ఒక ఉపాధ్యాయుడు ప్రపంచాన్ని మార్చగలరు. ఈ మాటల్లోని అంతరార్థం ఏమిటంటే, ప్రపంచ మార్పుకు మూలబిందువు ఉపాధ్యాయుడే. అయితే, ఆ మార్పు ను సాధ్యం చేయాలంటే ఉపాధ్యాయుడు స్వయంగా జ్ఞాన సముపార్జనలో నిరంతరం నిమగ్నమై ఉండాలి. ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విస్తృతమైన సాహిత్యలోకాన్ని అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



### పుస్తకం- ఒక జ్ఞానదీపం:

సాధారణంగా ఉపాధ్యాయులు సిలబస్ మారినప్పుడు లేదా పరీక్షల సమయంలో మాత్రమే పుస్తకాలను ఆశ్రయిస్తుంటారు. కానీ నిజమైన ఉపాధ్యాయుడు అంటే కేవలం సిలబస్ బోధించేవాడు కాదు. జ్ఞానాన్ని పంచేవాడు. నేడు సాహిత్యం, చరిత్ర, రాజకీయాలు, సైకాలజీ, జీవిత చరిత్రల వంటి అంశాలపై ఉపాధ్యాయుల్లో పఠనాభిరుచి తగ్గిపోవడం ఆందోళనకరం. ప్రతి ఉపాధ్యాయుడి ఇంట్లో ఒక చిన్న బుక్ షెల్ఫ్ ఉండటం వారి వృత్తిపరమైన గౌరవానికే కాకుండా, వారి మానసిక వికాసానికి కూడా ఎంతో అవసరం. రోజుకు కనీసం అరగంట పుస్తక పఠనం చేయడం వల్ల వృత్తిపరమైన ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుంది.

### ఆదర్శప్రాయమైన బోధనా పద్ధతులు:

విద్యార్థులు ఉపాధ్యాయులను తమ రోల్ మోడల్స్‌గా భావిస్తారు. తరగతి గదిలోకి వెళ్లేటప్పుడు ఉపాధ్యాయుడి చేతిలో మొబైల్ ఫోన్ ఉంటే విద్యార్థులు అదే అలవాటు చేసుకుంటారు. అదే ఉపాధ్యాయుడి చేతిలో ఒక మంచి పుస్తకం ఉంటే, అది విద్యార్థుల్లో తెలియని కుతూహలాన్ని పెంచుతుంది. టీచర్లు పుస్తకాలు చదివితేనే విద్యార్థులకు మంచి పుస్తకాలను పరిచయం చేయగలరు. కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, ఆ పాఠాలకు సంబంధించిన లోతైన విషయాలను ఇతర గ్రంథాల నుండి సేకరించి చెప్పినప్పుడే విద్యార్థులకు సబ్జెక్టుపై ఆసక్తి కలుగుతుంది.

### పఠన వాతావరణం, గ్రంథాలయాలు:

పాఠశాలల్లో కేవలం లైబ్రరీ పీరియడ్ ఉంటే సరిపోదు. ప్రతి తరగతి గదిలో క్లాస్ రూ మ్ లైబ్రరీ లేదా ఒక చిన్న పుస్తకాల మూల ఉండాలి. విద్యార్థుల కు స్టేట్ లైబ్రరీలు, పబ్లిక్ లైబ్రరీల గురించి అవగాహన కల్పించాలి. ఉపాధ్యాయులు విద్యార్థులను స్వయంగా గ్రంథాలయాలకు తీసుకెళ్లి, అక్కడ సభ్యత్వం ఎలా తీసుకోవాలి, పుస్తకాలను ఎలా వెతకాలి వంటి విషయాలను నేర్పించాలి. జపనీస్ సామెత చెప్పినట్లు, వెయ్యి రోజుల అధ్యయనం కంటే ఒక గొప్ప గురువుతో గడిపే ఒక రోజు విలువైనది. ఆ సమయం గ్రంథాలయంలో గడిపితే ఇంకా ఉత్తమం.

### బుక్ క్లబ్‌ల అవశ్యకత:

నేడు నవోదయ, గురుకుల పాఠశాలలు, కాలేజీలలో టీచర్స్ బుక్ క్లబ్‌లను ఏర్పాటు చేయడం అత్యంత అవసరం. వారానికి ఒక పుస్తకాన్ని చదివి, దానిపై చర్చలు జరపడం వల్ల ఉపాధ్యాయుల్లో విశ్లేషణాత్మక శక్తి పెరుగుతుంది. నీలమ్ దీక్షిత్ వంటి విద్యావేత్తల పరిశీలన ప్రకారం, నిరంతరం పుస్తకాలు, వార్తాపత్రికలు చదివే ఉపాధ్యాయులు బోధనలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ప్రోగ్రెస్ రిపోర్టుల్లో కూడా పఠనా భిరుచికి సంబంధించిన కాలమ్‌ను చేర్చడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించవచ్చు.


### ప్రామాణిక గ్రంథాల అధ్యయనం:

ఉపాధ్యాయులు తమ సబ్జెక్టుకు సంబంధించిన ప్రామాణిక రచయితల పుస్తకాలను తప్పక చదవాలి. ఉదాహరణకు, సైన్స్ టీచర్లు ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ పుస్తకాలను, రాజనీతి శాస్త్ర

ఉపాధ్యాయులు ప్లేటో, అరిస్టాటిల్ రచనలను అధ్యయనం చేయాలి. అలాగే మనస్తత్వ శాస్త్రానికి సంబంధించి సిగ్మండ్ ఫ్రాయిడ్ వంటి వారి రచనలు చదవడం వల్ల విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడం సులభమవుతుంది. టొటొ చాన్ లేదా టు సర్, విత్ లవ్ వంటి పుస్తకాలు చదివినప్పుడు విద్యార్థులతో ఎలా ప్రవర్తించాలో, వారిలోని అంతర్గత శక్తులను ఎలా వెలికితీయాలో ఉపాధ్యాయులకు అవగతమవుతుంది.

**గ్రంథాలయాల సందర్శన:**

'వెయ్యి రోజుల శ్రద్ధగల అధ్యయనం కంటే గొప్ప గురువుతో ఒక రోజు మంచిది. - జపనీస్ సామెత. ప్రతి నెలా ఒకసారి టీచర్లు, విద్యార్థులు కలిసి సమీపంలోని గ్రంథాలయాన్ని సందర్శించాలి. అక్కడ కొన్ని గంటలు గడిపి పుస్తకాలు చదవాలి. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని వివిధ విభాగాల గురించి, వివిధ రకాల పుస్తకాల గురించి విద్యార్థులకు వివరించాలి. గ్రంథాలయంలో సభ్యత్వం ఎలా తీసుకోవాలో, పుస్తకాలు ఎలా సేకరించాలో నేర్పించాలి. ఇలా చేయడంవల్ల విద్యార్థులు గ్రంథాలయాల పట్ల ఆకర్షితులవుతారు..




**పుస్తకాల కేటాయింపు:**

ప్రతి టీచర్ విద్యార్థికి కొన్ని పుస్తకాలు కేటాయించాలి. ఆ పుస్తకాలు నిర్ణీత సమయంలో చదివి పూర్తి చేయాలి. ఆ పుస్తకాలపై చర్చలు, సమీక్షలు నిర్వహించాలి. ఇలా చేయడం వల్ల పుస్తక పఠనం ఒక అలవాటుగా మారుతుంది. విద్యార్థులు తమకు కేటాయించిన పుస్తకాలను చదవడంతో పాటు, ఇతర పుస్తకాలను కూడా చదవడానికి ప్రోత్సాహం లభిస్తుంది.

**పాఠ్యప్రణాళికలో మార్పులు - జాతీయ ప్రమాణాలు:**

మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యప్రణాళికలో మార్పులు రావాలి. ప్రాజెక్ట్ వర్క్ కోసం కేవలం ఇంటర్నెట్ సమాచారంపై ఆధారపడకుండా, గ్రంథాలయాల్లోని పుస్తకాలను సూచించే విధంగా విద్యా విధానం ఉండాలి. జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి. ఉపాధ్యాయులు పుస్తక ప్రదర్శనలకు హాజరవుతూ, కొత్తగా వస్తున్న పుస్తకాలను సమీక్షిస్తూ ఉండాలి. పాత నోట్స్ మీద మాత్రమే ఆధారపడటం వల్ల విద్యార్థులకు కాలం చెల్లిన సమాచారం అందుతుంది, ఇది నేటి పోటీ ప్రపంచంలో వారికి నష్టం కలిగిస్తుంది.

**ఉపాధ్యాయుల పఠన అలవాట్లు - వాస్తవ పరిశీలన:**

ఎంతమంది టీచర్లు తరగతికి వెళ్ళే ముందు పుస్తకాలు చదువుతున్నారు? ఎంతమంది టీచర్లు మరుసటి రోజు తరగతుల కోసం పుస్తకాల నుండి నోట్స్ తయారు చేసుకుంటున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయి. చాలా మంది టీచర్లు పాత నోట్స్ మీద ఆధారపడుతున్నారు. కొత్త పుస్తకాలు చదవడం, కొత్త సమాచారాన్ని సేకరించడం చాలా తక్కువ మంది మాత్రమే చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులకు అందించే సమాచారం కూడా పాతదిగా మారిపోతుంది. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు తాజా సమాచారం కోసం ఎదురుచూస్తుంటారు. అలాంటి సమయంలో టీచర్లు పుస్తక పఠనాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదు.

**కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ అవసరం:**

ఉపాధ్యాయుల కోసం నిరంతర విద్యా కార్యక్రమాలు తప్పనిసరి చేయాలి. ఈ కార్యక్రమాలు టీచింగ్ పద్ధతుల్లోనే కాకుండా, వారి సంబంధిత విభాగాల్లో కూడా నిర్వహించాలి. తాజా పరిశోధనలు, కొత్త సిద్ధాంతాలు, అత్యాధునిక బోధనా పద్ధతుల గురించి టీచర్లకు అవగాహన కల్పించాలి. ప్రాజెక్ట్ వర్క్ ద్వారా టీచర్లు తమ జ్ఞానాన్ని విద్యార్థులకు అందించేలా ప్రోత్స హించాలి. పుస్తక ప్రదర్శనలు, పుస్తక సమీక్షలు, రచయితలతో సమావేశాలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలి.

**టీచర్లూ... ఏం చదువుతున్నారు?:**


చివరగా, టీచర్లు తను వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడానికి, విద్యార్థులతో మెరుగైన అనుబంధం ఏర్పరచుకోవడానికి, వ్యక్తిగత ఒత్తిడిని తగ్గించుకోవ దానికి పుస్తక పఠనం ఎంతో అవసరం. ప్రతి టీచర్ తమ నివా సంలో ఒక చిన్న పుస్తకాల మూలనైనా ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయం తమ టైమ్ టేబుల్ లో పుస్తక పఠనానికి సమయం కేటాయించాలి. టీచర్లు చదివిన పుస్తకాల సమీక్షలు నిర్వహించాలి. విద్యార్థులతో కలిసి పుస్తక చర్చలు జరపాలి. ఇలా చేయడం వల్ల టీచర్లలో పఠనాభిరుచి పెరగడమే కాకుండా విద్యార్థులకు నుంచి స్ఫూర్తి లభిస్తుంది. పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఎన్నో. కాబట్టి ప్రతి టీచర్ కూడా పాఠకులుగా మారాలి. నేటి తరం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలంటే టీచర్లు తప్పక పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలి, పుస్తకాలు మాత్రమే టీచర్లకు సరైన దిశను చూపించగలవు.

-డా. రవికుమార్ చేగోని
*తెలంగాణ గ్రంథాలయ సంఘం కార్యదర్శి*

# పూటకూళ్ళవ్వ

(గత సంచిక తరువాయి)

(**జరిగిన కథ:** రాజా రామ్మోహన్ రాయ్ తన జీవితంలో జరిగిన ఒక ప్రమాదకరమైన సంఘటన మరియు దాని నుండి ఎలా బయట పడ్డాడో వివరిస్తూ.. ఆ సంఘటన వలన తనకు స్ఫురించిన భావాలే నేడు విడిది లోని బోర్డు మీద మంచి మాటలుగా, నీతి వాక్యాలుగా రాసానని తెలియచేస్తారు.)



తెల్లవారి అనుకున్న విధంగా 'కొమ్మాల' లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకున్నారు రామ్మోహన్ రాయ్. అక్కడ శిలాఫలకం మీద తన తల్లి "యశోద" పేరు చూసి కళ్ళు చెమర్చాయి. తన తల్లిదండ్రుల ఆశీర్వాదమే మొన్నటి ప్రమాదం నుండి తనను గట్టెక్కించేలా చేసింది అనుకొని ఆ శిలాఫలకంకు కూడా దండం పెట్టుకొని తిరిగి పూటకూళ్ళవ్వ విడిదికి చేరుకున్నారు.

అలా రెండు రోజులు గడిచిపోయాయి.

ఆరోజు ఉదయం అల్పాహారం సేవించగానే అవ్వ దగ్గరికి వచ్చి కూర్చున్నారు రామ్మోహన్ గారు.

ఆఫీస్ రూమ్ లో రిజిస్టర్ చూస్తున్న అవ్వ.. వారిని చూసి "చెప్పండి బాబూ ఎలా ఉంది మా విడిది?" "మీకు ఎన్ని రోజులు ఇక్కడ ఉండాలనిపిస్తే అన్ని రోజులు ఉండండి. హాయిగా గడపండి. వీలైతే మీ కుటుంబాన్ని కూడా నాలుగు రోజులు ఇక్కడ ఉండటానికి రమ్మనండి. అందరూ కలిసి ఉన్నట్టుగా ఉంటుంది" అంది.

"నేనూ అదే అనుకుంటున్నాను. అంతేకాకుండా మీకు మరో విషయం చెబుదామని వచ్చాను" అన్నారు రామ్మోహన్ గారు.

"అవునా.. అయితే మొహమాట పడకుండా చెప్పండి" అంది అవ్వ.

"ఏం లేదు అవ్వా! నాకెందుకో ఈ విడిది కోసం, ఇక్కడికి రోజూ వచ్చే పిల్లల కోసం.. చుట్టుపక్కల ఉండే పిల్లల కోసం.. ఏదైనా చేయాలని ఉంది. అందుకే మీ విడిదికి ఆనుకొని ఉన్న మీ ఖాళీ జాగా ఉంది కదా! అక్కడ ఒక బడిని ప్రారంభించి అందరికీ ఉచిత విద్యను అందిద్దాం అనిపిస్తోంది. అది కూడా మీరు అనుమతి ఇస్తేనే.." అన్నారు రామ్మోహన్ గారు.

ఊహించని విషయంతో ఆశ్చర్యంగా చూస్తున్న అవ్వను చూసి.. "ఖర్చు అంతా నేనే భరిస్తాను ఎంత అవసరమో అంత నేను అక్కడి నుండి ఎప్పటికప్పుడు పంపిస్తుంటాను" అన్నారు.

అవ్వకు ఆనందంతో హృదయం ఉప్పొంగిపోయింది. ఎప్పటినుండో ఇలాంటి కోరిక తనలో ఉన్నా.. అది సాధ్యం కాదని ఆ ఆలోచన విరమించుకుంది. మొదటి నుండి ఎవరినీ ఏమీ అడగని అవ్వ.. ఈ ప్రతిపాదనకు కూడా మొహమాటంతో కొంచెం ఆలోచిస్తూ. "మీరు ఇంత పెద్ద బాధ్యత తీసుకుంటారా? మీకు సాధ్యమవుతుందా! సందేహపడింది అవ్వ.

"అవ్వా! నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. నేను చేయగలను..

మీ సహకారం ఉంటే చాలు" అన్నారు రామ్మోహన్ గారు.

"ఇప్పుడు మంచి రోజులే కాబట్టి త్వరలో భూమి పూజ చేసి ముందుగా రెండు గదులు కట్టిద్దాం. ముందు ముందు అన్ని వసతులు ఏర్పాటు చేద్దాం" అంటూ అప్పటికప్పుడు చెక్కు మీద 50,000 రూపాయలు రాసి సంతకం పెట్టి అవ్వ చేతిలో పెడుతూ "మంచి పనులు ఎప్పుడూ వాయిదా వేయకూడదు" అంటూ నవ్వారు రామ్మోహన్ గారు.

ఒక విధమైన ఉద్వేగానికి లోనవుతూ చేతిలోని చెక్కును చూసి ఆశ్చర్యపోయింది. అందులో "రాజేందర్" అని సంతకం చేసి ఉంది. అది చూసి అవ్వ సందేహం అర్థం చేసుకున్న రామ్మోహన్ అవ్వతో ఇలా అన్నారు.. "అవ్వా! నా అసలు పేరు రాజేందర్.



కానీ, ముంబై వెళ్లాక నేను చేసే సాయం.. అందరికీ అండగా ఉండటం చూసి నేను చెప్పినా వినకుండా ప్రేమతో అందరూ ఒక బిరుదు లాగా నా పేరును ఆ సంఘసంస్కర్త పేరుగా మార్చారు. వాళ్ళ మాట కాదన లేక నేను దానికి అలవాటు పడిపోయాను. అఫీషియల్‌గా తప్ప అంతటా నా పేరు అలాగే చెప్పటం అలవాటయింది." అని చెబుతుండగానే పోస్ట్ అన్న కేక వినబడింది. రామ్మోహన్ గారే పోస్ట్ అందుకున్నారు. "రుద్రమ" పేరు మీద ఉంది అడ్రస్. నా పేరే 'రుద్రమ' అంటూ.. ఫరవాలేదు... ఓపెన్ చేసి చదవండి. నాకు పెద్దగా రహస్యాలు, సొంత విషయాలు ఏమీ ఉండవు" అంది అవ్వ.

సరేనంటూ తీసి చదువుతుంటే... ఇద్దరూ ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. అది ప్రభుత్వం తరపున వచ్చిన లేఖ. అందులో త్వరలో రాబోయే ఉగాది సందర్భంగా.. అవ్వ అందిస్తున్న నిస్వార్థ సేవలకు, ప్రేమకు, విడిది పరిశుభ్రతకు మొదలగు అనేక అంశాలను పరిగణించి మహిళల విభాగంలో ఉత్తమ సేవా పురస్కారం- ఉగాది 2026 స్వీకరించాలని' ఆహ్వానం పంపారు..

'కంగ్రాచులేషన్స్.. అవ్వా!" సంతోషంగా అభినందించారు రాజేందర్ గారు.

"థాంక్స్" అన్నట్టుగా చేతులు జోడించింది అవ్వ..

అవ్వ పర్మిషన్ ఇవ్వటంతో వెంటనే "భూమి పూజ" పనులు ప్రారంభించారు.

ఆరోజు దశమి.. సోమవారం.. భూమి పూజకు ముహూర్తం పెట్టారు.

అవ్వ పూజకు అంతా సిద్ధం చేసి తను కూడా రెడీ అయివచ్చి... అక్కడి సీన్ చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది.

ఎదురుగా విడిదికి విచ్చేసిన పూర్వ అతిథులు అందరూ నిలబడి ఉన్నారు. అందరూ పూల దండలు ఒక చేతిలో.. విడిపూలు ఒక చేతిలో... పట్టుకొని ఉన్నారు. అవ్వ అక్కడికి చేరుకోగానే అందరూ ఒకేసారి అవ్వ పైకి పూలరెమ్మలు ఎగరేసి చప్పట్లు కొట్టారు. అక్కడ వేసిన ప్రత్యేక కుర్చీ పైన అవ్వని కూర్చోబెట్టి అందరూ మెడలో దండలు వేసారు. కొంతమంది పట్టు వస్త్రాలతో సన్మానించారు. అవ్వకు "కంగ్రాట్స్" అంటూ అభినందించారు. ఇంత మంది అభిమానం చూసి అవ్వ కళ్ల నుండి ఆనందభాష్పాలు రాలుతుండగా "ఇదంతా ఎలా సాధ్యమైంది? వీళ్లంతా ఎలా ఒకేసారి రాగలిగారు..'' ఆశ్చర్యపోతూ రామ్మోహన్ రాయ్ వైపు చూసింది..

"నేనే మీ రిజిస్టర్‌లో ఉన్న నంబర్లు అన్నీ చూసి.. అందరికీ కాల్ చేసి పిలిపించాను" నవ్వుతూ అన్నారు రామ్మోహన్ గారు.

"నిజంగా మీరు ఆ సంఘసంస్కర్త పేరును ధరించడానికి అర్హులే. మీకు ఎంత కృతజ్ఞతలు చెప్పినా తక్కువే అంది అవ్వ.

"మీరు చూపించే సమయస్ఫూర్తి.. మీరు అందించే సేవ.. ప్రేమ ముందు మేమెంత అవ్వా!" "అందుకే మీకు ప్రభుత్వం అవార్డును అందిస్తున్నారు. మీకు మరొక్క మారు అభినందనలు" అంటూ నమస్కరించారు రామ్మోహన్‌గారు.

"భూమి పూజ" కూడా నిర్విఘ్నంగా పూర్తి చేసారు. తెల్లవారి అందరూ దగ్గరుండి అవ్వను అవార్డు కార్యక్రమానికి సాగనంపారు.

-సమాప్తం-

- మాదారపు వాణిశ్రీ
ఫోన్ : 9247286668
బొమ్మలు: కైరం బాబు



బాల **చెలిమి**

పిల్లల వికాస పత్రిక

ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

## తెలంగాణ బడి పిల్లల కథలు

10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)

10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు

18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్

చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**

హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**

Account Name : Bala Chelimi

Bank Name : Canara Bank

A/c. No. : 30101010003714

Branch : Ashoknagar, Hyderabad.

IFSC Code : CNRB0013010

**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు

'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,

హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029

ఫోన్ : 9030 6262 88

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

SCAN & PAY

DECCAN LAND,
ISSN 2581-3188


Telugu Monthly Magazine Date of Publication 26th - March 2026
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

**VOL 14వ వసంతంలో**

**164 ISSUES నూట అరవై నాల్గవ సంచిక**

**పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్**



**దక్కన్ ల్యాండ్**

## పదమూడు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2026 ఏప్రిల్ సంచికతో 164 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar